ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-9-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 211 పేజీలు: 8+16 వెల: 6.50


భారత్‌పై ఆంక్షలు విధించండి: అమెరికా 5లో

4 బిల్లులకు అసెంబ్లీ పచ్చజెండా 6లో

# సిబిఐకి కాళేశ్వరం కేసు

## కెసిఆర్, హరీష్ లక్ష కోట్ల దోపిడీకి పాల్పడ్డారు

- కాళేశ్వరం ప్రాజెక్టు లోపభూయిష్టం
- తెలంగాణకు మరణశాసనం రాశారు
- నిజాంకంటే శ్రీమంతుడు కావాలని కలలుగన్న కెసిఆర్
- ఘోష్‌ను కించపరుస్తూ వారు మాట్లాడారు, దానిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నా
- అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ అనంతరం ప్రకటించిన సిఎం రేవంత్


ఆదివారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 31:** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై నిగ్గుతేల్చేందుకు సమగ్ర దర్యాప్తుకోసం సిబిఐకి అప్పగించడమే సముచితమని రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిప్రకటించారు. సమగ్ర రికార్డులను కేంద్ర దర్యాప్తుసంస్థకు అప్పగిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. సిబిఐ విచారణతోనే కాళేశ్వరం అక్రమాలు వెలుగులోకి వస్తాయని అందువల్లనే సిబిఐ దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అన్నారు. లక్షకోట్లతో తెలంగాణ రాష్ట్రానికి మరణ శాసనం రాశారని.. అందుకు సహకరించిన మాజీ ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నివే >>7

## నెలాఖరులోగా స్థానిక ఎన్నికలు

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు

### నేడు గవర్నర్‌ను కలుస్తాం: మంత్రి పొన్నం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 31:** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ల నిబంధన ఎత్తివేస్తూ, వెనుకబడిన తరగతుల(బిసి)కు రిజర్వేషన్లు పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఆదివారంఏకగ్రీవంగా ఆమోదించింది. అసెంబ్లీలో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిన అనంతరం బిసి సంక్షేమం, రవాణా మంత్రి >>2


ఆదివారం అసెంబ్లీలో హరీష్ రావు

## హక్కులును కాలరాసిన ఘోష్ కమిటీ

### 8బి కింద నోటీసులివ్వలేదు..

### ప్రాజెక్టుతో కెసిఆర్‌కు పేరు వస్తుందనే కేసులు వేశారు

### దానిపై ముందునుండే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

### -తీవ్రంగా విమర్శించిన హరీష్

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** జస్టిస్ పిసి ఘోష్ విచారణ కమిటీ తమ హక్కులను కాలరాసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం నివేదికపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ పిసి ఘోష్ ఎఫెక్ట్ పీపుల్ అయిన మా హక్కులను కాలరాశారన్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేసి, మాకు మాట్లాడే అవకాశం ఇవ్వరా? అని ప్రశ్నించారు. 660 పేజీల నివేదికపై అరగంటలోనే అన్నీ మాట్లాడాలంటే >>2




## సభకు సమర్పించిన కాళేశ్వరం నివేదిక

### నాలుగేళ్లలోనే కుప్పకూలిన ప్రాజెక్టు

### డ్యామ్‌కు, బ్యారేజీకు తేడా లేకుండా నిర్మించారు

### లక్ష కోట్లు వృథా: అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్


అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నాలుగేళ్లలోనే కూలిపోయిందని నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద మానవ తప్పిద మని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ పిసి ఘోష్ >>7

## కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారు

### కోట్లు కొల్లగొట్టేలా అంచనాలు పెంచారు

### ఘోష్‌పై అభాండాలు సరికాదు..

### కెసిఆర్ సభకు వచ్చి జవాబిస్తే హుందాగా ఉంటుంది

### వాస్తవాలు మాట్లాడని హరీష్ రావు: డిసిఎం భట్టి


ఆదివారం అసెంబ్లీలో డి.సిఎం భట్టి

**హైదరాబాద్, ఆగస్టు31,ప్రభాతవార్త:** కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కాళేశ్వరం అంచనాలు పెంచారని లక్షల కోట్లు కొల్లగొట్టారని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. పిసి ఘోష్ కమిషన్ నివేదిక అసెంబ్లీలో పెట్టొద్దని, చర్చ చేయొద్దని హైకోర్టుకు వెళ్లి చేయాల్సింది అంతా మీరే చేశారని మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. జస్టిస్ పిసి ఘోష్ పై అబాండాలు వేస్తూ మాట్లాడడం సరైనది కాదని ముఖ్యమంత్రి కెసిఆర్ సభకు వచ్చి మాట్లాడితే హుందాగా ఉండేదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సభకు వచ్చి >>2


ఆదివారం తియాంజిన్ ఎస్‌సిఒ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోడీ, జిన్‌పింగ్

## పోటీదారులం కాదు.. భాగస్వాములం

### ద్వైపాక్షిక భేటీ తర్వాత ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

### తియాంజిన్‌లో ఉభయ నేతల శిఖరాగ్ర భేటీ

### సరిహద్దుల్లో శాంతియుత వాతావరణంపై సంతృప్తి

### బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్‌ను ఆహ్వానించిన మోడీ

**బీజింగ్ ఆగస్టు 31:** భారత్,చైనాలు పరస్పరం పోటీదారులుకావని, అభివృద్ధిలో భాగస్వాములని ప్రధానిమోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాలుగా మారకూడదని వారు బలమైన ఏకాభిప్రాయానికి >>2

## 3 ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణ ముందుకు

### కేరళ వయోజన విద్యా కార్యక్రమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శం

### కెసి వేణుగోపాల్ ఇస్తున్న మెరిట్ అవార్డులకు ఎంతో ప్రత్యేకత

### అలెప్పుళలో ఎంపి మెరిట్ అవార్డుల కార్యక్రమంలో సిఎం రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** దేశంలో విద్యకు, కేరళ రాష్ట్రానికి బలమైన సంబంధం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో వంద శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం కేరళ అని, ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న వయోజన విద్యా కార్యక్రమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆదివారం కేరళ అలెప్పుళలో మెరిట్ విద్యార్థులకు అందించే ఎంపి మెరిట్ అవార్డు - 2025 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కెసి వేణుగోపాల్ ఎల్లప్పుడూ పేదలపట్ల, అణగారిన వర్గాల కోసం పోరాడుతూనే ఉంటారన్నారు. అణిచివేతకు, అన్యాయానికి గురవు తున్న బాధితుల తరపున వారు గొంతుకగా నిలుస్తున్నారని, కెసి వేణుగోపాల్ తన నియోజకవర్గంతో పాటు కేరళ రాష్ట్రానికే కాకుండా యావత్‌దేశంలో ఎస్సీ,ఎస్టీ, ఓబిసి, మైనారిటీ, ప్రత్యేకించి మహిళలు, పిల్లల న్యాయం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నారు. వేణుగోపాల్ 2006లో ప్రారంభించిన పొంథువల్ (ఎంపి) మెరిట్ అవార్డులకు దేశంలోనే చాలా ప్రత్యేకత ఉందన్నారు. 10వ తరగతి,



ఆదివారం అలెప్పుళలో జరిగిన ఎంపి మెరిట్ అవార్డు-2025లో పాల్గొన్న సిఎం రేవంత్‌కు మొమెంటో ప్రదానం చేస్తున్న ఎంపి కెసి వేణుగోపాల్

12వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి, వారిలో ఒక స్ఫూర్తిని నింపడానికి ఈ మెరిట్ అవార్డులు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఈ యేడాది వందశాతం ఫలితాలను సాధించిన 150 పాఠశాలల్లో దాదాపు 3,500 లకుపైగా >>2



## బిసి రిజర్వేషన్లపై కెసిఆర్ సీలింగ్ విధించలేదు..


### లొసుగులు లేకుండా చట్టాలు చేస్తే న్యాయవ్యవస్థ అడ్డురాదు

### డిక్లరేషన్ కాదు.. డెడికేషన్ ఉండాలి

### పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై కెటిఆర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 31:** తెలంగాణలోని బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయడం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పంచాయతీ రాజ్ చట్ట సవరణపై ఆదివారం అసెంబ్లీలో వాడి వేడిగా చర్చ జరిగింది. చర్చ సందర్భంగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటి రామారావు మాట్లాడారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో బిసి రిజర్వేషన్లపై సీలింగ్‌విధించారని మంత్రి సీతక్క వ్యాఖ్యానించడం శుద్ధతప్పని.. అది 100 శాతం అబద్ధమని కెటిఆర్ స్పష్టంచేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో లొసుగులు లేకుండా చట్టాలు సరిగ్గా చేస్తే న్యాయవ్యవస్థ అడ్డురాదని.. శాస్త్రీయంగా చేయాలంటున్నామని అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో మద్దతు తెలుపుతున్నామన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లకు సీలింగ్ విధించారన్నది శుద్ధతప్పన్నారు. ఆర్టికల్ 243డీ6, టీ6 ద్వారా బిసి రిజర్వేషన్లు రాష్ట్రాలకే ఇచ్చుకోవచ్చని ఆదేశాలు వచ్చాయని దాన్ని అనుసరించి కొత్త పంచాయతీరాజ్ చట్టం తెచ్చామని రిజర్వేషన్లు కల్పించుకున్నామన్నారు. 396 జీవో ద్వారా 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని.. ఆ రోజు తెలంగాణ ప్రభుత్వం 396 జీవో ఇస్తే.. వెంటనే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గోపాల్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టుకు పోయి అడ్డుకున్నారు. గోపాల్ రెడ్డి రేవంత్ రెడ్డికి సన్నిహిత బంధువు.. కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూడా. కాంగ్రెస్ పార్టీ నిర్వాకం వల్లే ఇది జరిగిందన్నారు.

సిఎం రాజకీయపరమైన అంశాలు మాట్లాడకపోతే మేం కూడా మాట్లాడం.. కానీ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని చెబుతున్నామని కెటిఆర్ తెలిపారు. 15 రోజులు సభ నడపకుండా ప్రభుత్వం పారిపోతుంది. అన్ని సమస్యలపై చర్చిద్దామంటే రేవంత్ సర్కార్ ముందుకురావడం లేదు. బీహార్‌లో ఉన్న కొన్ని పత్రికల్లో ఇక్కడి >>2



ఆదివారం రాత్రి గన్‌పార్క్‌వద్ద ధర్నాచేసి కాళేశ్వరం రిపోర్టు ప్రతులను డస్ట్‌బిన్‌లో వేస్తున్న బిఆర్‌ఎస్ నాయకులు

## అర్ధరాత్రి బిఆర్‌ఎస్ నేతల ధర్నా

### సభ జరుగుతుండగా వాకౌట్ చేసి గన్‌పార్కు చేరిన కెటిఆర్, హరీష్, ఇతర నేతలు

### కమిషన్ నివేదిక ప్రతులు చించివేసి డస్ట్‌బిన్‌లో వేసిన వైనం

**హైదరాబాద్,ఆగస్టు31, ప్రభాతవార్త:** కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకునేందుకు మహిళా మార్షల్స్‌ను రంగంలోకిదింపింది. అధికార పక్షం. దాంతో.. ప్రభుత్వ తీరును నిరసిస్తూ తమకు మైక్ ఇవ్వడం లేదని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చారు. అక్కడి నుంచి గన్‌పార్క్ వద్ద అమరువీరుల స్థూపం వద్దకు వెళ్లారు. కెటిఆర్, హరీశ్‌రావుతో పాటు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు అక్కడ కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌కాపీలను చెత్తబుట్టలోవేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అది ట్రాష్ రిపోర్ట్, అది చెత్త రిపోర్ట్ అంటూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాళేశ్వరంపై చర్చ జరగాలి అనుకుంటున్నప్పుడు తమకు మైక్ ఎందుకు ఇవ్వట్లేదని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అక్కడినుంచి నేరుగా గన్‌పార్క్ చేరుకున్నారు కెటిఆర్, హరీశ్‌రావు. మహిళా మార్షల్స్ నుఉపయోగించి తమను అడ్డుకోవాలని చూసిన రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. తెలంగాణను జలసౌధంగా మార్చిన కెసిఆర్‌పై కేసులు పెడుతారా?అని కాంగ్రెస్ సర్కార్ హరీష్ దుయ్యబట్టారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్దిపొందేందుకు బిఆర్‌ఎస్ నాయకులను రేవంత్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందిన ఆయన విమర్శించారు.ఎమ్మెల్యేలు సబిత, కొత్త ప్రభాకర్ రెడ్డి, గంగుల కమలాకర్, కాలేరు వెంకటేశ్, పద్మారావు, సునీతా లక్ష్మా రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మరో నెల రోజులు భారీ వర్షాలే..

### ఈశాన్య, తూర్పు, దక్షిణాదిలో అత్యధిక వర్షపాతం సూచన

### ఆకస్మిక వరదలకు అవకాశం

### ఐఎండి డిజి మృత్యుంజయ్ మహాపాత్ర

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశంలో సెప్టెంబరు నెలలోనూ సాధారణంకంటే ఎక్కువ వర్షాలే కురిసే అవకాశం ఉందనిభారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. సాధారణంగా ఏటా సెప్టెంబరులో 167.9 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుంటుంది. అయితే ఈసారి అదే నెలలో సాధారణం కంటే 109 శాతంఎక్కువ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఈశాన్య భారత్, తూర్పు భారత్, దక్షిణ భారత్, వాయవ్య భారత్‌లోని పలు ప్రాంతాల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలే పడొచ్చని తెలిపింది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో సాధారణ స్థాయిలో, సాధారణాన్ని మించిన స్థాయిలో వర్షాలుంటాయని తెలిపింది. ఆదివారం దిల్లీలో విలేకరుల సమావేశంలో ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహాపాత్రా ఈ వివరాలను వెల్లడించారు. సెప్టెంబరులో ఉత్తరాఖండ్, దక్షిణ హరియాణా, దిల్లీ, ఉత్తరరాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తాయని దీనివల్ల ఆకస్మికవరదలు సంభవించి, కొండచరియలు విరిగిపడి జనజీవనం స్తంభించే >>2

## సినీ కార్మికులకు 15% వేతనాల పెంపు

### ఫిల్మ్ ఛాంబర్ కీలక ప్రకటన

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** వేతనాల పెంపు తదితర సమస్యలపై తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని కార్మికులు సమ్మెన కొనసాగిస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు 15 శాతం మేర పెంచుతూ ఫిల్మ్ ఛాంబర్ ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది, తమ కష్టానికి తగిన వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ తెలుగు ఫిల్మ్ కార్మికులు బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే. 30 శాతం వేతనాలు పెంచుతూ నిర్మాతలు ప్రకటన చేసే వరకు తాము షూటింగ్‌లలో పాల్గొనబోమని ఈ నెల 3న తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రకటన విడుదల చేసింది. అనంతరం 4వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించి, దాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సమ్మె విషయమై వివిధ అంశాలపై ప్రొడ్యూసర్లు, కార్మిక సంఘాలు, ఫిల్మ్ ఛాంబర్ మధ్య పలు దఫాలుగా జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఈ నేపథ్యంలో కార్మికులు సమ్మెను ఇంకా కొనసాగిస్తున్నారు. అయితే ఎవరూ ఊహించని విధంగా రోజు ఫిల్మ్ ఛాంబర్ >>2



ఆదివారం తియాంజిన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇతర మంత్రులతో సమావేశమైన ప్రధాని మోడీ

# నెలాఖరులోగా స్థానిక ఎన్నికలు

>> పొన్నం ప్రభాకర్ అసెంబ్లీ మీడియా లాంజ్‌లో విలేకరులతో చిట్ చాట్ చేశారు. సోమవారం గవర్నర్ దగ్గరికివెళ్తామని, అన్ని పార్టీలనుండి ప్రతినిధులు గవర్నర్‌ను కలుస్తామన్నారు. ఇదే అంశంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ అడుగుతున్నామని.. కానీ ఇవ్వడం లేదన్నారు. సోమవారం గవర్నర్‌ను కలిసి పరిస్థితిని అఖిలపక్షం తరఫున వివరిస్తామన్నారు. రాష్ట్రంలో స్థానికంగా జరిగే ఎన్నికలపై రాష్ట్రాలు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని గవర్నర్‌కి వివరిస్తామన్నారు. మా విధానం మేం చెప్తామని.. అయితే నిర్ణయం గవర్నర్ ఇష్టమని అన్నారు. న్యాయపరంగా అన్ని విషయాలు తెలుసుకొని ఈ నిర్ణయానికివచ్చామని మంత్రి పొన్నంతెలిపారు. సభలో అందరికీ ఏకాభి ప్రాయం ఉన్న విషయాన్ని గవర్నర్ పరిగణనలోకి తీసుకోవాలని. బలహీన వర్గాల మేధావులు మా ప్రయత్నాన్ని గుర్తించాలని కోరారు. సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఎన్నికలకు వెళ్తామన్నారు. తాను లా చదివానని.. కానీ ప్రాక్టీస్ చేయలేదన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టసభలే ఫైనల్ అని.. మూడ్ ఆఫ్ ది హౌజ్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సోమవారం బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం ఆల్ పార్టీ నేతలు గవర్నర్‌ను రిప్రజెంటేషన్ ఇచ్చేందుకు అపాయింట్‌మెంట్ కోరడం జరిగిందన్నారు. బిసి మేధావులు, సంఘ నాయకులు అందరికి విన్నవిస్తున్నామని.. బిసి రిజర్వేషన్ 42శాతం అమలు కోసం ప్రభుత్వం అన్ని అవకాశాలను అన్వేషిస్తుందన్నారు. సుప్రీం కోర్టు రివ్యూ జరుగుతుందని... 2012లో రిజర్వేషన్ పరిమితిపై సుప్రీంకోర్టు తీర్పు ఉందని.. అన్ని పార్టీల సభ్యులు ఏకాభిప్రాయంతో ఉంటే ముందుకు వెళ్లవచ్చు నేడే తీర్పు సారాంశమన్నారు.

# ఘోష్ కమిటీ

>> ఎలా? ఇది సాధ్యమయ్యే పనేనా? అని అన్నారు. కమిషన్ నివేదికపై రేపు, ఎల్లుండి కూడా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. నాకు రెండుగంటల సమయం ఇవ్వాలి. మధ్యలో జోక్యం చేసుకోవద్దు. ఆదివారం రోజు సభలో నివేదిక పెట్టారంటేనే వారి ఉద్దేశం అర్థమవుతుందన్నారు. కోర్టుకు వెళ్లడం మాకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు గతంలో ఇలాంటి విషయాలపై ఇందిరాగాంధీ, అద్వానీ కూడా కోర్టుకు వెళ్లారు. ఆదరాబాదరాగా ఆదివారం సభలో పెట్టారంటేనే మీ కుట్రలు అర్థమవుతున్నాయన్నారు. మీరు చేసిందంతా పొలిటికల్ డ్రామా అని తెలుస్తోంది. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ దర్యాప్తు నిష్పాక్షి కంగా జరిగిందా? లేదా?తేలాలి. నిష్పాక్షికంగా జరగకపోతే ఆ కమిషన్ నివేదిక చిత్తుకాగితమని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. మాకు 8బి కింద నోటీసులు ఇవ్వలేదని, మాపై చేయబోతున్న ఆరోపణల గురించి ఆ వివరాలు చెప్పి దానిపై మా వివరణ తీసుకోవాల్సి న బాధ్యత ఉందన్నారు. తనను గానీ, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను గానీ, ఇంకా పిలిచిన నేతలు, అధికారులకు కూడా నాకు తెలిసిన వరకు 8బీ కింద నోటీసులు ఇవ్వలేదన్నారు. క్రాస్ ఎగ్జామినేషన్‌కు అవకాశం ఇవ్వలేదన్నారు. ఈవిచారణ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనేది సుస్పష్టంగా కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసలు మేడిగడ్డ వద్ద లోపం ఏర్పడక ముందే కాళేశ్వరంపై దుష్ప్రచారాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రారంభించా రన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కూడా మేం సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ముందే మేనిఫెస్టోలో పెట్టిందని, కాంగ్రెస్ ముందు నుంచి కూడా ఈ ప్రాజెక్టుకడితే కెసిఆర్‌కి, బిఆర్‌ఎస్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని కోర్టుల్లో కేసులువేసి అడ్డుకున్నారని, భూ సేకరణను సైతం అడ్డుకున్నారన్నారు. అనేక ఆరోపణలు చేస్తూ వచ్చారు. దాంట్లో భాగంగానే ఈ ఘోష్ కమిషన్ వేసి రాజకీయమైన కక్ష సాధింపునకు ఈ ప్రభుత్వం దిగుతుందన్నారు. వాస్తవాలు చట్టానికి లోబడి ఉండాల్సి ఉండగా, ఘోష్ కమిషన్ రిపోర్ట్‌లో ఎక్కడా లేదనాననరు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుందని అన్నారు.హైడ్రాలజీ విభాగం చెప్పిన లెక్కల ఆధారంగా మీరు ఏదైతే.. 160 టిఎంసిల నీరు అక్కడ తీసుకోవాలనుకుంటు న్నారో ఆ నీరు అక్కడ లేవు అని ఎవరు చెప్పారు? కేంద్ర జలసంఘం చెప్పిందన్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ 8.2.2015లో లేఖ ఇచ్చింది. మా ప్రభుత్వం ఏర్పడింది జూన్ 2, 2014నఅన్నారు. ఆనిమిది నెల కాలంలో నీళ్ల మంత్రిగా తాను మహారాష్ట్రకు వెళ్లి ఆ నాటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రి ముషరఫ్‌ని కలిసి మాట్లాడాను. ఆయనను కలిసి వచ్చాను, మేం ప్రాణహిత కట్టుకుంటాం అనుమతి ఇవ్వాలని అడిగితే.. మీరు మరిచిపోండి అన్నారు. ఆనాడు ఢిల్లీలో కాంగ్రెస్, ఏపిలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్.. మావోళ్ల కాంగ్రెసోళ్లు ఉన్నప్పుడు ఏడు సంవత్సరాలు అడిగితే అనుమతి ఇవ్వలేదు. మా రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. మేం అనుమతి ఇచ్చే ప్రశ్నే లేదని ఆ నాటి కాంగ్రెస్ మంత్రి చెప్పారన్నారు. అంతేకాకుండా తమకు 8బి ప్రకారం నోటీసులు ఇవ్వకుండా గతంలో విచారణ కమిషన్ల నివేదికలు ఏమయ్యాయో తెలుసుకుంటే బాగుంటుందన్నారు. రాంకృష్ణ దాల్మియా వర్సెస్ జస్టిస్ టెండూల్కర్ కేసులో విచారణ కమిషన్‌ను రాజకీయ అస్త్రం వాడుకోవద్దని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. కాళేశ్వరంపై మొదటి నుంచి చెబుతూ వస్తున్న గోబెల్స్ చరిత్రను చూస్తే ఈ కమిషన్ రిపోర్టును పొలిటికల్ వెపన్‌గా వాడుతున్నారని సుస్పష్టంగా అర్థమవుతుం దన్నారు. విచారణ కమిషన్ అయినా విచారణ సందర్భంలో 1952 చట్టాన్ని మీరకూడదని, చట్టం పరిధిలో నిష్పాక్షికంగా విచారణజరపాలని కుండబద్దలుకొట్టినట్లు సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఘోష్ కమిషన్ 8బి కింద మాకు నోటీసులు ఇవ్వలేదని, విచారణ నిష్పాక్షికంగా జరుపలేదన్నారు. ఇదంతా రాజకీయ డ్రామా అని, తాము ఎక్కడ సుప్రీంకోర్టుకు వెళ్తామో ఎక్కడ ఈ కమిషన్ రిపోర్ట్ క్వాష్ అవుతుందో సభలోపెట్టారన్నారు. ఇందులోసత్తాలేదు.. ఇందులో నియమ నిబంధనలు పాటించలే దనే విషయం ముఖ్యమంత్రికి బాగా అర్థమైందన్నారు. అందుకే సిఎం సుప్రీంలో కేవిట్ వేశారన్నారు. కోర్టులో మళ్లీ రేపేమాపో డిస్కషన్‌కు వస్తుంది కదా? ఈలోపు స్టేవస్తే క్వాష్ అయిపోతుందేమోనని ఆదరబాదరాగా ఆదివారం నాడురిపోర్ట్‌పెట్టారంటేనే కుట్రఏమిటో స్పష్టంగాప్రజలకు అర్థమవుతుంద న్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రిలిమినరీ రిపోర్ట్, పార్లమెంట్ ఎన్నికలకు ముందు మధ్యంతర నివేదిక అన్నారు. మా సిల్వర్ జూబ్లీ జరుపుకుంటే ఫైనల్ రిపోర్ట్ అని, ఇప్పుడు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రేపే మాపో వస్తుంది కనుక పిసి ఘోష్ రిపోర్ట్ అన్నారు. ఇవన్నీ రాజకీయ డ్రామాలే అన్నారు. వీళ్ల సర్కస్ నడుపుతున్నరా? సర్కార్ నడుపుతున్నారా? నాకైతే తెలియదన్నారు. పిసి ఘోష్ కమిషన్ విచారణ చట్టబద్ధంగా, విధివిధానాలను పాటిస్తూ జరిగిందా? లేదా? అనేది చర్చించాల్సి న అవసరం ఉందన్నారు. తాను చెబుతున్న విషయాలు సాంకేతిక పరమైనవి కావు.

# కుమ్మక్కయ్యారు..

>> సమాధానం చెబితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. పది సంవత్సరాలు మాకు మైక్ ఇవ్వకపోయినా అడిగి అడిగి అలిసిపోయే మే తప్ప సభను వదిలిపెట్టి ఏనాడు పోలేదని ఆయన గుర్తుచేశారు. కేవలం ఐదుగురు సభ్యులం 10 సంవత్సరాల పాటు పోరాటం చేశామని తెలిపారు.సభలో ఎప్పుడు చర్చ జరిగిన హరీష్ రావు వాస్తవాలు మాట్లాడరు. తప్పుడు కాగితాలు సృష్టిస్తారు. హరీష్ రావు ఏ అంశం తీసుకున్న అది తప్ప మిగతా అన్ని అంశాలు మాట్లాడతారు.టిఆర్‌ఎస్ 10 సంవత్సరాల పరిపాలనలో గోదావరి నదిపై కాంగ్రెస్ మొదలుపెట్టిన ప్రాణహిత చేవెళ్ల, కంతనపల్లి, తుపాకులగూడెం, ఇందిరా రాజీవ్ సాగర్ దుమ్ముగూడెం ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే. బనకచర్ల ప్రాజెక్టు అంశం చర్చకు వచ్చేదే కాదు బనకచర్ల తెరపైకి రావడానికి కారణం టిఆర్‌ఎస్ నేతలే అని ఆయన అన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక చెత్తబుట్ట అంటేతగదని ప్రజలు మిమ్ములను ఎక్కడ వేశారో టిఆర్‌ఎస్ నేతలకు తెలుసుకొని మాట్లాడాలని హితవుచెప్పారు.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును త్వరితగతన పూర్తి చేసి ఉంటే కేవలం 38 వేల కోట్లతో 16.4 సున్న లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. తెలంగాణ రాష్ట్రంలోఏడు జిల్లాలకు తాగునీరు హైదరాబాద్ జంట నగరాల అవసరాలకు 30 టీఎంసీలు తాగునీరు అందేది. హైదరాబాద్ చుట్టుపక్కల పరిశ్రమలకు 16 టిఎంసిల నీరు అందుబాటులోకి వచ్చేది.భారీ వరదలను తట్టుకొని వందల సంవత్సరాల క్రితం నిర్మించిన నిజాంసాగర్ పోచారం వంటి ప్రాజెక్టులు నిలబడ్డాయి. లక్షన్నర కోట్లు వెచ్చించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకుండానే కుంగిపోయింది జ్యూడిషల్ రిపోర్టును ఒక చెత్త రిపోర్టు అంటారు మరి మీరు దేనికి ఒప్పుకుంటారు హరీష్ రావు. మీరంతా అతీతుల, దైవంశ సంభూతులాపది సంవత్సరాలు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్‌రావు మమ్ములను పొలిటికల్ డ్రామా నడుపుతున్నారు సర్కస్ నడుపుతున్నారు అనడం భావ్యమేనా తప్పు చేయకపోతే గోష్ కమిషన్‌పై టిఆర్‌ఎస్ నేతలు హైకోర్టుకు ఎందుకు వెళ్లారు ఘోష్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయాలి? ఈ రాష్ట్రాన్ని కాపాడడానికి ఏం చేయాలి అన్న ఆలోచనతోనే సభ దృష్టికి ఘోష్ రిపోర్టు తెచ్చాం ప్రణహిత చేవెళ్ల కోసం 11,680 కోట్లు ఖర్చుపెట్టారు. 38,500 కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో 11680 కోట్లు పోగా మిగిలిన 27,500 కోట్లు ఖర్చు పెడితే 16.40 ఎకరాలకు సాగునీరు అందేది లక్ష కోట్లకు అంచనాలు పెంచి కాళేశ్వరం కట్టారు 152 మీటర్ల ఎత్తున కట్టాల్సి న ప్రాణహిత చేవెళ్లను వదిలేసి 100 మీటర్లకు ఎత్తు తగ్గించి మేడిగడ్డ అన్నారం నిర్మించారు లిఫ్ట్ చేసిన నీళ్ల కంటే కిందికి వదిలిన నీళ్లే ఎక్కువ, కాళేశ్వరం ద్వారా నీళ్లు ఎత్తిపోయడానికి 12 వేల కోట్లు విద్యుత్ బిల్లులు అయ్యాయి. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారు బాబాసాహెబ్ పేరు ఉండకూడదు, దోపిడీ చేయడానికి వీలు కుదరదని కాళేశ్వరం ముందుకు తెచ్చారు ప్రాణహిత చేవెళ్ల వద్ద అదే నీరు కాళేశ్వరం వద్ద అదే నీరు కేవలం మీ అవసరాల కోసమే కాళేశ్వరం కట్టారు కాళేశ్వరం నిర్మాణానికి క్యాబినెట్ అనుమతి ఉందని రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారుకెసిఆర్ చెప్పారు, హరీష్ రావు కట్టారు. ఇందిరమ్మ ఇల్లు కట్టాలన్న ఆర్కిటెక్ట్ ఇంజనీరు సలహా తీసుకుంటాం. 27/4/2024న గోష్ కమిషన్ పబ్లిక్ నోటీసు ఇచ్చింది. అన్ని ప్రధాన పత్రికల్లో అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఎవరైనా వచ్చి తమకు తెలిసిన సమాచారం ఇవ్వచ్చని తెలిపారు. అయితే మాకు నోటీస్ ఇవ్వలేదు పిలవలేదని కోర్టుకు వెళ్లామని టిఆర్‌ఎస్ సభ్యులు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అసెంబ్లీలో రిపోర్టు పెడితే తల ఎత్తుకోలేము అని టిఆర్‌ఎస్ నేతలు కోర్టుకు పోయారు కృష్ణా గోదావరి నదిపై ఏ ప్రాజెక్టును వదల్లేదు టిఆర్‌ఎస్ నేతలు చీల్చి చెండాడారు. 1450 కోట్లతో పూర్తి అయ్యే ఖమ్మం జిల్లాలోని ఇందిరా, రాజీవ్ సాగర్ ప్రాజెక్టుల అంచనాను 25వేల కోట్లకు పెంచారు. ఇదే పద్ధతుల్లో కాళేశ్వరం తుపాకులగూడెం ప్రాజెక్టులోను అంచనాలను పెంచి దోపిడీ చేశారు హరీష్ రావు నిటారుగా నిలబడలేక కాళేశ్వరంలా కూలిపోతున్నాడు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏం చేయాలో నిర్ణయం తీసుకునేందుకు సభలో నివేదిక ప్రవేశపెట్టాం చర్చించాం. ఏం చేద్దామని రాష్ట్ర ప్రజలను అడుగుతున్నాం.

# పోటీదారులం కాదు.. భాగస్వాములం

>> వచ్చారు. గత ఏడాది (2024) రష్యాలోని కజన్‌లో జరిగిన సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలలో సాధించిన పురోగతిని మోడీ, జిన్‌పింగ్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఇరు దేశాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగడం ఆర్థిక వృద్ధికి, ప్రపంచంలో బహుళ ధ్రువ వ్యవస్థకు ఎంతో ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు. భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఇరువురునేతల వ్యాఖ్యలు కనిపించాయి. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు సందర్భంగా చైనాలోని తియాంజిన్‌లో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య నెలకొన్న పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.ముఖ్యంగా, ద్వైపాక్షిక సంబంధాలు నిరంతరం అభివృద్ధి చెందాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత అత్యంత కీలకమని ప్రధాని మోడీ నొక్కిచెప్పారు. గత యేడాది సరిహద్దులనుంచి ఇరుదేశాల సైన్యాలు విజయవంతంగా వైదొలగడం, అప్పటినుంచి శాంతియుత వాతావరణం కొనసాగుతుండటంపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తంచేశారు. సరిహద్దు వివాదానికి సంబంధించి ఇరు దేశాల ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాజకీయ కోణంలో న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు కట్టుబడి ఉన్నామని వారు స్పష్టంచేశారు. ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయిం చారు. ఇందులో భాగంగా, నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులను పునరుద్ధరించడం, వీసా విధానాలను సులభతరం చేయడం వంటి చర్యలు చేపట్టాలని అంగీకరించారు. ఇటీవల కైలాస మానససరోవర యాత్ర, పర్యాటక వీసాలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై కూడా లోతైన చర్చ జరిగింది. ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరీకరించడంలో భారత్, చైనా ఆర్థిక వ్యవస్థలు పోషించగల కీలక పాత్రను ఇరువురు నేతలు గుర్తించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడులను విస్తరించుకోవడంతో పాటు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా రాజకీయ, వ్యూహాత్మక మార్గనిర్దేశంతో ముందుకుసాగాల్సి న అవసరాన్ని వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేశారు. భారత్, చైనా రెండూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అనుసరిస్తాయి. మన సంబంధాలను మూడో దేశం కోణంలోంచి చూడకూడదని అన్నారు. ఉగ్రవాదం, న్యాయమైన వాణిజ్యం వంటి ప్రాంతీయ, ప్రపంచ సవాళ్లపై బహుళపక్ష వేదికల మీద ఉమ్మడి వైఖరిని అవలంబించాల్సి న ఆవశ్యకత ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కై కీతో కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై వారు చర్చించారు. మోదీజిన్‌పింగ్ మధ్యకుదిరిన ఏకాభిప్రాయానికి అనుగుణంగా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడానికి చైనా సిద్ధంగాఉందని కైకీ తెలిపారు. ఎస్‌సిఒ సదస్సు నిర్వహణలో చైనా అధ్యక్షతకు ప్రధాని మోడీ మద్దతు తెలిపారు. అదేవిధంగా, 2026లో భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరు కావాల్సి ందిగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి జిన్‌పింగ్ ధన్యవాదాలు తెలుపుతూ, భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్ సదస్సుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతి అభ్యర్థి

### స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** ఉప రాష్ట్రపతి ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో ఎంపి మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, అనిల్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, కార్పొరేషన్ చైర్మన్ ఫహీం తదితరులు ఘనస్వాగతం పలికారు.

## కోటా బిల్లుపై నేడు గవర్నర్‌తో మంత్రుల భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** శాసన సభలో ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ సవరణ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందిందని, మూడ్ ఆఫ్ హౌజ్ పరిగణనలోకి తీసుకొని బిసిలకు రిజర్వేషన్ల పెంపు బిల్లు ఆమోదించాలని గవర్నర్‌ను విష్ణుదేవ్ వర్మను అఖిలపక్ష నేతలు కోరనున్నారు. సోమవారం ఉదయం 11:30 గంటలకు రాజ్ భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్యలు కలువనున్నారు. అదేవిధంగా బిసి ఎమ్మెల్యేలు, అఖిలపక్ష పార్టీల నేతలు గవర్నర్‌తో సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఇప్పటికే అఖిలపక్ష పార్టీలు బిఆర్‌ఎస్, బిజెపి, సిపిఐ, ఎంఐఎం పక్షనేతలకు లేఖరాసి మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా అందించారు. బిసిలకు స్థానిక సంస్థల్లో ఉన్న 50 శాతం నిబంధన ఎత్తివేస్తూ బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచుతూ శాసనసభలోఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

## కాళేశ్వరంతో దోపిడీ చేశారు - అక్బరుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్,ఆగస్టు31, ప్రభాతవార్త:** కాళేశ్వరం కమిషన్‌పై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. సుమారు 45నిమిషాలు ప్రాజెక్టు అవకతవకలపై నిప్పులుచెరిగారు. కాళేశ్వరంపై ప్రభుత్వం ఎంచేయనుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పేరుతో అప్పటి ప్రభుత్వం ప్రజల సొమ్మును కాజేశారని ఆరోపించారు. అది కూలిపోతే 20నెలలుగా ఎందుకు మరమ్మతులు చేపట్టలేదని నిలదీశారు.బిజెపి, బిఆర్‌ఎస్ కలేసే కాళేశ్వరం కుట్ర చేశారని విమ ర్శించారు. ఇక జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టులో కేవలం ఎల్ అండ్ టి కంపెనీకి మాత్రమే నోటీసులిచ్చారన్నారు.

# వేతనాల పెంపు

>> కీలక ప్రకటన చేసింది. 15 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆదివారం ఉదయం కార్మిక సంఘాలకు ఫిల్మ్ ఛాంబర్ లేఖలు పంపింది. అయితే మొదటి నుంచి 30 శాతం వేతనాల పెంపుకు డిమాండ్ చేస్తున్న సినీ కార్మికులు.. 15 శాతం వేతనాల పెంపు నిర్ణయంపై ఏ విధంగా స్పందిస్తారనేది చర్చనీయాంశమైంది.

## వారం - వర్జ్యం

01-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
నవమి రా.2.41
జ్యేష్ఠ రా.7.51
వర్జ్యం : ఉ.9.05-10.48
దు.ము.12.33-మ.1.23,
2) 3.03-3.53
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** దూర ప్రాంతాలలో ఉన్న మీ వారికి సహాయసహకారాలు అందిస్తారు. వస్తులాభం

**వృషభం:** శ్రమకు తగిన ఫలితాలు ఎక్కువగా చేతికి అందుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** స్త్రీ సంతాన విషయమై విశేషంగా శ్రమించి సత్ఫలితాలు సాధిస్తారు.

**కర్కాటకం:** చెప్పుకోదగిన మార్పు ఆలోచనా ధోరణిలో ఏర్పడుతుంది. వాహనయోగం.

**సింహం:** ఎదుటి వారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు.

**కన్య :** జీవిత భాగస్వామితో రాజీ ధోరణి అవలంభించడం మేలు. కాంట్రాక్టులు దక్కుతాయి.

**తుల :** ఆర్థిక విషయ వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**వృశ్చికం:** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వివాహ యత్నాలు.

**ధనుస్సు:** సన్నిహితాల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. సోదరుల కలయిక.

**మకరం:** ఆస్తి వ్యవహారాలు మీకు అనుకూలంగా మారే అవకాశాలు సూచిస్తున్నాయి.

**కుంభం:** మిత్రులు నుండి శుభవార్తలు అందుకుంటారు. ఇంటర్వ్యూలు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**మీనం :** ఊహించని అవకాశాలు అప్రయత్నంగా లభిస్తాయి. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఆదివారం పంజాబ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాన్ని సందర్శించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

# తెలంగాణ ముందుకు

>> ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డులు అందిస్తున్నారు.

కేరళ రాష్ట్రంలో విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. 10వ, 12వ తరగతి తర్వాత సున్నా శాతం డ్రాప్ అవుట్స్ సాధించడమంటే అందులో ఆశ్చర్యమేమీ ఉండదన్నారు. విద్య అనేది మనకు లభించిన ఒక గొప్ప బహుమతి. విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం. అదే అందరికీ గొప్ప శక్తి అని నేను చాలా బలంగా విశ్వసిస్తానన్నారు. వచ్చే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగాపెట్టుకున్నామని, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిదేందుకు కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణలో పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించినట్లు అందులో భాగంగానే కేవలం 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని, ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్లు ఖర్చుతో 25 ఎకరాల్లో నిర్మించబోతున్నామని వివరించారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించామని, యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఆనంద్ మహీంద్రాను చైర్మన్‌గా నియమించామని వెల్లడించారు. ఐటిఐలను ఎటిసిలుగా అప్ గ్రేడ్ చేశామని, ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పోరాటం చేయాల్సి న అవసరముందని, కేరళ రాష్ట్రానికి ఎన్నికలు రాబోతున్నాయి. 2026లో జరిగే ఎన్నికలు కేవలం కేరళ అసెంబ్లీ ఎన్నికలుగా భావించవద్దన్నారు. అవి 2029లో దేశ భవిష్యత్తుని నిర్ణయించే ఎన్నికలవుతాయన్నారు. దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి రాజీవ్ గాంధీ ఓటు హక్కు కల్పించారని, అదే నరేంద్ర మోడీ ప్రభుత్వం పౌరుల నుంచి ఓటు హక్కును కొల్లగొడుతున్నారన్నారు. యువతకు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాల్సి న అవసరం ఉంది యువత తమలోని శక్తిని గుర్తించాలి. 2029 సంవత్సరం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే సంవత్సరంగా అందరికీ చాటుదాం. మీరే మా నమ్మకం. మీరే మా బ్రాండ్ అంబాసిడర్లు. మీ భవిష్యత్తు కోసం పోరాటం చేయండి. దేశం కోసం పోరాటం చేయండి. మీరంతా ఆ పని చేస్తారని బలంగా విశ్వసిస్తున్నానని అన్నారు.

## హరీష్‌రావు చర్చను తప్పుదోవపట్టిస్తున్నారు

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** మాజీ మంత్రి హరీష్‌రావు చర్చను పక్కదారి పట్టిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హరీష్‌రావు కోర్టు కేసుల విషయంలో మాట్లాడుతున్న సందర్భంగా మంత్రి జోక్యం చేసుకుని మాట్లాడారు. మేడిగడ్డ..అన్నారం..సుందిల్ల వల్ల ప్రజాధనం దుర్వినియోగంపై చర్చ చేయండి, మీరు చేసిన తప్పుల నుండి బయట పడాలని చూస్తున్నారన్నారు. కమిషన్ల కోసం 3 లిఫ్టులతో నీళ్ళు తెచ్చే పని చేశారన్నారు. ఆనీళ్ళు మళ్లీ కిందకివదిలేశారని, బిఆర్‌ఎస్ పొరపాటునో.. గ్రహపాటునో మళ్లీ అధికారంలోకి బిఆర్‌ఎస్ గనుక వచ్చిఉంటే పోలవరం వరకు ఇంకో మూడు లిఫ్టులు పెట్టి ఇంకో లక్ష కోట్లు దోచేవాళ్లు అన్నారు. ప్రజలు ఇప్పటికే వారికి శిక్ష వేశారన్నారు. ప్రజలు వేసిన శిక్ష అనుభవిస్తున్నారన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రజల నోటి కాడి ముద్ద లాగేసారని, మాది తప్పు అయ్యింది అని ఒప్పుకోండి కాళేశ్వరం మీరే కట్టారు..మీరే కూల గొట్టారు. నాగార్జున సాగర్ నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదన్నారు. ఏదిపడితే అది మాట్లాడవద్దన్నారు. హరీష్‌రావు మొదలు ఇరిగేషన్ మంత్రి ఉన్న.. తర్వాత లేరు..ఐదేళ్లు ఇరిగేషన్ సిఎం దగ్గరే ఉంచుకున్నారు. హరీష్ రావుకి ఏ హోదాలో మైక్ ఇస్తున్నారు అన్నారు. హరీష్‌రావు ఏమైనా డిప్యూటీ ఫ్లోర్ లీడరా..?కాళేశ్వరంపై మాట్లాడండి అన్నారు. హరీష్ రావు డివియేట్ అవుతూ..కేసుల గురించి మాట్లాడుతున్నారు..కోర్టు కేసుల గురించి వచ్చే సెషన్‌లో పూర్తి స్థాయిలో మాట్లాడుదాం అంటూ కోమటిరెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# సీలింగ్ విధించలేదు..

>> కాంగ్రెస్ సర్కార్ ప్రకటనలు చేశారు. తెలంగాణలో బిసి రిజర్వేషన్లు అయిపోయాయని. తెలంగాణ ప్రజల డబ్బు బీహార్‌లో ఖర్చు పెడుతున్నారు. పార్లమెంట్‌లో చేయాల్సి న చట్టాన్ని ఇక్కడ చేస్తే ఎట్ల లాభం జరుగుతుందో చెప్పాలన్నారు కెటిఆర్. ఐదు రకాలుగా మాట్లాడితే దేని ద్వారా సాధ్యమవుతుంది. ఇక్కడ ఎలాగూ బిల్లు పాస్ అవుతది.. ఆర్డినెన్స్ మీద సంతకం పెట్టని గవర్నర్ ఈ బిల్లు మీద సంతకం ఎలా పెడుతారని ప్రశ్నించారు. బిసిల కోసం బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక పోరాటాలు చేశారని కెటిఆర్ తెలిపారు. రాజకీయ, సామాజిక, ఆర్థికంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నామని అయితే.. రాజకీయ అవసరాలకు సంబంధించి మాత్రమే ఈ బిల్లులో ఉందని.. ఆర్థికపరమైన అంశాలు బిల్లులో లేవన్నారు. బిసి రిజర్వేషన్ బిల్లును న్యాయపరమైన చిక్కుల్లేకుండా శాస్త్రీయంగా చేయాలని గంగుల కమలాకర్ చెప్పారని కేటీఆర్ చెప్పారు. బిసిల గురించి బిఆర్‌ఎస్ పార్టీ కొత్తగా ఈ రోజు మాట్లాడడం లేదన్నారు. పార్టీ పెట్టిన కొత్తలోనే కెసిఆర్ బిసి పాలసీ తీసుకొచ్చారని కెటిఆర్ గుర్తు చేశారు. బిసి బిడ్డలకు పదవులు ఇచ్చి మా నిబద్ధత చాటుకున్నామని కెటిఆర్ తెలిపారు. బిసి రిజర్వేషన్లకు సంబంధించి రెండు సార్లు తీర్మానం చేసి పంపించామని.. ఏకగ్రీవంగా ఒక తీర్మానం ఏంటంటే జనగణనతో పాటు కుల గణన చేయాలని కోరామన్నారు. అలాగే చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని మరోక తీర్మానం చేసి పంపించామని కేటీఆర్ తెలిపారు. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టం తెచ్చారు. 2010లో రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది 50 శాతానికి రిజర్వేషన్లు మించకూడదు అని. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేస్తే అది చట్టబద్ధం అవుతుంది. బిసిలకు న్యాయం చేయాలనుకుంటే.. పార్లమెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ తలచుకుంటే జరుగుతుంది. 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే పరిష్కారం అవుతుంది. ఇది సీఎం, మంత్రులకు తెల్వదు అనుకోవడం లేదు. కామారెడ్డిలో బిసిడిక్లరేషన్‌లో పెట్టినప్పుడు కేంద్రంలో అధికారంలోకి వస్తే చేస్తామని చెప్పేది ఉండే. కానీ ఆరు నెలల్లో చేస్తామని చెప్పారు. దాంతో బిసి వర్గాల నుంచి ఒత్తిడి పెరిగింది అని కెటిఆర్ పేర్కొన్నారు.

బిసి రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా సాధిస్తామని ఒకసారి ఆర్డినెన్స్ ద్వారా తెస్తామని మరోసారి, పార్టీ పరంగా ఇస్తామని ఒకసారి, రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక ఇస్మాని.. ఇవాళ్నేమో బిల్లు తెస్తున్నారన్న కెటిఆర్.. ఒకటే పార్టీ ఐదురకాలుగా మాట్లాడితే బిసిలకు అర్థం అవ్వడం లేదా మీ నిజాయితీ చిత్తశుద్ధి అని అన్నారు. చిత్తశుద్ధి లేని శివపూజచేస్తూ ప్రతిపక్షంమీద నెపం పెట్టి తప్పించుకుంటామంటే కుదరద న్నారు. మేం చిత్తశుద్ధితో రిజర్వేషన్ల కోసం ప్రయత్నించామని కేటీఆర్ స్పష్టంచేశారు. చర్చ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డిపై కేటిఆర్ సెటైర్లువేశారు. సిఎం రేవంత్ రెడ్డి చాలాసార్లు బయట మాట్లాడుతూ.. ఎంతసేపు చాయ్‌తాగేలోపు అయిపోతాయని మాట్లాడుతుంటారు.. ఇంకో పది రోజులు చర్చ చేసినా ఇక్కడ తేలదు, తెగదు అన్నారు. రాహుల్, మోడీచాయ్ తాగి ఇద్దరు డిసైడ్ చేసుకుంటే అర గంటలో బిసి రిజర్వేషన్ల అంశం ఒడిసిపోతది.. బిల్లు పాస్ అయిపోతదన్నారు. రాజ్యాంగ సవరణ జరిగిపోతుందన్నారు. పది రోజులు హౌజ్ నడిపినా.. ఇది అయ్యేది కాదని కెటిఆర్ పేర్కొన్నారు. బిసి ధర్నాకు మేం రాలేదు ఒకే.. మరి రాహుల్, ఖర్గే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. డిక్లరేషన్లు కాదు డెడికేషన్ కావాలని కెటిఆర్ అన్నారు. మీరు కన్ఫ్యూజ్ అయి అందర్నీ కన్ఫ్యూజ్ చేయొద్దని.. ప్రజలను గందరగోళ పరచకండన్నారు. ప్రధాని అపాయింట్‌మెంట్ ఎమ్మెల్యే ఇప్పిస్తాడా? ముఖ్యమంత్రి కార్యాలయం అపాయింట్‌మెంట్ అడగా లన్నారు. ఈ సమస్య తేలాలి అంటే రెండు మార్గాలు ఉన్నాయని.. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లండి.. మేం కూడా వస్తాం. ఇక రెండోది డెడికేషన్ ఉండాలి. తసిఎంకు చిత్తశుద్ధి ఉంటే బిసి బిల్లు సాధించుడో.. ఢిల్లీ నుంచి తిరిగిరాను అని చెప్పి జంతర్ మంతర్‌లో ఆమరణ దీక్ష చేయమనండన్నారు.

## మరో నెల రోజులు భారీ వర్షాలే..

>> ముప్పు ఉంటుందని ఆయన తెలిపారు.ఆగస్టు నెలలో భారతదేశంలో మొత్తం 268.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందని ఐఎండి తెలిపింది. ఇది సాధారణం కంటే 5 శాతం ఎక్కువ. గత 3 నెలల్లో దేశంలో అత్యధికంగా 743.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వ్యవధిలో సాధారణం కంటే 6 శాతం ఎక్కువ కురిసాయి. దక్షిణ భారతదేశంలో ఆగస్టు నెలలో ఇప్పటివరకు 250.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిం దని ఐఎండి వెల్లడించింది. సాధారణం కంటే ఇది దాదాపు 31 శాతం ఎక్కువ. దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 31 మధ్యకాలంలో మొత్తం 607.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏటా ఇదే మూడు నెలల వ్యవధిలో నమోదయ్యే సాధారణ వర్షపాతం 556.2 మిల్లీమీటర్ల కంటే ఇది దాదాపు 9.3 శాతం ఎక్కువ. భారత్‌లోని వాయవ్య ప్రాంతంలో ఆగస్టులో 265 మి.మీ వర్షపాతం కురిసిందని ఐఎండీ పేర్కొంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతినెలా వాయవ్య భారత్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతమే నమోదైంది. జూన్‌లో 111 మి.మీ, జులైలో 237.4 మి.మీ, ఆగస్టులో 265 మి.మీ వర్షం కురిసింది. జూన్ 1 నుంచి ఆగస్టు 31 మధ్య మొత్తం 614.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ మూడు నెలల వ్యవధిలో వాయవ్య భారత్‌లో సాధారణంగా 484.9 మి.మీ వర్షపాతమే నమోదవుతుంటుందని, అయితే ఈఏడాది మాత్రం 27 శాతం ఎక్కువ వర్షపాతం నమోదయిందన్నారు.

# దేశంలో విచారణ పెండింగ్ సిబిఐ కేసులు 7,072

## సివిసి వార్షిక నివేదిక విడుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశంలో కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐ నమోదుచేసిన అవినీతికేసుల్లో ఇప్పటికీ 7072 కేసులు విచారణపరంగా పెండింగ్‌లో ఉఆననయి. వాటిలో 379 కేసులు 20 ఏళ్లకుపైగా నమోదయిన కేసులని కేంద్ర విజిలెన్స్‌కమిషన్ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. మొత్తం కేసుల్లో 1506 కేసులు మూడేళ్లకుపైగా పె ండింగ్‌లో ఉన్నాయి. 791 కేసులు మూడేళ్లనుంచి ఐదేళ్లలోపు పెండింగ్‌లో ఉంటే 2115 కేసులు ఐదేళ్లనుంచి పదేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని సివిసిస్పష్టంచేసింది. మొత్తం 2281 ఇలాంటి అవినీతికేసులు పదేళ్లనుంచి 20 ఏళ్లుగా విచారణలో పెండింగ్‌లో ఉన్నాయి. 2024 డిసెంబరు 31వ తేదీనాటికే 7072 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో 2660 కేసులు పదేళ్లకుపైబడి విచారణలో పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. నివేదికప్రకారంచూస్తే 13,100 కేసుల్లో అప్పీళ్లు, రివిజన్లు అటు సిబిఐ, ఇటు నిందితులు దాఖలుచేసినవి కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇవన్నీ వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టులోనే ఉన్నాయి. 20 ఏళ్లకుపైబడిన కేసులు 606వరకూ ఉనానయి. 1227 కేసులు 15ఏళ్లకుపైబడి, 2989 కేసులు పదేళ్లనుంచి 15 ఏళ్లలోపు విచారణలోపెండింగ్‌లో ఉన్నాయి. 4059 కేసుల్లో ఐదేళ్లనుంచి పదేళ్లలోపు విచారణకు రాని కేసులు ఉన్నట్లు తేల్చింది. రెండేళ్లనుంచి ఐదేళ్లలోపు పెండింగ్‌లో ఉన్న కేసులు 1778 కాగా రెండేళ్లలోపు పెండింగ్ ఉన్న కేసులు 2441 కేసులుగా ఉన్నాయని తెలిపారు. 644 కేసుల్లో తీర్పులు వచ్చాయని, 392 కేసుల్లో శిక్షపడిందని, 154 కేసుల్లో నిందితులు విడుదలకాగా 21 మందిపై ఉన్న అభియోగాలు డిశ్చార్జిచేసారు. మరో 77 కేసులు ఇతర కారణాలదృష్ట్యా కొట్టివేసినట్లు సివిసి తెలిపింది. 2023లో కేసులపరిష్కారం 71.47శాతం కాగా 2024లో 69.14శాతంగా ఉంది. 2024లో 11,384 కోర్టుకేసులు అవినీతిలేని, అవినీతికేసులు వివిధకేసుల్లో విచారణకురానివి ఉన్నాయని సివిసి తెలిపింది. 2024లో సిబిఐ 807 కేసులు నమోదుచేసిందని, వీటిలో 674 రెగ్యులర్‌కేసులు, 133 కేసులుప్రాథమిక దర్యాప్తుకు సంబంధించినవిగా సివిసి వెల్లడించింది. 2024 డిసెంబరునాటికి సిబిఐ 529 కేసులు రిజిస్టరుచేసిందని, అవన్నీ దర్యాప్తు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిలో 56 కేసులు ఐదేళ్ల పెండింగ్‌లో ఉంటే 60కిపైగా కేసులు మూడేళ్లు, 64కేసులు ఐదేళ్లకుపైబడి, 108 కేసులు ఏడాది నుంచి రెండేళ్లలోపు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 241 కేసులు ఏడాదిలోపు విచారణపెండింగ్‌లో ఉన్నట్లు సివిసి తెలిపింది. కేసునమోదుచేసిన ఏడాదిలోగా సిబిఐ దర్యాప్తుపూర్తిచేయాల్సి ఉందని విచారణ పూర్తి అంటే కోర్టులో ఛార్జిషీటును కూడా దాఖలుచేయాలని, కొన్నికేసుల్లో దర్యాప్తు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని సివిసి అభిప్రాయపడింది.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

## 17న పెరేడ్‌గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ

### హాజరుకానున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్: ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ చరిత్రను తరతరాలకు తెలియజేయడం కోసం నిరంతరం పోరాటం చేస్తూ, విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కెసిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. కానీ ఆయన ప్రభుత్వం వచ్చిన తర్వాత తొమ్మిది సంవత్సరాలు గడిచినా అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించలేదన్నారు. 2023లో ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి కృషితో పరేడ్ గ్రౌండ్‌లో అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహించామన్నారు. అయితే కెసిఆర్ ప్రభుత్వం దానిని జాతీయ సమైక్యత దినంగా పేర్కొన్నది అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా దినోత్సవంగా జరుపుతున్నారని అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన వెంటనే మొదటి సంతకం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుతామన్నారు. ప్రస్తుతం ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, సెప్టెంబరు 17 సెప్టెంబర్ రోజున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాన కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. గత ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఐఎం ఒత్తిడికి భయపడి అధికారికంగా జరపలేకపోయాయి. కానీ పక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో ముక్తి దివస్‌ను అధికారికంగా జరుపుతున్నారు. కాబట్టి తెలంగాణలో కూడా ఇదే విధంగా జరగాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ తరాలకు ఈ చరిత్ర తెలుసుకోవాలి. ప్రతి విద్యార్థి చదవాలి. పాఠ్యపుస్తకాలలో చేర్చాలన్నారు. ఈ వారం రోజులపాటు అనేక కార్యక్రమాలను రాష్ట్రం అంతటా నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 2న గుండ్రాయిపల్లిలో అమరులకు నివాళి కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ఆధ్వర్యంలో జరుగుతుందని, ఆ తర్వాత కూడా షెడ్యూల్ ప్రకారం ఇతర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి కార్యక్రమంలో ఎంపిలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. సెప్టెంబరు 17వ తేదిన రోజున పరేడ్ గ్రౌండ్‌లో భారీబహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



ఆర్జేడి అధినేత లాలూప్రసాద్‌యాదవ్‌తో సమావేశమైన పిసిసి మాజీ అధ్యక్షుడు, ఒబిసి ఎంపిల ఫోరం మాజీ కన్వీనర్ వి.హనుమంతరావు

# ఆర్జేడి అధినేత లాలూప్రసాద్‌యాదవ్‌తో పిసిసి మాజీ ఛీఫ్ విహెచ్ భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఆర్జేడి అధినేత, బీహార్ మాజీ సిఎం, కేంద్ర మాజీమంత్రి లాలూప్రసాద్‌యాదవ్‌తో పిసిసి మాజీ అధ్యక్షుడు, ఓబీసీ ఎంపీల ఫోరం మాజీ కన్వీనర్ వి.హనుమంతరావు సమావేశమైంది. బీహార్‌లో రాహుల్ గాంధీ చేస్తున్న ఓటు అధికార్ యాత్రలో పాల్గొంటున్న విహెచ్ ఆదివారం బీహార్‌లోని లాలూప్రసాద్‌యాదవ్ స్వగృహానికి వెళ్ళి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. యూపీఏ హయాంలో ఐఐఎం, ఎయిమ్స్‌లో ఉన్న రిజర్వేషన్స్‌ను సుప్రీమ్ కోర్టు కొట్టి వేసిన సమయంలో సోనియాగాంధీ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించిన సమయంలో కేంద్ర మంత్రిగా లాలూ ప్రసాద్ యాదవ్ రిజర్వేషన్స్ కోసం బిల్లు ఆమోదం కోసం చేసిన కృషిని విహెచ్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో పిసిసి మాజీ ప్రధానకార్యదర్శి, అఖిల భారత యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

# పట్టణాల్లోనే ఎందుకు వరుసగా క్లౌడ్‌బరస్ట్‌లు?

## ఉత్తరాది నుంచి దక్షిణాదికి పాకిన వైపరీత్యాలు

## పర్యావరణవేత్తలకు అంతుచిక్కని మేఘ విస్ఫోటం

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** వ్యవసాయ ఆధారిత దేశంగా పేరొందిన భారత్‌లో తొలకరి మొదలయ్యాక రైతుల ముఖాల్లో ఆనందం కని పిస్తుంది. వర్షం కురిస్తే రైతులు సంతోషంతో వ్యవసాయ పనులు మొదలుపెడతారు. ఒక్కోసారి ఈ వర్షంలో రైతులతో పాటు పిల్లాపాపలు కూడా ఆనందంతో తడుస్తూ కేరింతలు కొడతారు. కాని భారత్‌లో కొన్నేళ్లుగా వర్షాకాలం మొదలయ్యాక క్లౌడ్ బరస్ట్‌లు అనేక ప్రాంతాలను హడలెత్తిస్తున్నాయి. మూడేళ్ల క్రితం వరకు ఉత్తరాది రాష్ట్రాలకే పరిమి తమైన ఈ క్లౌడ్ బరస్ట్‌లు ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలను ముఖ్యంగా ఇక్కడి పట్టణ ప్రాంతాలను వణికిస్తున్నాయి. ఒకప్పుడు ఎప్పుడోకాని సంభవించే క్లౌడ్ బరస్ట్‌లు నేడు కామారెడ్డి లాంటి చిన్న పట్టణాలను సైతం హడలెత్తిస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. పట్టణ ప్రాంతాలలో వరుసగా సునామిలా వచ్చి పడుతున్న క్లౌడ్ బరస్ట్‌ల గురించి వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్న వివరాలు ఒకసారి పరిశీలిస్తే ఇందుకు ప్రధాన కారణం పట్టణ ప్రాంతాలలో శిలాజ ఇంధనాల వాడకం పెరగడం. దీంతో పాటు కాలుష్యం పెరగడం మరో కారణం. ఇదే సమయంలో ప్రకృతి సమతుల్యం దెబ్బతినడం, అడవులు అంతరించడం, పచ్చదనం కరువవడం, వేడి ఎక్కువగా వుండడం, పారిశ్రామిక ప్రాంతాలు ఎక్కువగా వుండడం, దీనివల్ల వస్తున్న కాలుష్యం ఎక్కువగా వుండడం, పరిమితికి మించి ఎక్కువ జనాభా వుండడం, గ్రా మీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాలలో కార్బన్‌డైఆక్సైడ్ ఎక్కువగా వుండడం మరో కారణం. ఇక క్లౌడ్ బరస్ట్‌లు ఏర్పడానికి గాలిలో సంభవించే మా ర్పులు ముఖ్యమైనవిగాశాస్త్రవేత్తలు అంటున్నారు.

గాలిలో రెండు రకాలు వుంటాయని ఇందులో ఒకటి చల్లగాలి మ రొకటి వేడిగాలిగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందులో వేడి గాలి తేలికగా వుండి వాతావరణం పైభాగంలో అతి సులభంగా వెళుతుండగా ఇదే చల్ల గాలి నీటి తేమ కారణంగా భూమి ఉపరితలం మీదకు చేరుతుంది. సముద్ర ఉపరితలం వేడెక్కడం వల్ల చల్లగాలిలో వుండే తేమ తేలికైన ఆవిరిగా మారి పైకి చేరుతుంది. గాలిలో ఉండే నీటి ఆవిరి కూడా ఘనీభవించి నీటి స్ఫటికాల్లా మారిపోతాయి. ఇవన్నీ కలిసి దట్టమైన మేఘాలుగా ఏర్పడతాయి. ఎక్కువ మొత్తంలో గా లులు పైకి చేరడం వల్ల భూ ఉపరితలం మీద ఒక్కసారిగా ఖాళీ ఏర్పడుతుంది. దీనినే అల్పపీడనంగా పిలుస్తారు. చుట్టూ వీచే గాలులు అల్పపీడనం వైపు వెళతాయి. ఈ గాలులతో పాటు మేఘాలు కూడా కదులుతూ చల్లగా మారి ఒక్కసారిగా కుంభవృష్టి తరహాలో వానలు పడతాయి. తీవ్రత ఎక్కువగా వుంటే ఈ గాలుల అల్పపీడన ప్రాంతంలో వేగంగా, గుండ్రంగా తిరుగుతాయి. అల్పపీడనం ఇంకా బలపడితే వాయుగుండంగా మారుతుంది. అయితే సముద్రాల్లో అల్పపీడనం ఏర్పడడం, కొన్నిసార్లు సముద్రాల్లోనే కుండపోత భారీ వర్షాలు కురవడం అసహజంగా జరిగే ప్రక్రియ.



అయి తే కొన్నేళ్లుగా దక్షిణాది నగరాలలో క్లౌడ్ బరస్ట్‌లు తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్న తీరు వాతావరణ శాస్త్రవేత్తలకు సైతం అంతు చిక్కడం లేదు. ప్రకృతి లో ఏర్పడిన అసహజ మార్పులు ఇందుకు ఒక కారణం కావచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గతంలో కిలోమీటర్ నుంచి పది కిలోమీటర్ల పరిధిలో గంటలో పది సెంటీమీటర్లు అంతకు మించి వర్షం కురిస్తే క్లౌడ్ బరస్ట్‌గా పిలిచేవారు. కానీ ఇప్పుడు ఇది మారిపోయి 20 నుంచి 40 సెంటీమీటర్లు అంతకు ఎక్కువగానే వుంటోంది. ఇలా జరగడానికి మధ్యదరా తీరం నుంచి వీస్తున్న గాలులు పశ్చిమాన తేమను తీసుకొస్తుండడం మరో కారణంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ రెండు పరస్పరం ఢీకొనడం వల్ల క్లౌడ్ బరస్ట్ తీవ్రత ఎక్కువగా వుంటోందని వారంటున్నారు. గ్లోబల్ వార్మింగ్ కూ డా ఇందుకు మరో కారణంగా వారంటున్నారు. ఇంగ్లండ్, అమెరికాలో ఏర్పడే టోర్నాడోలు కొన్నేళ్లుగా భారత్‌లోని పలు నగరాలలో వస్తుండడాన్ని వారు ఉదహరించారు.

# బ్యాంకు మేనేజర్, క్యాషియర్‌సహా 44 మంది నిందితుల అరెస్టు

## 15.237 కిలోల బంగారం, 1.61 లక్షల నగదు జప్తు

## చెన్నూరు ఎస్‌బిఐ 2 భారీచోరీ కేసులో వీడిన మిస్టరీ



చెన్నూరు ఎస్‌బిఐ 2 భారీ చోరీ కేసులో నిందితుల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ.

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** సంచలనం రేపిన ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు ఎస్‌బిఐ 2లో వెలుగు చూసిన భారీ చోరీ కేసులో బ్యాంకు మేనేజర్, క్యాషియర్ సహా 44 మంది నిందితులను అ రెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 15.237 కిలోల బంగారంతో పాటు 1.61 లక్షల రూపాయల నగదును జప్తు చేశారు. రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం మీడి యాకు వెల్లడించారు. చెన్నూరు ఎస్‌బిఐ 2 బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్న రవీందర్ కొంతకాలంగా బెట్టింగ్‌లకు అలవాటు పడి స్థానికంగా అనేక మందికి బాకీ పడడం, ఈ క్రమంలో బ్యాంకులో ప్రజలు దాచిన బంగారు నగలను ఇదే ప్రాంతంలోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద తనఖా పెట్టి డబ్బులు తీసు కుని, వాటిని కూడా పందాలు కాసి నిండా మునగడం తెలిసిందే. దీంతో పాటు బ్యాంకులోని కోటి పది లక్షల రూపాయల నగదు కూడా ఇతను సొ ంత అవసరాలకు వాడుకోవడం విదితమే. తన అక్రమాలు వెలుగు చూడకుండా వుండేందుకు తనకు తెలిసిన ఖాతాదారుల నుంచి వడ్డీకి డబ్బులు, బంగారు నగలు తీసుకుని లాకర్లలో వుంచేవాడు. అయితే పది రోజుల క్రితం రవీందర్ నాలుగు రోజుల సెలవుపై వెళ్లి పారిపోవడం, మేనేజర్ మనో హర్ రెడ్డి కూడా పత్తా లేకుండా పోవడంతో ఎనిమిది రోజుల క్రితం జరిగిన ఆడిటింగ్‌లో ఈ భారీ చోరీ రట్టయ్యింది. 2024 అక్టోబర్ నెల నుంచే ఈ బ్యాంకు క్యాషియర్ సరిగే రవీందర్ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో నష్టపోయి బ్యాంకులో ఖాతాదారుల నగలను మరో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో వారికి తెలియకుండా తాకట్టు పెట్టి అక్కడ తీసుకున్న డబ్బులతో మళ్లీ పందాలు కాసి మరోదఫా కూడా నష్టపోయాడు. ఇతను మొత్తం మీద 40 లక్షల రూ పాయలకు పైగా నష్టపోయాడు. ఈ క్రమం లో ఇతను బ్యాంకులో 402 మంది తనఖా పెట్టిన 25.17 కిలోల బంగారు నగలు, 1.10 లక్షల రూపాయల నగదును తన అవసరా లకు వాడుకున్నాడు. అయితే ఇందుకు మేనేజర్ మనోహర్ రెడ్డితో పాటు మరో ఉద్యోగి సహకరించాడు. అయితే బ్యాంకు అంతర్గత ఆడిటింగ్‌లో ఈ గోల్ మాల్ వెలుగు చూడడంతో చెన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టి పరారీలో వున్న క్యాషియర్ రవీందర్‌ను మహారాష్ట్రలో అరెస్టు చేసి విచారించగా మొత్తం వ్యవహారం రట్టయ్యింది. దీని తరువాత మేనేజర్ మనోహర్ రెడ్డి ఇతర నిందితులు కొంగండి బీరేష్, నరిగే సరిత, నరిగే స్వర్ణలత అలియాస్ గోపు, ఉమ్మల సురేష్, కొదటి రాజశేఖర్, గౌడ సుమన్, ఎనంపల్లి సాయి కిరణ్, సందీప్, మోత్కూరి రమ్యలతో పాటు మరో 32 మందిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి బ్యాంకులో కాజేసిన 15.237 కిలోల బంగారం, 1.61 లక్షల నగదును జప్తు చేశారు. అయితే మరో 20 శాతం నగలు ఇంకా జప్తు కావాల్సి వుందని పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. ఈ కేసులో పక్కాగా వ్యవహరించిన చెన్నూరు పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి భాస్కర్, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్, చెన్నూరు సిఐ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గంగులకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన మంత్రి పొన్నం

## ఆకారం పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటుందనుకోవడం పొరపాటు

## నేను బాడీషేమింగ్ గురించి మాట్లాడితే వివాదాస్పదమవుతుంది: గంగుల





**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అంశంపై చర్చ సందర్భంగా బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇద్దరు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఒకదశలో బాడీ షేమింగ్ వరకు పోయింది. బిసి రిజర్వేషన్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..గంగుల కంటే ఎక్కువ చదువుకున్నా.. రాజకీయాల్లో విద్యార్థి దశ నుంచి ఉన్నా.. నాకు ఎక్కువ తెల్వదు అనుకుంటే పొర పాటు.. నేను ఏమంటున్న అంటే.. ఆకారంలో పెద్దగా ఉంటే అవగాహన ఎక్కువ ఉంటది అనుకుంటే పొరపాటన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పందించారు. నేను కూడా బాడీ షేమింగ్ గురించి మాట్లాడితే పెద్ద కాంట్రావర్సీ అవుతద న్నారు. తాను కేవలం ఒక్కటే అడగుతు న్నానని.. శాస్త్రీయంగా బిసి రిజర్వేషన్లు కల్పించాలని.. రాజ్యాంగపరంగా 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి జీవో పాస్ చేయడానికి 20 నెలలు ఎందుకు టైమ్ వేస్ట్ చేశారని.. ఈ పని అప్పుడే చేసి, ఎన్నికలకు వెళ్ళాల్సింది కదా అని గంగుల కమలాకర్ అన్నారు.

మార్చి 2024లో జీవో నెంబర్ 26ను బిసి కమిషన్ ద్వారా తీసుకొచ్చారు.. ఆ తర్వాత బిసి కమిషన్ కాస్త మాయమైందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బిఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి కాదని... బహుజన రాష్ట్ర సమితి అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఈ బిల్లు తీసుకొచ్చి ఆ తర్వాత జీవో ఇచ్చి బిసిలకు అన్యాయం చేయొద్దని.. షెడ్యూల్ 9లో బిసి రిజర్వేషన్లను చేయాలని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. బిసి బిల్లు అమలును తమిళనాడు తరహాలో శాస్త్రీయంగా చేయాలని.. అశాస్త్రీయంగా చేస్తే బీహార్, మధ్య ప్రదేశ్, యూపీ రాష్ట్రాల్లో ఫెయిల్ అయినట్లుగా అవుతుందన్నారు.

# 40 శాతం డిస్కౌంట్ పేరిట రూ. 3 కోట్లతో వ్యాపారి పరార్

## ఆర్మూర్‌లో భారీ మోసం

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో ఓ వ్యాపారి కొత్తగా చిన్నపాటి సూపర్ మార్కెట్ ప్రారంభించి ముందుగా డబ్బులు చెల్లించే వారికి 40 శాతం డిస్కౌంట్ ఇస్తానని నమ్మించి మూడు కోట్ల రూపాయలతో ఉడాయించిన వైనం సంచలనం రేపింది. ఈ వ్యాపారి దెబ్బకు వందలాది మంది ప్రజలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని కోరారు. వివరాలు ఇలావున్నాయి. ఆర్మూర్ పట్టణంలోని నిజాంసాగర్ ప్రధాన రహదారిపై తిరుమల ట్రేడర్స్ పేరిట ఒక వ్యాపారి ఇటీవల చిన్నపాటి సూపర్ మార్కెట్‌ను ప్రారం భించాడు. తాను కొత్తగా ప్రారంభించిన సూపర్ మార్కెట్‌లో కస్టమర్లను ఆకట్టుకునేందుకు అని ప్రచారం చేస్తూ ముందుగా చేరిన కొందరికి 40 శాతం డిస్కౌంట్ ఇస్తామని చెప్పాడు. ఇందుకు సంబంధించి ముందుగానే చెల్లింపులు చేయాలని అతను షరతు విధించాడు. ఇతగాడి మాటలు నమ్మిన స్థానికులు ఫ్రిజ్, వాషింగ్ మిషిన్, ఖరీదైన ఫర్నీచర్ వంటి వస్తువుల కోసం ముందుగానే లక్షలాది రూపాయలను ఆ వ్యాపారికి సమర్పిం చారు. ముం దుగా నగదు చెల్లించిన వారికి వారం రోజుల్లో వారు కోరిన వస్తువులను డెలివరీ చేస్తానని నమ్మబలికాడు. అయితే వారం రోజులు కావస్తున్నా వస్తువులు డెలివరి కాకపోవడంతో డబ్బులు చెల్లించన వారు సదరు సూపర్ మార్కెట్ వద్దకు రాగా నాలుగు రోజులుగా ఇది మూతపడి వుంది. దీని పై వ్యాపారిని కలిసేందుకు వెళ్లగా అతను ఉడాయించాడని తేలింది. దీంతో బాధితులు ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీ సులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. పరారీలో వున్న మోసకారి వ్యాపారి కోసం గాలింపు చేబట్టారు.





ఆర్మూర్‌లో బోర్డు తిప్పేసిన తిరుమల ట్రేడర్స్.

# ఇంధన సామర్థ్య సూచిలో చోటుదక్కని తెలంగాణ

## అగ్రస్థానంలో మహారాష్ట్ర, ఎపి, అసోం, త్రిపుర

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** రాష్ట్ర ఇంధన సామర్థ్య సూచికలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, అస్సాం, త్రిపుర అగ్రస్థానం సంపాదించగా, తెలంగాణ వెనుకబడి ఉంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఇఇ), అలయన్స్ ఫర్ యాన్ ఎనర్జీ ఎఫిషియంట్ ఎకానమీ (ఎఇఇఇ)తో కలిసి తాజాగా విడుదల చేసిన రాష్ట్రాల ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇండెక్స్‌లో (ఎస్ఇఇఐ) మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, అస్సాం, త్రిపురలు తమ తమ గ్రూపులలో అగ్రస్థానంలో నిలిచాయి. భవనాలు, పరిశ్రమ, మున్సిపల్ సేవలు, రవాణా, వ్యవసాయం, విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు), క్రాస్-సెక్టార్ చొవలు నే ఏడు డిమాండ్ రంగాలలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతల ఇంధన సామర్థ్య పనితీరును ఈ సూచిక అంచనా వేసింది. ఈ సూచిక ప్రకారం గ్రూప్ 1లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా, గ్రూప్ 2లో ఆంధ్రప్రదేశ్, గ్రూప్ 3లో అస్సాం, గ్రూప్ 4లో త్రిపుర ఉన్నాయి. ఇంధన సామర్థ్య సూచిక 2023తో పోలిస్తే ఫ్రంట్ రన్నర్ రాష్ట్రాల సంఖ్య 7 నుండి 5కు తగ్గింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు ఆ హోదాను కొనసాగించాయి. అస్సాం, కేరళలను ఇంధన సామర్థ్యం సాధించిన రాష్ట్రాల జాబితాలో వర్గీకరించగా, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌లు పోటీదారుల కేటగిరిలో ఉన్నాయి. ఇక విభాగాల వారీగా చూస్తే 24 రాష్ట్రాలు ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ 2017ను నోటిపై చేయగా, మరో 31 రాష్ట్రాలు ఎలక్ట్రిక్ మొబిలిటీ విధానాలను అమలు చేశాయి. ఇంకో 13 రాష్ట్రాలు సూర్యరశ్మితో నడిచే వ్యవసాయ పంపుసెట్లను ప్రోత్సహించినట్లు సూచికలో వెల్లడైంది. కాగా 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రాష్ట్ర ఇంధన సామర్థ్య కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయగా, మరో 31 రాష్ట్రాలు ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో ఇంధన పరివర్తనపై రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీలన ఏర్పాటు చేశాయి. కాగా 2070 నాటికి నికర సున్నా ఉద్గారాలను సాధించడం, 2030 నాటికి ఉద్గారాల తీవ్రతలో 45 శాతం తగ్గింపును సాధించేందుకు శక్తి సామర్థ్యం ఒక పునాది స్తంభంగా ఉద్భవించి, అన్నిరంగాలను ప్రభావంతమైన, తక్కువ ధర పరిష్కారాలను అందిస్తుందని ఈ సందర్భంగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, బిఇఇ డైకర్టర్ జనరల్ ఆకాష్ త్రిపాఠి అన్నారు.

# రైతులకు తొలిసారి వాట్సాప్ ఛానల్

## అందుబాటులోకి తెచ్చిన వ్యవసాయ శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వ్యవసాయం రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని రైతులకు అరచేతిలో పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు దాదాపు ప్రతి రైతు దగ్గర సెల్‌ఫోన్ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా అధికారిక వాట్సాప్ ఛానల్‌ను తొలిసారిగా వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చింది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించింది. కొత్తగా ప్రారంభించిన యాప్‌పై వివిధ జిల్లాల్లోని రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తోంది. ఈ ఛానల్ ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీ వివరాలు, పంటల సంరక్షణ, కాలానుగుణ సూచనలు, వాతావరణ హెచ్చరికలు, కీటక నియంత్రణ మార్గదర్శకాలు, మార్కెట్ ధరలు, శిక్షణ కార్యక్రమాలు, రైతునేస్తం కార్యక్రమాల షెడ్యూల్, రాష్ట్రంలోని 1,600 రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లలో నిర్వహించబోయే అంశాల సమాచారాన్ని ఈ వాట్సాప్ ఛానెల్ ద్వారా వ్యయసాయశాఖ రైతులకు చేరవేయనుంది.



# సెప్టెంబరులోనే 'అమృత్‌భారత్' రైలు పరుగులు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తొలిసారిగా అమృత్‌భారత్ రైలు రయ్యిరయ్యినా దూసుకవెళ్లనుంది. సెప్టెంబరులోనే ఉత్తరాది ప్రయాణం అందుబాటులో రానుంది. తక్కువ ఛార్జీలు ఉండే అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో సామాన్యులు, వలసకార్మికులు తదితర వర్గాలకు ఊరట కలుగనుంది. సికిందరాబాద్ నుంచి బిహార్‌లోని ముజఫర్‌పూర్ నడుమ రైలు రాకపోకలు సాగించనుంది.

ఇటీవలనే రైల్వేశాఖ ప్రకటించింది తెలిసిందే. అయితే హైదరాబాద్ నుంచి పాట్నా, గయా తదితర ప్రాంతాలకు రాక పోకలు సాగించే ప్రయాణీకుల కోసం ఏర్పాటు చేయనున్నారు. కాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, గోండియా, దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, ఝూర్సుగూడ, రూర్కెలా, హతియా, రాంచీ, బొకారో, పరస్‌నాథ్, కోడెర్మా, గయాజీ, జెహనాబాద్, పాట్నా మీదు గా అమృత్‌రైలు ప్రయాణం సాగుతుంది. ముఖ్యంగా 11 సాధారణ భోగీలు, 8 స్లీపర్ క్లాస్‌లు, ఒక ప్యాంట్రీ కార్, 2 సెకండ్‌క్లాస్, లగేజ్, గార్డు వ్యాన్‌లు ఉంటాయి. అదేవిధంగా దివ్యాంగుల కోసం ఒక కంపార్ట్‌మెంట్ ఉండేవిధంగా రూపొందించారు.

వార్త

ఎక్కువ గమనించడం, ఎక్కువ బాధలను అనుభవించడం, ఎక్కువ అధ్యయనం చేయడం ఇవి అభ్యసనకు మూడు ముఖ్య స్తంభాలు.

-ఎమర్సన్

# గ్రామీణ వ్యవస్థకు ఆధునిక టెక్నాలజీ వరమే

***కాలంతో పాటు వస్తున్న మార్పులతో ఆధునిక టెక్నాలజీ గ్రామీణ జీవన విధానాలపై వ్యవసాయ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల పరికరాల కొనుగోలు, విని యోగం గ్రామీణులకు, గ్రామీణప్రాంత చిన్నకారు సన్నకారు రైతులకు ఆర్థిక భారం కలగకుండా టెక్నాలజీ మరింత సుల భతరంగా అందుబాటులోకి వచ్చేవిధంగా ఉండాలని కోరు కునే రైతాంగం లేకపోలేదు. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీ ప్రభావం గ్రామీణ జీవన ఆర్థిక సామాజిక అంశాలపై ప్రభావితం చూపెడుతున్నప్పటికీ, గ్రామీణ ప్రజల్లో ఆర్థికంగా నిలదొక్కుకొని ఉన్న రైతాంగం మాత్రం ఆధునిక యంత్ర పరికరాలపై ప్రత్యేక దృష్టి సారి స్తున్నప్పటికీ పేద మధ్యతరగతి గ్రామీణ రైతాంగం కూడా ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.***

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రపంచీకరణ నేపథ్యం జీవన విధానాల్లో వస్తున్న మార్పులు, ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం నేరుగా గ్రామీణ వ్యవస్థపై ప్రభావితం చూపిస్తున్నాయి. గ్రామీణ జానపద, సంస్కృతి సంప్రదాయాలపై ఆధునిక టెక్నాలజీ తీరు తెన్నెలు క్రమక్రమంగా పెరుగుతూ, గతంతో పోలిస్తే ప్రస్తుతం టెక్నాలజీపై ఆసక్తి చూపుతున్న గ్రామీణ జీవన విధానంలో పెనుమార్పులు కనిపిస్తున్నాయి. సాంకేతికత పరిజ్ఞానం, మానవుని అవసరాలకు కావలసిన పనులను సరళీకృతం చేయడానికి అవసరమైనప్పటికీ, ప్రత్యక్ష భౌతిక మానవ సంబంధాల మధ్య తీవ్ర ఆగాదాన్ని పెంచుతుందని అనిపిస్తుంది. మితిమీరిన సాంకేతికత తరచుగా మానవ జీవన విధానాలపై ప్రభావితం చూపిస్తుంది అనే వాదనలు బలంగా వినిపిస్తున్నప్పటికీ రాను రాను మానవుడు ప్రతి చిన్న విషయానికి సాంకేతికత మీదనే ఆధారపడే పరిస్థితులు వస్తుండటం, సహజ సిద్ధమైన మానవమేధస్సు స్వయంగా ఆలోచించే ధోరణి కుదించకపోయేపరిస్థితి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదనే భిన్న వాదనలు సమాజంలో తెరపైకి వస్తున్నాయి. కంప్యూటర్లు సెల్‌ఫోన్లు నూతన సాఫ్ట్‌వేర్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లాంటి టెక్నాలజీ ఆధునిక మానవుని అవసరాలకు ఉపయుక్తంగాఉన్నప్పటికీ, భవిష్యత్ తరాల్లో వాటి ఆధిపత్యమే మానవ జీవన విధానాలపై ఒత్తిడి పెంచేవిధంగా ఉంటుందేమో అనే సంశయం అన్నిరంగాల్లో విస్తరించిన టెక్నాలజీ వినియోగం తీరు పరిశీలిస్తే అవగతం కాకమానదు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో మారుమూల గ్రామాలకు సైతం సమాచార వ్యవస్థ దూసుకుపోతుంది. వివిధ మాధ్యమాలు సాంకేతిక పరికరాలు నేటి గ్రామీణ జీవనశైలిని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామీణ జీవన విధానాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండల దగ్గర సమావేశాలు, ఆత్మీయ పలకరింపులు కలుపుగోలుతనం లాంటి మానవ సంబంధాలు చాలావరకు క్రమక్రమంగా తొలగిపోతున్నాయా అనే సంశయం నేటి గ్రామీణ జీవన విధానాల్లో గోచరిస్తుంటుంది. దీనికి కారణం ప్రధానంగా విరివిగా ఆధునిక టెక్నాలజీ వినియోగాన్ని గ్రామీణులు అన్నిరంగాల్లో ఉపయోగించుకోవడం వలన గ్రామీణ వ్యవస్థలో మానవ సంబంధాల మధ్య దూరం పెరుగుతుందా అనే సంశయం కలగక మానదు. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామీణులు ఎక్కువగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే కంప్యూటర్లు సెల్‌ఫోన్లు ఇంటర్నెట్ లాంటి సాంకేతికతను వినియోగిస్తుండడంతో ఎవరికి వారే యమునా తీరే అనే విధంగా అధిక సమయాల్లో వివిధ ఆధునిక సాంకేతిక మధ్యమాలతో అనుబంధాన్ని పెంచుకుంటున్న గ్రామీణులు ఎక్కువగా సెల్ఫోన్ టెక్నాలజీతో దృశ్య శ్రవణ ఆధారిత సంభాషణలకే పరిమితం అవుతున్నారేమో అనిపిస్తుంది. ప్రత్యక్ష మానవ అవసరాల్లో టెక్నాలజీ ఎంతగానో సహకరిస్తున్నప్పటికీ,సహజ సిద్ధమైన మానవ జీవనశైలితో టెక్నాలజీ విడదీయరాని బం




ధంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోకి వేగంగా పురోగమిస్తుండడం విశేషం. తరచుగా యంత్ర పరికరాలతో వస్తువులు తయారు కావడం,రెడీమేడ్ వస్తువులు ఆన్‌లైన్ అమ్మకాలు, గ్రామాల్లోకి చొచ్చుకు రావడంతో కులవృత్తుల ఆర్థిక స్థితిగతులు క్రమంగా తగ్గిపోవడం లాంటి పరిస్థితుల్లో దారిద్ర రేఖకు దిగువన ఉన్నటువంటి గ్రామీణ కులవృత్తుల వారు ఎక్కువగా బ్రతుకుతెరువు కొరకు పనులు వెతుక్కుంటూ వేరే ప్రాంతాలకు వలసలుగా బయలుదేరుతున్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక టెక్నాలజీ ప్రభావం కూడా ప్రసరిస్తూనేఉంది. వ్యవసాయదారులు చాలావరకు ఆధునిక పోకడలతో యంత్రాలు, సాంకేతికతను ఉపయోగించుకొని పాత పద్ధతులకు భిన్నంగా వ్యవసాయం చేస్తూ ఉండడం గ్రామీణ వ్యవస్థలో సాధారణంగా మారిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని ఎక్కువగా సంపన్నులైన వారే అధికంగా యంత్ర పరికరాలను టెక్నాలజీని వ్యవసాయ రంగంలో ఉపయోగిస్తుండడంతో ప్రత్యామ్నాయంగా వ్యవసాయంలో కూలీలు అవసరం తక్కువైపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ పనులు తగ్గిపోతున్నాయి. తద్వారా గ్రామాల్లోని ఆర్థికపరిస్థితులు సరిగాలేని జనాలు కావాల్సినంత పని దొరకకపోవడంతో వ్యవసాయేతర పనులు వెతుక్కుంటూ పట్టణాలకు వలసలు వెళ్తున్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లు, కాటన్ పిక్కింగ్, రోబో సిస్టం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లాంటి అనేక సాంకేతిక ఆధునిక యంత్ర పరికరాలు వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో రైతులకు అధికంగా మేలు జరుగుతుండటం ఒక ఎత్తుఅయితే, దైనందిన గ్రామీణ జీవన విధానంలో టెక్నాలజీ ఆధారిత వ్యవసాయ సాగు జరుగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఆధునిక యంత్రాల వినియోగంపై రైతులకు నిర్దిష్టమైన శిక్షణను అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత గోచరిస్తుంది. పరిశ్రమలు ఆధునీకరించబడి వస్తుఉత్పత్తి అధికం కావడంతో నేటి గ్రామీణ వ్యవస్థలోకి విరివిగా కంపెనీ వస్తువులు, రెడీమేడ్ వస్తువులు రావడం స్థానిక గ్రామీణ వనరులను తగ్గిం చిందని చెప్పవచ్చు. గ్రామీణులు ఇలాంటి వస్తువులపై ఆకర్షితులవుతున్నారు క్రమంగా కులవృత్తుల వారికి పనులు తక్కువైపోయి చేసిన పనికి గిట్టుబాటు ధర లేకపోవడం ఆధునికరించబడిన పరిశ్రమలలో పనుల కొరకు గ్రామీణులు పట్టణాలకు వలస వెళ్తున్న దృశ్యాలు గ్రామీణ ప్రాంతాల్లో సర్వసాధారణమైపోతున్నాయి. కాలంతో పాటు వస్తున్న మార్పులతో ఆధునిక టెక్నాలజీ గ్రామీణ జీవన విధానాలపై వ్యవసాయ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల పరికరాల కొనుగోలు, వినియోగం గ్రామీణులకు, గ్రామీణప్రాంత చిన్నకారు సన్నకారు రైతులకు ఆర్థిక భారం కలగకుండా టెక్నాలజీ మరింత సులభతరంగా అందుబాటులోకి వచ్చేవిధంగా ఉండాలని కోరుకునే రైతాంగం లేకపోలేదు. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీ ప్రభావం గ్రామీణ జీవన ఆర్థిక సామాజిక అంశాలపై ప్రభావితం చూపెడుతున్నప్పటికీ, గ్రామీణ ప్రజల్లో ఆర్థికంగా నిలదొక్కుకొని ఉన్న రైతాంగం మాత్రం ఆధునిక యంత్ర పరికరాలపై ప్రత్యేక దృష్టి సారి స్తున్నప్పటికీ పేద మధ్యతరగతి గ్రామీణ రైతాంగం కూడా ఆధునిక టెక్నాలజీని అంది పుచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. •

# మత్తుపై చేతల్లో చూపాలి


మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారితీస్తున్నదని దాన్ని సమష్టింగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని, ఎంతోకాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు సెలవిస్తున్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి యేడాదికి యేడాది విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఈ వ్యసనం ఇటీవల కాలంలో పదహారు, పదిహేడేళ్ల పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు నేరాల సంఖ్య అదుపు లేకుండా పెరిగిపోతున్నది.మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతున్నారు. అవి కప్పిపుచ్చుకునేందుకు హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డాక్యుమెంట్ల ద్వారా జరిగిన మత్తుమందుల వ్యాపారంలో ఆసియా ఖండం వాటా పద్నాలుగా శాతానికిపైగా పెరిగిపోయినట్లు చెప్తున్నారు. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం. భారత్‌లో రెండు దశాబ్దాల క్రితం కోటి డెబ్బైలక్షల మంది మత్తుమందు వాడకందార్లు ఉండగా ప్రస్తుతం పదకొండు కోట్లకుపైగా చేరుకున్నదని అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. మత్తుమందుల వాడకంలో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో యేటా పదిహేనువేల కోట్ల రూపాయలకుపైగా మత్తుమందులపై ఖర్చు పెడుతున్నారనే అంచనాలు వెలువడుతున్నాయి. తెలుగురాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉన్నాయి. ఇంకొకపక్క గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీలోనూ, ఇటు తెలంగాణలో ఖమ్మం, వరంగల్ తదితరజిల్లాల్లో అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. ఇక విదేశాల నుండి భారీఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్‌కు ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రపోర్టులో ఇరవైఒక్కవేల కోట్ల రూపాయల విలువైన మూడువేల కిలోల హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింకులు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో కొందరిని అదుపులోకి తీసుకొని విచారించారు. మత్తు మందు సరఫరా కోట్ల డాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాదసంస్థలకే చేరుతుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ తోపాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కాశ్మీర్ ఉగ్రవాదులకు పంజాబ్‌లోని మత్తుమందుల సరఫరా దారులకు గట్టి సంబంధమే ఉన్నట్లు బయటపడింది. అయితే పట్టుబడుతున్నవి వందోవంతు కూడా ఉండకపోవచ్చు. అన్నింటికంటే ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడంవల్ల ప్రపంచవ్యాప్తంగా పెద్దపెద్ద నేరముఠాలు, ఉగ్రవాదులు మాదకద్రవ్యాల ఉత్పత్తి,రవాణాను వ్యాపారంగా మలుచుకుంటున్నాయి. మత్తు ముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పర్చుకుంటున్నారు. భారతదేశంలో ఈతరహా మందులు పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం. అందుబాటులోకి వస్తున్న ఆధునిక, సాంకేతికపరిజ్ఞానాన్ని ఈ మత్తుమందు వ్యాపారులు ఉపయోగించుకుంటున్నారు. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీ చేయగలిగే 'క్రిప్టో కరెన్సీ' వాడకం సైతంపెరగడంతో లావాదేవీలకు అదుపులేకుండా పోయింది. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసినా వాడకందార్లు నమ్మకం ఉన్నవ్యాపారులనే సంప్రదించేవారు. మత్తుమందు తీసుకొని డబ్బు చేతిలో పెట్టేవారు. ఆ వ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తుమందు తెచ్చి అప్పగించేవాడు.అయితే అత్యంత పకడ్బందీగా జరుగుతున్న నిఘా విభాగం అధికారులు కన్నువేయడంతో ఎక్కడో ఒకదగ్గర దొరికిపోయేవారు. ఇప్పుడు ఆపరిస్థితి లేదు.ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని మత్తుమందు వ్యాపారికి ఆర్డర్ ఇవ్వవచ్చు. మత్తు మందు రవాణా, చెల్లింపు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. తాజాగా మట్టిగాజులు, డిక్షనరీలు పార్సిల్లో డ్రగ్ పెట్టి సరఫరా చేస్తున్న విషయం హైదరాబాద్‌లో బయటపడింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పది కొరియర్ సంస్థల ద్వారా యేడాదిలో వందకోట్ల రూపాయలకుపైగా విలువైన డ్రగ్స్‌ను దేశవ్యాప్తంగా తరలించినట్లు వెలుగుచూసింది. హైదరాబాద్‌లోని ప్రముఖప్రతిష్టాకరమైన యూనివర్సిటీ విద్యార్థుల డ్రగ్స్‌దందా బట్టబయలు అయింది. సరఫరాలో పాలుపంచుకున్న ముగ్గురు విద్యార్థులతోసహా మరొక ప్రైవేట్ వ్యక్తిని కూడా దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇలా నిత్యం ఎక్కడో ఒక చోట డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నది.యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా మూడు, నాలుగువేల టన్నుల వరకు సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాను బట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్ల వ్యాపారం జరుగుతున్నది.ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. పట్టుబడిన కేసు ల్లో కూడా పటిష్టంగా వ్యవహరించకపోవడం వల్లనో, లేక చట్టంలో ఉన్న లొసుగులో ఏమోకానీ జైలు నుంచి బయటకు వచ్చినవారు తిరిగి అదేవ్యాపారంలో కొనసాగుతున్నారు. ఏదిఏమైనా మానవ జీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది.

మన ఆలోచనలు నాణ్యమైనవైతే మన మానసిక ఆరోగ్యం చక్కగా ఉంటుంది.



షేక్స్పియర్

మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

# ర్యాగింగ్ 'భూతా'నికి వైద్యం చేయలేమా?

జి. అజయ్ కుమార్

తెలుగు రాష్ట్రాల్లో విద్యా ప్రాంగణాల్లో మళ్లీ ర్యాగింగ్ భూతం చాప కింద నీరులా విస్తరిస్తుంది. ఇటీవల నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, పల్నాడు జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోటుచేసుకున్న సంఘటనలు సీనియర్స్ జూనియర్స్‌పై వ్యవహరించిన తీరు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి. విద్యాలయం అనగానేస్నేహం, విజ్ఞానం, నమ్మకం, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకాలు గుర్తొచ్చేలా ఉండాలి. కానీ భయం, అవమానం, ఆత్మనూన్యత భావం, కన్నీళ్లు కాదు.అది విద్యాసంస్కృతికి మచ్చలా మారుతుంది. విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తుంది. కొంత మంది సీనియర్లు ర్యాగింగ్‌ను ఇప్పటికీ సరదాగా తీసుకుంటున్నారు. ఇంటరాక్షన్ పేరుతో జూనియర్లతో శాడిస్ట్ లాగా జుగుప్సాకరంగా ప్రవర్తిస్తున్నారు. కానీ వాస్తవానికి అది మానసిక హింస, శారీరక దాడి, సామాజిక అవమానం, చాలా పెద్ద నేరంగా పరిగణించబడుతుంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం దేశంలో వందల కొద్దీ ర్యాగింగ్ కేసులు నమోదవుతున్నాయి. చాలా కేసులు పోలీస్ స్టేషన్లలోకి రాకుండానే ఆగిపోతున్నాయి. గత పది సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా సుమారు 200 మంది విద్యార్థులు ర్యాగింగ్ కారణంగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అదే సమయంలో వేలాది మంది విద్యార్థులు మానసిక ఒత్తిడితో చదువును మధ్యలోనే మానేయాల్సి వచ్చింది.ఇంత పెద్ద నేరాన్ని సరదాగా తీసుకోవడం సమాజానికి అస్సలు మంచిదికాదు. ఇది జూనియర్స్ తో పాటు సీనియర్స్ భవిష్యత్తును కూడా ప్రశ్నార్థకంగా మారుస్తున్నది. పాఠశాలల నుండి విలువలతో కూడిన విద్య అందకపోవడం, తల్లిదండ్రులు పిల్లలకు సామాజిక విలువలు నేర్పకపోవడం, పక్కవాళ్లతో ఎలా మెలగాలో చెప్పకపోవడం, మితిమీరిన స్వేచ్ఛ ఇవ్వడం వంటివి వారి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయి. కళాశాలలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలున్నా వాటి అమలు సరిగా లేకపోవడం కళాశాల యాజమాన్యాలు చూసి చూడనట్టు వదిలివేయడం, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వంటివి చట్ట అమలు బలహీనతవుండడం, ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధించకపోవడం వంటివి. ఇంకా ర్యాగింగ్ సాధారణమైన విషయంగా నేటి సమాజం తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల భావించడం వంటివి కూడా దీనికి కారణంగా ఉన్నాయి. ఇలా అన్ని వర్గాలు మౌనంగా ఉండటంతో ర్యాగింగ్ అనే రాక్షసం మళ్లీ మళ్లీ తలెత్తుతోంది. సీనియర్లు అంటే జూనియర్లకు దారి చూపే మార్గదర్శకులు. ప్రోత్సహించే వారు, స్నేహ హస్తం అందించేవారు, భరోసా కల్పించేవారు,కానీ నేటి పరిస్థితుల్లో కొందరు సీనియర్లు జూనియర్లను భయపెట్టడమే తమ గౌరవంగా భావిస్తున్నారు. అది సీనియారిటీ కాదు వారి దురహంకారం. జూనియర్ల భవిష్యత్తు సీనియర్ల చేతుల్లో ఉంటుంది వారు మార్గదర్శకులుగా ఉండాలి. అందుకే సీనియర్ విద్యార్థులు తమ బాధ్యతను మరచిపోకూడదు. సుప్రీంకోర్టు ఇప్పటికే ర్యాగింగ్‌ను నేరంగా ప్రకటించింది. యూజీసీ 2009 ఆంటీ ర్యాగింగ్ రెగ్యులేషన్ల ప్రకారం ర్యాగింగ్ చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ కేసు తప్పదు.కళాశాల నుంచి బహిష్కరణ తప్పదు, స్కాలర్‌షిప్ రద్దు చేయబడుతుంది. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, హెల్ప్‌లైన్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. కానీ అసలు సమస్య అమలులోనే ఉంది.కొన్ని కళాశాలలు కమిటీలు పేరుకే ఉంటాయి.కానీ అవి పనిచేయవు. ర్యాగింగ్ ఫిర్యాదులు బయటపడితే కళాశాల పేరు చెడిపోతుందనే భయంతో వాటిని దాచేస్తారు. ఇదే ఇంకా ర్యాగింగ్ పెరగడానికి కారణం అవుతుంది. కళాశాలల్లో జీరో టాలరెన్స్ పాలసీని కఠినంగా అమలు చేయాలి. సి సి టీవీ పర్యవేక్షణ తప్పనిసరి. సీనియర్లు భయాన్ని కలిగించడం కాదు భరోసా ఇవ్వండి. సీనియారిటీ మార్గదర్శక త్వంలో, భరోసాని కల్పించడంలో ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలి. జూనియర్లు ర్యాగింగ్ ఎదురైతే మౌనంగా ఉండకుండావెంటనే సంబంధిత అధికారులకు,తల్లిదండ్రులకు తెలియచేయడం, హెల్ప్‌లైన్‌కి ఫిర్యాదు చేయడం చేయాలి. తల్లిదండ్రులు, సమాజం పిల్లల్లో ధైర్యం నింపాలి. ర్యాగింగ్‌ను సహించరాదని స్పష్టంగా నేర్పాలి. ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేయాలి. •

# ప్రజావాక్కు



## పెద్దలు ఆలోచించాలి

ఉపరాష్ట్రపతిగా మాజీ జడ్జి పోటీయే సరికాదని మాజీ ప్రధానన్యాయమూర్తులు జస్టిస్ పి.సదాశివం,జస్టిస్ రంజన్ గొగోయ్‌తో పాటు 56 మంది విశ్రాంత న్యాయమూర్తులు తీవ్ర అభ్యంతరం వెలుబుచ్చారు. రిటైరైన తరువాతసదాశివం కేరళ గవర్నరయ్యారు.గొగోయ్ రాజ్యసభ మెంబరయ్యారు కదా.అవి మరచిరెడ్డి మీద విరుచుకుపడడం ఎందుకు? మరొక వాస్తవం ఏమంటే 1967లో సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి కోకా సుబ్బారావు గారు తన పదవికి రాజీనామా చేసి భారత దేశ అధ్యక్షునిగా పోటీ చేసారు.1982 లో సుప్రీంకోర్టు జడ్జి హెచ్.ఆర్. ఖన్నాగారు కూడా దేశ ప్రధమ పౌరుని పదవికి పోటీ చేసారు.అలాగే 1969లోసి.జె.ఐ.గా ఉన్న హిదయతుల్లా గారు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవిని అలంకరించ లేదా? ఇప్పుడు విపక్ష కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ చేయడం సరికాదనడం అనేక కేసులను పర్యవేక్షించి తీర్పులిచ్చిన వారికిది తగునా? విజ్ఞులు ఆలోచించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## చరిత్రాత్మక మలుపు

చైనా, రష్యా,బ్రెజిల్ దేశాలు అమెరికా వాణిజ్య యుద్ధానికి ఎదురు నిలుస్తున్న వేళ, భారత్ కూడా వెనకడుగు వేయకపోవడం విశేషం. ట్రంప్ చూపిస్తున్న వ్యతిరేకత రాజకీయ అహంకారంపైనే ఆధారపడినట్లు భారత్- పాకిస్థాన్‌మధ్య యుద్ధాన్ని తానుఆపినట్టన్న అతని వ్యాఖ్యలను రెండు దేశాలు ఖండించడం నిరూపిస్తోంది.తక్షణ ప్రభావం ప్రతికూలమైనా,దీర్ఘకాలంలో ఈఆంక్షలు భారత్‌ను ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తాయి. స్వదేశీ పరిశ్రమలు, రైతు ఆధారిత ఉత్పత్తులు బలపడతాయి.

- సి. హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## అన్ని రాష్ట్రాలకు మిజోరం ఆదర్శం

మిజోరం రాష్ట్రంలో ఉన్న భిక్షాటకులను పూర్తిగా ఆ పని నుండినిరోధించి వారికిప్రత్యేకంగా పునరావాసం కలిగిస్తూ ఏర్పాట్లు చేస్తూ కొత్త చట్టం చేశారు. ఇది మంచిదే. చట్టం వల్ల, దాని అమలు,పునరావాసం బట్టి మార్పులు వస్తాయి. ఏ ఆధారం లేని వ్యక్తులు అలా మారుతున్నారు. అది వారికీ, సమాజానికి చిన్నతనమే.కావున తగిన పునరావాస ఏర్పాట్లుఉంటే, కచ్చితంగా ఈ ఆలోచన గొప్పదే.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## డీఎస్సీ ఎంపిక జాబితా విడుదల చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం డీఎస్సీ2025 సెలెక్షన్‌కు సంబంధించి ఎంపికయిన అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఆన్లైన్లో కాల్ లెటర్లు డౌన్లోడ్ చేసుకునేలా చేసారు. అందరికీ ఒకేసారి అందరికీ కాల్ లెటర్స్ డౌన్లోడ్ చేసుకునే ఏర్పాటు జరగలేదు. కొందరు మెరిట్ మార్క్స్ వచ్చినప్పటికీ కాల్ లెటర్స్ రాక ఆందోళన చెందారు. అభ్యర్థులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టారు. అధికారులు సరైన విధానంలో స్పందించడం లేదు. కనీసం వెరిఫికేషన్ జాబితాలు కూడా అందరికీ అందుబాటులోకి ఉంచకపోవడంతో డిఎస్సీ అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. డిఎస్సీ నియామకాలకు సంబంధించి ఎంపిక జాబితా ప్రకటించి ఉంటే ఈ పరిస్థితులు ఎదురయ్యేవి కావు. గతంలో డిఎస్సీ ఎంపిక జాబితా ముందుగా విడుదల చేసి తర్వాత సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరిగేది. కానీ నియామకాలకు సంబంధించి గతంలో లాగా ఎంపిక జాబితా విడుదల చేయలేదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## సరదా వెనుక దాగిన సవాళ్లు

ఆధునిక డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ గేమ్స్ అనేవి కోట్లాది యువతను ఆకర్షిస్తున్న వినోద వేదికలుగా మారాయి. పబ్జ్, ఫైర్,మిన్ క్రాఫ్ట్, వంటి గేమ్స్ కేవలం ఆటలు మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో మల్టీబిలియన్ డాలర్ల పరిశ్రమగా ఎదిగాయి. ఆధునిక గ్రాఫిక్స్, శబ్ద ప్రభావాలు, రివార్డ్స్, లీడర్ బోర్డ్స్ వంటిఅంశాలు యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయి.కానీవినోదం వెనుకదాగిఉన్న మానసిక,శారీరక, సామాజిక ప్రమాదాలను సమాజం సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ గేమ్స్ ప్రారంభంలో వినోదం కోసం ఆడినా, తరువాత అవి వ్యసనంగా మారుతున్నాయి.

- వెంకటరమణ, గిలకత్తుల

## హామీలు పత్రికల ప్రకటనల వరకేనా?

పశ్చిమగోదావరి జిల్లాఅత్తిలి మండల పరిధిలోని 'ఊరదాళ్ళపాలెం' గ్రామ ప్రధాన రహదారి మీదుగా రహదారుల మరమ్మతులికి రూ.3.50 కోట్లు మంజూరైనట్లు, టెండర్లు పిలిచి రోడ్లు మరమ్మతులు చేపడతామని జిల్లా కలెక్టర్ జూలై 17న పత్రికల ముఖంగా తెలిపారు. కలెక్టర్ హామీ ఇచ్చి నెల పైనే గడిచినా హామీలు పత్రికా ప్రకటనల వరకే గానీ ఆచరణకు నోచుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

-దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

# అంగడి సరుకుగా మారుతున్న అమ్మతనం



మేకిరి దామోదర్

ఆధునిక సమాజం వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక బాధ్యతల మధ్య ఎంతగానో నలిగిపోతుంది. నిజమైన స్వేచ్ఛకి పరిమితులుంటాయి. అవి లేని దాన్ని విశృంఖలత్వం అంటారు.ఆధునిక టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. దానితో ప్రాణం తీయవచ్చు.శస్త్రచికిత్స చేసి ప్రాణం కాపాడవచ్చు.సామాజిక బాధ్యతలు గల పాలకులు,డాక్టర్లు ఆధునిక సాంకేతిక ఫలాలు సామాన్యుడి వికాసానికి, సామాజిక విలువలు పెంచినప్పుడే దానికి సార్థకత. దేశవ్యాప్తంగా, అలాగే రాష్ట్రంలో అబార్షన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సృష్టికి ప్రతి సృష్టి చేసే అమ్మతనం పేగు బంధాన్ని తెంచేసుకుంటోంది!. మారుతున్న సామాజిక పోకడలు పాశ్చాత్య సంస్కృతి,భయమో,భారమో, బాధ్యతారాహిత్యమో గర్భస్థ శిశువుల్ని తల్లులు కడుపులోనే చిదిమేస్తున్నారు. ఆధునిక ఆహారపు అలవాట్లు, ఉరుకు పరుగుల ఒత్తిడిలో,ఆధునిక సామాజిక పోకడలతో ఓవైపు మహిళల్లో పునరుత్పత్తి శక్తి సన్నగిల్లుతోందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆధునిక టెక్నాలజీతోమారుతున్న ఆలోచనలతో గర్భిణులు బిడ్డల్ని వద్దనుకునే కారణాలు అనేకం!. ఈ తరహా పెడధోరణులు సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి. ఓవైపు భారతదేశంలో ఉత్తరాది, దక్షిణాది ఆధిపత్య రాజకీయాల్లో ఉత్తరాది పెత్తనం పెరిగిపోతుందని, దక్షిణాది రాష్ట్రాల్లో జనాభాను పెంచాలని ఆయా ప్రభుత్వాలు ప్రజల్ని కోరుతున్నాయి. గతంలో కుటుంబ నియంత్రణ పాటిస్తే ఇచ్చిన ప్రయోజనాల కంటే ఎక్కువమంది పిల్లల్ని కంటే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న అబార్షన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా 2020-21లో తెలంగాణలో 2,282 అబార్షన్లు నమోదయ్యాయి.2024-25 నాటికి ఈ సంఖ్య పదిరెట్లు పెరిగి 16,059 అబార్షన్లు జరిగినట్లు గణాంకాలు చెప్తున్నాయి. ఈ లెక్కలన్నీ పార్లమెంటులో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోనే హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం(హెచ్ఎంఐఎస్) వెల్లడించింది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన ఐదేళ్లలో అబార్షన్లు నాలుగు రెట్లు పెరిగాయి.ఈ రాష్ట్రంలో 2020-21 ఆర్థికసంవత్సరంలో 2,282అబార్షన్లు జరగగా 2024-25 నాటికి ఈ సంఖ్య10,676కు పెరిగింది. దేశవ్యాప్తంగా అబార్షన్లు అధికంగా జరిగిన టాప్5 రాష్ట్రాల వివరాలను హెచ్ఎంఐఎస్ ప్రకటించింది. అబార్షన్లలో మహారాష్ట్ర మొదటి స్థానంలోఉంది. ఈ రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,07,019 అబార్షన్‌లు జరిగాయి. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు 1,01,414, అస్సాం 76,642, కర్ణాటక70,241, రాజస్థాన్ 53,714 ఉన్నాయి. అయితే ఈ అబార్షన్ల వెనక అనేక విషాద ఘటనలు ఉన్నాయి. మెడికల్ అన్‌ఫిట్‌తో అబార్షన్లు కావడం వేరు, ఉద్దేశ్యపూర్వకంగా గర్భవిచ్ఛిత్తి చేయించుకోవడంవేరు. సమాజంపై ముఖ్యంగా మహిళల మానసిక,శారీరక ఆరోగ్య పరిస్థితులపై అబార్షన్లు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.



అబార్షన్లకు కారణాలు పరిశీలిస్తే, యువతలో మారుతున్న ఆలోచనా ధోరణి, ఆర్థిక స్వేచ్ఛ, కోలివింగ్ లాంటి పాశ్చాత్య సంస్కృతి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో తెలిసి తెలియని వయసులో మైనర్ బాలికలు గర్భం దాల్చడం, పరువుపోతుందనే భయంతో తల్లిదండ్రులు కులపంచాయతీలు పెట్టి గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేయించడం ఇంకా కొనసాగుతోంది. మరోవైపు ఆదివాసీ గిరిజన ప్రాంతాల మహిళలకు సరైన వైద్యసౌకర్యాలు లేకపోవడం, పౌష్టికాహారం అందకపోవడం వంటివి కూడా అబార్షన్ల పెరుగుదలకు కారణమవుతున్నాయి. మరోవైపు ఆర్థిక భద్రత ఉన్నవారు, ఇప్పట్లో సంతానం వద్దనుకునే దంపతుల సంఖ్య పెరిగిపోతుంది. ఉన్నంతకాలం ఎంజాయ్ చేద్దాం అనే ధోరణి ప్రబలుతోంది. గర్భం దాల్చినట్టు తెలియగానే అబార్షన్ చేయించుకుంటున్నారు. ఈ తరహా ధోరణులు సమాజంలో ఆందోళన కలిగించే అంశాలుగా మారుతోంది. ఈమధ్య మన రాష్ట్రంలో బయటపడ్డ అటు సరోగసీ ఇటు స్పెర్మ్ కలెక్షన్ యువతే లక్ష్యంగా వీర్యకణాల దందా స్పెర్మ్ ఇస్తూ డబ్బులు ఇవ్వ (తీసుకో)వడం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఐవీఎఫ్ సెంటర్లు తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా ఉంది. ఇలా ఫెర్టిలిటీ సెంటర్లు పెట్టి స్పెర్మ్ కలెక్షన్ బ్యాంకులో అమ్మతనాన్ని అంగడి సరుకుగా మార్చేస్తున్నాయి. ఇక్కడ నోరూల్స్,నో హ్యూమానిటీ అంతా (ఓన్లీ)మనీ అన్నట్టుగా వసూళ్ల దందా కొనసాగుతోంది. పెరుగుతోన్న సంతానలేమి సమస్యతో ఐవీఎఫ్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పిల్లలు లేని దంపతుల తాపత్రయాన్ని ఆసరా చేసుకుని మోసాలు చేస్తున్నాయి.రాష్ట్రంలో ఐయూఎఫ్, ఐవిఎఫ్ చికిత్సల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి.కాస్త పేరు గాంచిన సెంటర్లు రెట్టింపుగా వసూలు చేస్తున్నాయి. సంతానలేమి దంపతులు చికిత్సలు,మందులు వాడినా ఫలితం లేకపోవడంతో చివరకు ఈ సెంటర్లు అడ్డదారులు తొక్కుతున్నాయి.ఫెర్టిలిటీ సెంటర్లలో వీర్యకణాల బ్యాంకులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇక్కడ సరిపోగా మిగిలిన వీర్యకణాలను ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దాంతో ఐవీఎఫ్ ట్రీట్మెంట్స్ తీసుకునేవారికే ఇప్పుడు అనుమానాలు వ్యక్తమయ్యేపరిస్థితులు వస్తున్నాయి. వారికి పుట్టిన బిడ్డలు నిజంగా వారికి పుట్టిన వారేనా! లేక వేరే డిఎన్ఏ ఉందా అని సందేహాలు వెంటాడుతున్నాయి.ఇలా ఒక సంస్థ చేసే తప్పుడు పనులతో చాలామంది తల్లిదండ్రుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. పేద మహిళలను లక్ష్యంగా చేసుకొని సరోగసీ కోసం ఒప్పందాలు చేసినట్టు అప్పటి ఆరోపణలే, ఈమధ్య బయటపడిన సంఘటనలతో నిర్ధారించబడ్డాయి. మనదేశంలో సరోగసీ, స్పెర్మ్ సేకరణలకు నిర్దిష్టమైన చట్టాలు ఉన్నాయి. కమర్షియల్ సరోగసీ మన దేశంలో పూర్తిగా నిషేధం. కేవలం ఆల్ట్రా యిస్టిక్ సరోగసీ అంటే మెడికల్ ఖర్చులు, ఇన్సూరెన్స్ మినహా ఆర్థిక ప్రతిఫలం లేని సరోగసీ అనుమతి ఉంటుంది. అలాగే సరోగసీ మదర్ భారత్ పౌరులై ఉండాలి.25నుంచి 35ఏళ్ల వయసు కలిగి ఉండాలి. ఇది ఒక్కసారి మాత్రమే సరోగెట్‌గా ఉండగలదు. విదేశీ జంటలకు మన దగ్గర అనుమతి లేదు. 30 ఏళ్లలోపు యువతీ యువకుల నుంచి సేకరించినఅండాలను, శుక్రకణాలను పిల్లల కోసం పరితపించే దంపతులకు అంటగడుతూ డబ్బులు సొమ్ము చేసు కుంటున్నారు. ఏఆర్టి చట్టం ప్రకారం,స్పెర్మ్ సేకరణ కోసం ఏ ఆర్టీ బ్యాంకులు నేషనల్ రిజిస్ట్రీఆఫ్ బ్యాంక్స్‌అండ్ క్లినిక్స్‌లో రిజిస్టర్ అయి ఉండాలి. స్పెర్మ్‌డోనర్లు 21-55ఏళ్ల వయసు కలిగిఉండాలి. స్పెర్మ్‌నిల్వల కోసం క్రయోట్యాంకులు 196సీ వద్ద నిర్వహించబడాలి.ఒకవేళ ఈనిబంధనలను ఉల్లంఘిస్తే కనీసం10ఏళ్ల జైలు శిక్ష,రూ.10 లక్షలజరిమానా విధించవచ్చు. అయితే ఈ చట్టాలు కఠినంగా ఉన్నా సరైనపర్యవేక్షణ లేకపోవడంతో సరోగసీ సెంటర్లు రెచ్చిపోతున్నాయి. ఈ సామాజిక రుగ్మతను నిర్మూలించుటకు ప్రజల్లో విస్తృత అవగాహన, చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. •

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్‌పై ఆంక్షలు విధించండి..

## ఐరోపా యూనియన్‌ను కోరిన అమెరికా

**బ్రస్సెల్స్, ఆగస్టు 31:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని బూచిగా చూపి భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను కోరినట్లు సమాచారం. ప్రస్తుతం భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే అమెరికా మాదిరిగానే భారత్‌పై సుంకాలను పెంచాలని ట్రంప్ యంత్రాంగం యూరప్ దేశాలను కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆంక్షలు విధించడంతోపాటు భారత్ నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును నిలిపి వేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ అయ్యారు. యుద్ధం ముగించేందుకు అగ్రరాజ్యాధిపతి తీసుకుంటున్న చర్యలకు కొంతమంది



యూరోపియన్ నాయకులు మద్దతు పలికినట్లు సమాచారం. అయితే భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై యూరోపియన్ దేశాలు మౌనంగా ఉన్నాయి. సుంకాలు విధించడాన్ని సమర్థించలేదు. అలా అని తప్పుబట్టలేదు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని ట్రంప్ పరిపాలనాధికారులు కోరడం గమనించాల్సిన విషయం. భారత్ నుంచి చమురు, సహజ వాయువు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయాలని, అమెరికా తరహాలో ఆంక్షలు విధించాలని శ్వేత సౌధం కోరినట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయని పక్షంలో రెండో దశ సుంకాలను విధించాలని కూడా సూచించినట్టు సమాచారం. తమపై 50 శాతం సుంకం విధించడాన్ని భారత్ తొలి నుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేస్తున్న చైనాను వదిలి తమపై సుంకాలు విధించడం ఏంటని భారత్ ప్రశ్నిస్తోంది. ఐరోపా దేశాలు కూడా రష్యా సహజవాయువును కొనుగోలు చేస్తున్న తీరును భారత్ లేవనెత్తింది. ఇక రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగించాలన్న ట్రంప్ ప్రయత్నాలకు కొందరు ఐరోపా నేతలు బహిరంగంగా మద్దుతు పలుకుతూ తెర వెనుక మాత్రం పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని శ్వేత సౌధం భావిస్తోంది. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా మండిపడుతున్నా ఐరోపా దేశాలు మాత్రం మౌనం వహించాయి. ట్రంప్ సుంకాల విధింపునకు బహిరంగంగా ఎలాంటి మద్దతు ప్రకటించలేదు. 'ఐరోపా నేతల విషయంలో శ్వేత సౌధం సహనం నశిస్తోంది' అని ఓవల్ ఆఫీసు ఉన్నతాధికారి ఒకరు కామెంట్ చేశారు. మరింత మెరుగైన డీల్ కోసం వేచి చూడాలని ఉక్రెయిన్ అధ్యక్షుడిని తెర వెనక ఉండి ఐరోపా దేశాలు ప్రోత్సహిస్తున్నట్టు వైట్ హౌస్ వర్గాలు భావిస్తు న్నాయి. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో పాల్గొనేందుకు చైనాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చైనా, రష్యా అధ్యక్షు లతో ప్రత్యేకంగా చర్చలు జరిపే అవకాశం ఉన్న ట్టు తెలుస్తోంది. ఈ చర్చల్లో ట్రంప్ సుంకాలు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రధాన అంశాలుగా ఉండనున్నాయని సమాచారం.



## భారత్ క్వాడ్‌సదస్సుకు ట్రంప్ డుమ్మా..

### తాజా పరిణామాల నేపథ్యంలో మనసు మార్చుకొన్న అమెరికా అధ్యక్షుడు

**న్యూఢిల్లీ,ఆగస్టు 31:** అమెరికా, భారత్ మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్న నేపథ్యంలో న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనాలు మరింత సంచలనంగా కలిగించాయి. భారత్‌లో పర్యటించాలన్న ప్లాన్‌ను ట్రంప్ తాజాగా పక్కన పెట్టేసినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. సెప్టెంబర్-డిసెంబర్ మధ్య కాలంలో క్వాడ్ సమావేశాల కోసం భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ గతంలో ప్రధాని మోదీకి చెప్పారట. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ ప్లాన్స్‌ను పక్కన పెట్టేశారట. అయితే, ఈ విషయమై అటు అమెరికా, ఇటు భారత్ స్పందించలేదు. త్వరలో భారత్ వేదికగా క్వాడ్ కూటమి శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇక ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే అమెరికాలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ప్రతిష్టంభన నెలకొందని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీల సంబంధాలు కూడా తిరోగమనంలో ఉన్నాయని పేర్కొంది. భారత్, పాక్ మధ్య రాజీ కుదిర్చానన్న ట్రంప్ ప్రకటనతో వివాదం ముదిరిందని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. 'తనే రాజీ కుదిర్చానని ట్రంప్ పదే పదే చెప్పడం ప్రధాని నరేంద్ర మోదీకి కోపం తెప్పించింది. ట్రంప్ తీరుతో మోదీ సహనం నశిస్తోంది' అని తెలిపింది. ఇక కెనడాలో ఇటీవల జరిగిన జీ7 సమావేశాలకు అటు ట్రంప్ ఇటు ప్రధాని మోదీ ఇద్దరూ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఇద్దరి మధ్య సమావేశం కూడా జరగాల్సి ఉంది. అయితే, ట్రంప్ అత్యవసరంగా అమెరికాకు వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీతో దాదాపు 35 నిమిషాలపాటు ఫోన్ కాల్‌లో మాట్లాడారట. ఈ సందర్భంగా భారత్‌పాక్ మధ్య మూడోదేశం మధ్యవర్తిత్వం అంగీకరించబోమని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్టు తెలిసింది. నోబెల్ ప్రైజ్‌కు పాక్ తనను నామినేట్ చేస్తున్న విషయాన్ని కూడా ట్రంప్ ఆకాల్‌లో పేర్కొన్నారని, భారత్ కూడా ఇదే చేయాలన్న పరోక్ష సూచనచేశారని న్యూయార్క్ టైమ్స్ రాసుకొచ్చింది. ఈ కారణంగా ఇరు నేతల మధ్య ఎడం పెరిగినట్టుతెలిపింది. ఈ ఫోన్ కాల్‌కు సంబంధించి అమెరికా ఇంతవరకూ స్పందించలేదు.

# మహాకూటమి సిఎం అభ్యర్ధిని నేనే..

## రాహుల్, అఖిలేష్ సమక్షంలోనే ప్రకటించిన తేజస్వి



**పాట్నా,ఆగస్టు 31:** బీహార్‌లో మహా ఘట్‌బంధన్ కూటమి సీఎం అభ్యర్థి తానే అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఆరా జిల్లాలో 'ఓట్ అధికార్ యాత్ర' కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవేదికపై రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌లు ఉన్నా తేజస్వి వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. సీఎం అభ్యర్థిని తానేనంటూ తేజస్వీ యాదవ్ వారి సమక్షంలో ప్రకటించగా వారు మాత్రం చప్పుడు చేయలేదు. ముఖ్యంగా రాహుల్ గాంధీ మాత్రం దీనిపై నోరు మెదపలేదు. అలాగే నితీశ్ కుమార్ ప్రభుత్వంపై తేజస్వీ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినప్పటికీ బీహార్‌లో ఆర్జేడీదే పైచేయి అని తెలిపారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా, ఒరిజినల్ ముఖ్యమంత్రి కావాలా అంటూ ఆరాలో జరిగిన ర్యాలీలో తేజస్వీ యాదవ్ మాట్లాడతూ తాను ప్రకటించిన సంక్షేమ పథకాలనే సీఎం నితీశ్ కుమార్ అమలు చేస్తు న్నారని ఆరోపించారు. ముందు నేను వెళ్తుంటే ప్రభుత్వం వెనుక వస్తోందని ఎద్దేవాచేసారు. ఈ సభలోనే ప్రజలను ఓ సూటి ప్రశ్న అడిగారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా? ఒరిజినల్ సీఎం కావాలా? అంటూ ప్రశ్నించారు. అలాగే మహా ఘట్‌బంధన్ తరఫున సీఎం అభ్యర్థిని తానేనని తేజస్వి మరోసారి నొక్కి చెప్పారు. అయితే రెండోసారి చెప్పినప్పుడు కూడా రాహుల్ గాంధీ మౌనంగానే ఉండిపోయారు. బీహార్‌లో ఆర్జేడీదే కీలక పాత్ర పోషిస్తోంది. బీహార్‌లో కాంగ్రెస్ కంటే ఆర్జేడీ పెద్దన్న పాత్ర పోషిస్తుందని తేజస్వీ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కంటే తమ పార్టీకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పకనే చెప్పారు. తేజస్వీ ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ సమక్షంలోనే ఆయన ఈ కామెంట్లు చేయగా వీరిద్దరూ నోరు మెదపకపోవడం గమనార్హంగా నిలిచింది. ముఖ్యంగా తేజస్వీ యాదవ్ మొదటి నుంచీ నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని తప్పు పడుతూనే వస్తున్నారు. తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. పదవీ విరమణ వయసు 60 ఏళ్లేనని మరి 75 ఏళ్ల సీఎం అవసరమా అంటూ వ్యాఖ్యానించారు. నితీష్ కుమార్ సీఎం పదవి నుంచి తొలగిపోవాలంటూ పదే పదే డిమాండ్ చేశారు.



## దేశ భద్రతపై రాజీపడుతున్న ప్రధాని మోడీ

### జిన్‌పింగ్‌తో మోడీ భేటీపై కాంగ్రెస్‌నేత ఫైర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఆదివారం టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. చైనా పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న మెతక వైఖరిని ఎండగడుతూ, దేశ భద్రత విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ త్యాగాలను విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆర్మీ చీఫ్ కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జూలై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మౌనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలుచేస్తోందని ఆయన ఆక్షేపించారు.

# నేను బతికే ఉన్నా..

## సోషల్‌మీడియా వైరల్‌కు ఫుల్‌స్టాప్ పెట్టిన ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 31:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులకు ఎట్టకేలకు తెరపడింది. కొన్ని రోజులుగా ఆయన ప్రజల ముందుకు రాకపోవడంతో మొదలైన ఊహాగానాలు తీవ్రరూపం దాల్చాయి. అయితే, శనివారం ఉదయం ఆయన వైట్‌హౌస్‌లో ప్రత్యక్షమవ్వడంతో ఈ పుకార్లన్నీ అబద్ధమని తేలిపోయింది. ఐదురోజుల క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశం తర్వాత ట్రంప్ మళ్లీ బహిరంగంగా కనిపించలేదు. దీనికి తోడు, వారాంతంలో అధ్యక్షుడికి ఎలాంటి అధికారిక కార్యక్రమాలు లేవని వైట్‌హౌస్ షెడ్యూల్ విడుదల చేయడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచి హ్యాష్‌ట్యాగ్‌లు ఎక్స్‌లో విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. ట్రంప్ ఆరోగ్యంపై రకరకాల కుట్ర సిద్ధాంతాలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 8:45 గంటల సమయంలో ట్రంప్ వైట్‌హౌస్‌లో కనిపించారు. తెల్లటి పోలో షర్ట్, నల్ల ప్యాంటు, ఎర్రటి మాగా టోపీ ధరించి, తన మనవరాళ్లు కై ట్రంప్, స్పెన్సర్ ఫ్రెడరిక్ ట్రంప్‌లతో కలిసి వర్జీనియాలోని స్టెర్లింగ్‌లో ఉన్న తన గోల్ఫ్ క్లబ్‌కు బయలుదేరారు. దీంతో ఆయన ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నారని స్పష్టమైంది. అంతకుముందు కూడా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో యాక్టివ్‌గా ఉన్నారు. అమెరికా వాణిజ్య విధానాలకు సంబంధించి ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన స్పందించారు. అన్ని టారిఫ్‌లు ఇంకా అమలులోనే ఉన్నాయి. పక్షపాతంతో కూడిన కోర్టు వాటిని తొలగించాలని



చెప్పినా, అంతిమంగా అమెరికానే గెలుస్తుంది. ఈ సుంకాలను ఎత్తేస్తే దేశానికి పెను నష్టం జరుగుతుందని ఆయన పోస్ట్ చేశారు. ఇదే సమయంలో డైలీ కాలర్ వైట్‌హౌస్ కరస్పాండెంట్ రీగన్ రీస్ కూడా ఈ వదంతులను ఖండించారు. నేను నిన్న మధ్యాహ్నం అధ్యక్షుడితోనే ఉన్నాను. ఆయన్ను గంటపాటు ఇంటర్వ్యూ చేశాను. ఆయన చనిపోయారని లేదా అనారోగ్యంతో ఉన్నారని ప్రచారం జరగ డం ఆశ్చర్యంగా ఉందని ఆమె తెలిపారు. మొత్తానికి, ట్రంప్ ప్రత్యక్షం కావడంతో ఈ వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది.

# సరిహద్దు వివాదాలతో మరుగునపడిన పంచశీల ఒప్పందం

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** భారత్‌చైనా సంబంధాల గురించి చర్చ వచ్చినప్పుడల్లా 'పంచశీల ఒప్పందం' ప్రస్తావనకు వస్తున్నది. 'హిందీచీనీ భాయ్ భాయ్' నినాదాలతో స్నేహానికి ప్రతీకగా మొదలైన ఈ ఒప్పందం, చివరికి రెండు దేశాల మధ్య యుద్ధానికి దారితీయడం ఒక చారిత్రక విషాదం. సుమారు 70 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఒప్పందం వెనుక ఎన్నో ఆశలు, రాజీలు, ఆ తర్వాత తీవ్ర పరిణామాలు ఉన్నాయి. 1954లో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చైనాలో పర్యటించారు. మావో జెడాంగ్ నేతృత్వంలో చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆ దేశాన్ని సందర్శించిన తొలి కమ్యూనిస్టేతర నేత నెహ్రూనే. తన కుమార్తె ఇందిరా గాంధీతో కలిసి చైనాకు వెళ్లిన ఆయనకు చైనా ప్రభుత్వం అపూర్వ స్వాగతం పలికింది. బీజింగ్, షాంఘై వంటి నగరాల్లో పర్యటించిన నెహ్రూ.. అమెరికా, సోవియట్ యూనియన్ కూటములతో సంబంధం లేకుండా ఆసియా దేశాల మధ్య శాంతియుత సంబంధాలు ఉం




డాలని ఆకాంక్షించారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య కొత్త స్నేహానికి నాంది పలుకుతుందని ఆయన బలంగా విశ్వసించారు. నెహ్రూ పర్యటనకు రెండు నెలల ముందు, అంటే 1954 ఏప్రిల్ 29న, టిబెట్ ఒప్పందంలో భాగంగా భారత్‌చైనా మధ్య పంచశీల ఒప్పందం కుదిరింది. భారత రాయబారి ఎన్. రాఘవన్, చైనా ప్రతినిధి చాంగ్ హన్‌ఫు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒకరి సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను మరొకరు గౌరవించుకోవడం. పరస్పరం దురాక్రమణలకు పాల్పడకపోవడం. ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకపోవడం. సమానత్వం, పరస్పర ప్రయోజనాల కోసం పనిచేయడం. శాంతియుత సహజీవనం. అయితే, ఈ ఒప్పందంలో భారత్ ఒక చారిత్రక రాజీకి తలొగ్గాల్సి వచ్చింది. టిబెట్‌ను చైనాలోని టిబెట్ ప్రాంతంగా అంగీకరించి, దానిపై చైనా సార్వభౌమత్వాన్ని అధికారికంగా గుర్తించింది. శాంతి మంత్రంలా కనిపించిన ఈ ఒప్పందం వెనుక చర్చల సమయంలోనే తీవ్ర భేదాభిప్రాయాలు తలెత్తాయి. ముఖ్యంగా హిమాలయాల్లోని వ్యాపార, యాత్రా మార్గాల విషయంలో చైనా మొండిగా వ్యవహరించింది. భారత్ ప్రతిపాదించిన పలు సరిహద్దు మార్గాలను తిరస్కరించింది. లడక్‌లోని డెమ్‌చోక్ మార్గాన్ని చేర్చాలన్న భారత అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ఈ ఒప్పందం 1962 జూన్‌లో ముగిసింది. ఆ తర్వాత కొద్ది నెలలకే అక్సాయిచిన్, మెక్‌మహాన్ లైన్ వంటి సరిహద్దు ప్రాంతాలపై వివాదాలు ముదిరి రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధానికి దారితీశాయి. దీంతో పంచశీల సూత్రాలు కాగితాలకే పరిమితమై, ఇరు దేశాల సంబంధాల్లో తీవ్రమైన అపనమ్మకానికి బీజం పడింది.

# రష్యానుంచి కొనుగోళ్లు.. ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తున్న భారత్

## 'నాఫ్టొరైనోక్' గణాంకాల జాబితా విడుదల

**క్యీవ్, ఆగస్టు 31:** ఉక్రెయిన్‌రష్యా యుద్ధం నేపథ్యం లో భారత్ వైఖరిని అమెరికా నిందిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్ పై పోరాడేందుకు అవసరమైన డబ్బును ఆ దేశానికి అందిస్తోందని అమెరికా కన్నెర్ర చేస్తోంది. అగ్రరాజ్యం ఇప్పటికే అదనపు సుంకంతో కలిపి భారత్ పై 50 శాతం సుంకాలు విధించింది. ఈ నేపథ్యంలో, అత్యంత ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. భారత్ ఒకవైపు రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తూనే, మరోవైపు అదే చమురును శుద్ధి చేసి యుద్ధంతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు అతిపెద్ద డీజిల్ సరఫరాదారుగా నిలిచింది. అమెరికాలోని కొందరు విమర్శిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థకు, సైనిక అవసరాలకు భారత ఇంధనమే



కీలకంగా మారింది. ఉక్రెయిన్‌కు చెందిన చమురు మార్కెట్ విశ్లేషణ సంస్థ 'నాఫ్టొరైనోక్' విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2025 జులై నెలలో ఉక్రెయిన్‌కు అత్యధికంగా డీజిల్ సరఫరా చేసిన దేశంగా భారత్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ నెలలో ఉక్రెయిన్ వినియోగించిన మొత్తం డీజిల్‌లో 15.5 శాతం వాటా భారత్‌దే కావడం గమనార్హం. సగటున రోజుకు 2,700 టన్నుల డీజిల్‌ను భారత్ నుంచి ఉక్రెయిన్ దిగుమతి చేసుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు ఉక్రెయిన్‌కు భారత డీజిల్ ఎగుమతులు 10.2 శాతానికి పెరిగాయి. 2024లో ఇదే కాలంలో ఇది కేవలం 1.9 శాతంగా మాత్రమే ఉంది. భారత్ నుంచి శుద్ధి చేసిన ఈ డీజిల్ రొమానియా, తుర్కియే దేశాల ద్వారా ఉక్రెయిన్‌కు చేరుతోంది. యుద్ధం కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఉక్రెయిన్ నగరాలు, రవాణా వ్యవస్థ, యుద్ధ క్షేత్రాలు నడవడానికి ఈ ఇంధన సరఫరా అత్యంత కీలకంగా మారింది. భారత్‌తో పాటు స్లొవాకియా, గ్రీస్, తుర్కియే, లిథువేనియా వంటి దేశాలు కూడా ఉక్రెయిన్‌కు ఇంధనాన్ని అందిస్తున్నాయి. అయితే, అమెరికాలోని ట్రంప్ కార్యవర్గానికి చెందిన పీటర్ నవారో వంటి కొందరు, రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. కానీ, అదే రష్యా చమురుతో నడుస్తున్న ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. గతంలో అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్, వెనిజులా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసిన భారత్, ఇప్పుడు రష్యా విషయంలో కూడా అదే పనిచేస్తే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



## నిశ్చితార్థంకోసం రమ్మని వరుడిని చితకబాదిన వధువు కుటుంబీకులు

### చికిత్సపొందుతూ వరుడు మృతి

**ముంబయి, ఆగస్టు 31:** మహారాష్ట్రలోని పూణెలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో తమ అమ్మాయిని వలలో వేసుకున్నాడనే కోపంతో ఓ కుటుంబం ఘోరానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పింప్రి చించ్వాడ్ లోని సాంఘ్వి ఏరియాకు చెందిన ఓ యువతి స్థానిక యువకుడు రమేశ్ ఘెంగాత్ ను ప్రేమించింది. ఈ విషయం తెలిసి యువతి కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. రమేశ్‌పై రేప్ కేసు నమోదైందని, పోస్కో కేసులోనూ నిందితుడని కూతురుకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా కూతురు పట్టువిడవకపోవడంతో గత్యంతరం లేక పెళ్లికి ఒప్పుకున్నారు. పెళ్లి కుదుర్చుకునేందుకు రమ్మంటూ రమేశ్ కుటుంబాన్ని ఇంటికి ఆహ్వానించారు. తల్లిదండ్రులను వెంటబెట్టుకుని వచ్చిన రమేశ్‌ను యువతి కుటుంబ సభ్యులు నిలదీశారు. ప్రేమ పేరుతో తమ కూతురును వలలో వేసుకున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తులైన యువతి కుటుంబ సభ్యులు రమేశ్‌ను గదిలోకి లాక్కెళ్లి చితకబాదారు. తీవ్ర గాయాలతో రమేశ్ స్పృహ తప్పడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ రమేశ్ మరణించాడు. రమేశ్ తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి కుటుంబ సభ్యులు 9 మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారికోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## యుపిఎస్‌సి మెరిట్ అభ్యర్థులకోసం 'ప్రతిభాసేతు' పోర్టల్

### మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** మెరిట్ జాబితాలో అవకాశం పొందలేకపోయిన ప్రతిభావంతుల కోసం కేంద్ర ప్రభుత్వం 'ప్రతిభా సేతు' పోర్టల్ ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోడీ వెల్లడించారు. వేలాది మంది సివిల్స్ ఆశావహ అభ్యర్థుల ప్రతిభకు ఇదొక వారధి లాంటిదని ప్రశంసించారు. యుపిఎస్‌సిలో ప్రిలిమ్స్, మెయిన్స్ అన్నీ క్లియర్ చేసినప్పటికీ తుది జాబితాలో అవకాశం చేజార్చుకున్న వారికి రెండవ ఛాన్స్ ఇచ్చేందుకు ఈ టాలెంటెడ్ పోర్టల్ ఉపకరిస్తుందని సివిల్స్ అభ్యర్థులకు ఇదొక ఆశాకిరణమని ఆయన అభివర్ణించారు. 125వ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యూపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ ఈ కీలక ప్రకటన చేశారు. దేశంలో అత్యంత కఠినమైన పరీక్షలలో ఒకటైన సివిల్ సర్వీసెస్ పరీక్షను యూపీఎస్సీ (యుపిఎస్‌సి) నిర్వహిస్తుంది. ఎంత ప్రతిభాపాటవాలు ఉన్నప్పటికీ పరిమిత అవకాశాల కారణంగా ఏటా వేలాది మంది అభ్యర్థులు తుది జాబితాలో చోటు సాధించలేక పోతున్నారు. ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు విలువైన సమయం, శ్రమ, డబ్బు వెచ్చిస్తారు. ఏళ్ల తరబడి కఠినంగా శ్రమించి విజయపు




టంచులకు చేరినప్పటికీ చివరి క్షణాల్లో ఎందరో ప్రతిభావంతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వం ఒక డిజిటల్ ప్లాట్‌ఫామ్ తీసుకొచ్చింది. అదే 'ప్రతిభా సేతు'. మన్ కీ బాత్ 125వ ఎడిషన్‌లో ప ప్రతిభా సేతు గురించి ప్రస్తావించారు. ఇందులో యూపీఎస్సీలో వివిధ పరీక్షల్లో అన్ని దశల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల డేటాను సేవ్ చేస్తుంది. అర్హత గల అభ్యర్థుల వివరాలను ప్రతిభా సేతు పోర్టల్‌లో నమోదు చేస్తారు. తుది మెరిట్ జాబితాలో చోటు సంపాదించలేని వారి వివరాలను ప్రైవేట్ కంపెనీలకు అందుబాటులో ఉంచుతుంది. ఈ పోర్టల్ లోని సమాచారం ఆధారంగా కార్పొరేట్ కంపెనీలు భారీ జీతాలు ఇచ్చి సివిల్స్ అభ్యర్థులకు కొలువు ఆఫర్ చేస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు.

# సంక్షిప్తంగా..

## ఎంపి మహువా మొయిత్రాపై కేసు నమోదు

**నయారాయ్‌పూర్, ఆగస్టు 31:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పై కేసు నమోదు చేశారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించడంలో విఫలమయ్యారంటూ అమిత్‌షా పై మహువా మొయిత్రా ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యల నేపథ్యంలో మహువాపై కేసు నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు రాయ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఎంపీ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, రాజ్యాంగ విరుద్ధమని ఆ నాయ కుడు పేర్కొన్నాడు. 1971 సమయంలో రాయ్‌పూర్ లోని మానా క్యాంప్ ప్రాంతంలో అనేక మంది బంగ్లాదేశీ శరణార్థులు స్థిరపడ్డారని, మహువా వ్యాఖ్యలు వారిలో భయాందోళనలు రేకెత్తించాయని తెలిపాడు. అంతకుముందు పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ కొత్వాలీ పోలీస్ స్టేషన్‌లోనూ ఆమెపై ఫిర్యాదు దాఖలైంది.

## టేకాఫ్.. అంతలోనే తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఇండోర్ కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగి వచ్చింది. విమానం కుడి ఇంజిన్‌లో మంటలు రేగినట్లు సూచన అందుకున్న పైలట్ ఆ విమానాన్ని వెంటనే ఢిల్లీకి మళ్లించినట్లు ఎయిరిండియా తెలిపింది. ఢిల్లీకి తిరిగొచ్చిన విమానాన్ని తనిఖీల కోసం నిలిపివేశామని అధికారులు చెప్పారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో ఇండోర్‌కు తరలించామని ఎయిరిండియా అధికారులు తెలిపారు. ఆగస్టు 31న




ఢిల్లీ నుంచి ఇండోర్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగొచ్చింది. కాక్‌పిట్ సిబ్బందికి ఇంజిన్‌లో మంటలు వస్తున్నట్లు సూచన అందింది. ప్రామాణిక విధానాన్ని అనుసరించి, కాక్‌పిట్ సిబ్బంది ఇంజిన్‌ను ఆపేయాలని నిర్ణయించుకుని ఢిల్లీకి తిరిగొచ్చారు.

## విమానం గాల్లో ఉండగా టాయిలెట్లలో సమస్య..

**కాన్‌బెర్రా, ఆగస్టు 31:** బాలి నుంచి బ్రిస్బేన్‌కు వెళ్తున్న విమానంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్లతో సమస్య తలెత్తడంతో ప్రయాణికులకు నీళ్ల బాటిళ్లలో మూత్ర విసర్జన చేయాల్సి వచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంతర్జాతీయ మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. వర్జిన్ ఆస్ట్రేలియా బోయింగ్ (737 మాక్స్ 8) విమానం గురువారం మధ్యాహ్నం బాలిలోని డెన్‌పసర్ విమానాశ్రయం నుంచి బ్రిస్బేన్‌కు బయల్దేరింది. టేకాఫ్ తర్వాత అందులోని పలు టాయిలెట్లలో సమస్య ఉండడాన్ని సిబ్బంది గుర్తించారు. మొత్తం ఆరు గంటలు కాగా




మొదటి మూడు గంటలు ప్రయాణికులు ఒక్క బాత్రూమ్‌నే వినియోగించుకున్నారు. మూడు గంటల తర్వాత అందులో కూడా సమస్య తలెత్తడంతో నీళ్ల బాటిళ్లలో మూత్ర విసర్జన చేయాలని విమానసిబ్బంది ప్రయాణికులకు సూచించారు. దీంతో ప్రయాణికులు విమాన సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎయిర్‌ఫోర్స్‌కు రెండు తేజాస్ జెట్ విమానాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** తేజస్ యుద్ధ విమానాల డెలివరీలో జాప్యం జరుగుతోందంటూ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సెప్టెంబర్ నెలాఖరు కల్లా రెండు తేజస్ ఎమ్‌కే1ఏ యుద్ధ విమానాలను హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఎయిర్‌ఫోర్స్‌కు అందజేయనుంది. ఈ విషయాన్ని డిఫెన్స్ సెక్రెటరీ ఆర్‌కే సింగ్ వెల్లడించారు. ఆ తరువాత మరో 97 తేజస్



యుద్ధ విమానాల డెలివరీకి ఎయిర్ ఫోర్స్‌తో హెచ్‌ఏఎల్ ఒప్పందం కుదుర్చుకుం టుందని కూడా తెలిపారు. పూర్తి స్థాయి వెపన్స్ (ఆయుధాలు) ఇంటెగ్రేషన్‌తో ఈ రెండు తేజస్ యుద్ధ విమానాలు డెలివరీ అవ్వొచ్చని అన్నారు. ఇప్పటికే హెచ్‌ఏఎల్, ఎయిర్‌ఫోర్స్ మధ్య యుద్ధ విమానాల డెలివరీకి ఒప్పందం ఉంది. అయితే, విమానాల తయారీలో జాప్యంపై ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# 4 బిల్లులకు అసెంబ్లీ పచ్చజెండా

## మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణల బిల్లులకు ఆమోదం

### అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లులకు ఆమోదం

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఆదివారం రెండోరోజు సమావేశమైన శాసనసభ నాలుగు బిల్లులను ఆమోదించింది. నాలుగు బిల్లులను ప్రవేశ పెట్టిన ప్రభుత్వం వాటిని ఆమోదింప చేసుకుంది. 4 బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు, అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్ మెంట్స్ బిల్లుకు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లుకు, ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశముంది. తొలుత మున్సిపల్ చట్టసవరణ బిల్లు, ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టి చర్చించి.. అనంతరం ఆ బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

# దుష్ట రాజకీయాలు చేస్తోన్న కాంగ్రెస్

### మోడీని రాజకీయంగా ఎదుర్కొనలేక

### ఆయన మాతృమూర్తిపై దూషణకు దిగిన కాంగ్రెస్

### అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి మహిళా నేతల ధర్నా

### బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై కాంగ్రెస్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నీచ ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రాహుల్ గాంధీ వెంటనే ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని, భారతీయ జనతా పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పార్టీ దారుణ స్థాయికి దిగజారిందన్నారు. ప్రధాని మోడీ కన్న తల్లిపై అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తమ అసలైన స్వభావాన్ని బయటపెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌లో రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార యాత్ర సభలో, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు మోడీ తల్లిపై దుర్భాషలాడడం దేశ ప్రజల మనసును కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతగల ప్రతిపక్ష నాయకుడిగా ఉండి రాహుల్ గాంధీ మౌనంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. మోడీని ఎదుర్కొనే ధైర్యం లేక, ఆయన కుటుంబాన్ని, మాతృమూర్తిని దూషించడం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకుల బలహీనతను చూపిస్తున్నదని అన్నారు. ఓటు చోరీ యాత్ర కాదు – భారత్ ఇజ్జత్ చోరీ యాత్ర అన్నారు. మొన్న మహిళలపై దూషణలు చేస్తే, ఇప్పుడు మోడీ మాతృమూర్తిని అవమానపరిచారు.

బీహార్ ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతో, కాంగ్రెస్ పార్టీ పిచ్చి వ్యాఖ్యలకు దిగుతుందని, చరిత్రలో గజని మహ్మద్ 17 సార్లు దండయాత్ర చేసినట్లే.. రాహుల్ గాంధీ యాత్రల పేరుతో మహిళల దూషణల దండయాత్ర చేస్తూ తిరుగుతున్నాడన్నారు. ఒక కాంగ్రెస్ నాయకుడు మోడీ తండ్రి గురించి తిట్టాడు.. మరొకరు తల్లి గురించి దూషించాడు.. ఇంకొకరు భారత్ మాతపై అవమానకర వ్యాఖ్యలు చేశారు.. మరొక కాంగ్రెస్ ముఖ్యమంత్రి గిరిజన మహిళల చర్మరంగంపై దుర్భాషలాడాడు. అంటే.. రాహుల్ గాంధీ రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు, ఎంపి నుండి కార్యకర్త వరకు, సోనియా గాంధీ నుంచి మహిళా ఎంపిల వరకు మహిళలను కించపరచడం కాంగ్రెస్ పార్టీ సంప్రదాయంగా మారిందని అన్నారు.

అందుకే గల్లీ నుండి ఢిల్లీ దాకా – గలీజ్ గాళ్లకు అడ్డా కాంగ్రెస్.. ఇండీ కచరా కూటమి అని ప్రజలు చెబుతున్నారన్నారు. ఇటలీ పుత్రుడైన రాహుల్ గాంధీకి తల్లి మాతృభావం, భారత మాత గొప్పదనం అర్థం కాదని, రాహుల్ గాంధీ ప్రజల ముందు క్షమాపణ చెప్పకపోతే దేశ వ్యాప్తంగా మహిళల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. మహిళా శక్తిని అవమానించే కాంగ్రెస్‌కు దేశ ప్రజల తీర్పుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు.



బిసిల యుద్ధభేరి సభలో ఐక్యత చాటుతున్న ఆర్.కృష్ణయ్య, మధుసూదనాచారి, నారాయణ, బండారు దత్తాత్రేయ తదితరులు

# బిసి బిల్లును ఎవరైనా వ్యతిరేకిస్తే రాజకీయ సమాధి

### 50 శాతం రిజర్వేషన్లు సాధించేదాకా ఉద్యమిస్తాం

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 31, ప్రభాతవార్త:** బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ అసెంబ్లీలో తీసుకువచ్చిన బిల్లును ఎవరైనా వ్యతిరేకిస్తే సహించేది లేదని, రాజకీయ సమాధి చేస్తామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు సాధించిన స్ఫూర్తి తోనే చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు సాధించేవరకు ఉద్యమిస్తామని, ఇదే చివరి పోరాటమన్నారు.

జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ అధ్యక్షతన ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'బిసిల యుద్ధభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కోర్టుకు ఏవరు వెళ్ళరాదని, ఏవరైన వెళితే పోరాడి విజయం సాధిస్తామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వేలాది హాస్టల్స్, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాలను సాధించడం జరిగిందని, ఈ పథకాలన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుక రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్ని స్తున్నదని, ఎత్తివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి మాట్లాడుతూ దోపిడి, అన్యాయం, అణిచివేతకు గురైన బిసిలు రాజ్యాధికారం సాధించాలని, ఇది సాధ్యం కావాలంటే బిసిలంతా ఐక్యంగా ఉండి బిసిలకే ఓట్లు వేయాలని సూచించారు. ఈ సభలో బిసి నేతలు కోలా జనార్దన్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, పి.సుధాకర్, భరత్‌గౌడ్, శ్రావణి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాల్టీల్లో ఫాగింగ్‌కు డబ్బులు లేవు

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మున్సిపాల్టీలలో నిధుల లేమితో రోజువారీ ఖర్చులు కూడా నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నాయని మున్సిపాల్టీలు చేయడం కాదు వాటికి నిధులు సిబ్బంది కూడా సమకూర్చాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి వద్దనే మున్సిపాలిటీ శాఖ ఉంది. ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు అయిందికానీ వాటికి మౌలిక వసతుల కల్పనలో వెనక్కి నెట్టివేశారని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండే మున్సిపాల్టీలకు నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీలు ఎన్ని ఏర్పాటు చేశామన్నది ముఖ్యం కాదు, ఎంత మేర కు అభివృద్ధి చేశాం అన్నది ముఖ్యం అని ఆయన అన్నారు నిధులు ఇస్తున్నారా లేదా? అనేది ఆలో చించాలి. ఫాగింగ్‌కు కూడా డబ్బులు లేని పరిస్థితి. బిఆర్ఎస్ హయాంలో నెల నెల పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీలకు డబ్బులు ఇచ్చాం. ఈ ప్రభుత్వం వచ్చాక నిధులు ఇవ్వలేదు. ఎన్నికలు జరగలేదని ఫైనాన్స్ కమిషన్ డబ్బులు ఇవ్వడం లేదు అని హరీశ్‌రావు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పేదల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తుంది రక్తమాంసాలు పీలుస్తుంది అంటూ ఊదరగొట్టి కాంగ్రెస్ వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తాం నో ఎల్ఆర్ఎస్ నో బిఆర్ఎస్ అన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇవాళ్నేమో బరాబర్ పైసలు కట్టాలని వసూలు చేస్తున్నారు. మరి అదే ప్రజలు నో ఎల్ఆర్ఎస్ నో కాంగ్రెస్ అనే పరిస్థితి వస్తుంది. ఎల్ఆర్ఎస్ జీవో తెచ్చాం.. ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన డబ్బుల్లో కొంత మేర ఆ మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించడం జరుగు తుందని జీవోలో చెప్పాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వసూలు చేసిన ఎల్ఆర్ఎస్ డబ్బులను మున్సిపాలిటీలకు ఎప్పటి వరకు అందజేస్తారో చెప్పాలి. వచ్చిన డబ్బు ఎంతనో చెప్పాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పట్టణ ప్రగతి కింద నిధులు ఇవ్వలేదు.. ఫైనాన్స్ కమిషన్ నుంచి డబ్బులు రావడం లేదు. ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి డబ్బులు ఇవ్వడం లేదు. రాష్ట్ర నుంచి నయా పైసా లేదు. మరి ఎలా కొనసాగాలి మున్సిపాలిటీలు. ప్రజలు కట్టిన డబ్బును ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చే డబ్బులను కూడా ఇవ్వడం లేదు. మరి మున్సిపాలిటీలు ఎలా నడవాలి..? పరిస్థితి ఏంటి అనేది ఆలోచించాలి. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లేరు. కొత్త మున్సిపాలిటీలకు అనుగుణంగా పోస్టులు మంజూరు చేయండి. ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్‌కు ఎస్డీఎఫ్ కింద రూ. 50 కోట్లు మంజూరు చేశారు. ఆ డబ్బులన్నీ మీరు రద్దు చేశారు. ఇదేం పద్ధతి అని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.



ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం వద్ద సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించిన గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ

# సండేస్ అండ్ సైక్లింగ్ విస్తృతం చేయాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** పర్యావరణహితానికి, పచ్చని జీవనశైలికి సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తుందని, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సైక్లింగ్‌ను తెలంగాణలో విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని గవర్నర్ విష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద జరిగిన ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం విస్తృతంగా చేపట్టిన సండేస్ ఆన్ సైక్లింగ్ అనే కార్యక్రమాన్ని జాతీయ ఫిట్‌నెస్ ఉద్యమంలా తెలంగాణలో నిర్వహించాలన్నారు. ఫిట్నెస్‌కి డోస్ అరగంట రోజ్ అన్న నినాదాన్ని విద్యార్థుల్లో యువకుల్లో ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థలు వివిధ వర్గాల ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. క్రీడా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనడం వల్ల సామాజిక బంధాలను బలపరుస్తాయన్నారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జాతీయ క్రీడా దినోత్సవం తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించి, దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడిందని అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించే కార్యక్రమాలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని, సైక్లింగ్ క్రీడను మరింతగా ప్రోత్సహించే కార్యక్రమాలు విస్తృతస్థాయిలో చేపడతామని అన్నారు.

# మంత్రిమండలిలో 42శాతం కోటా అమలు పరచండి

### బిఆర్ఎస్ అంటే బహుజన రాష్ట్ర సమితి

### కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాష్ట్రప్రభుత్వస్థాయిలో బిసిలకు సామాజిక ఆర్థిక అభివృద్ధికోసం 42శాతం కోటాలో చేయాల్సిన రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యంగా మంత్రి మండలిలో, కార్పొరేషన్ చైర్మన్ వంటి పదవుల పందేరంలో వెనుకబడిన కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. ఔశాసనసభలో బిసి బిల్లుపై చర్చ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు రావాలని మా పార్టీ కూడా కోరుకుంటుంది.18 జీవో తర్వాత హైకోర్టు ఏం చేసిందంటే, ఇందిరా సహాని ప్రకారం కమిషన్ వేయమని చెప్పింది. ఆ తర్వాత 46 జీవో తీసుకొచ్చింది. నేను బీఆర్ఎస్ పార్టీ తరపున మాట్లాడుతున్నా సూచనను విమర్శగా భావించకండి.బిఆర్ఎస్ అంటే అంటే భారత రాష్ట్ర సమితి కాదుబహుజన రాష్ట్ర సమితి అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కొత్తగా నిర్వచనం ఇస్తూ మా సూచనను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వంను కోరారు

. బీహార్‌లో బిసి రిజర్వేషన్లు ఫెయిల్ అయినట్టు కావొద్దు అని అంటున్నాను. నిజంగా బిసి లపై చిత్తశుద్ధి ఉంటే కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ 1992 కింద మాత్రమే డెడికేటెడ్ కమిషన్ వేయాలి అని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.బిసి బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందంటున్నారు. షెడ్యూల్ 9లో బీసీ రిజర్వేషన్లు చేర్చాలి. కాబట్టి సవరణ చేయాలి. అలా చేయకపోతే కోర్టుల్లో ఈ బిల్లు నిలబడదు.

బీహార్, మధ్యప్రదేశ్‌లో కొట్టేశారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయితేనే 42 శాతం రిజర్వేషన్లకు ప్రొటెక్షన్ లభిస్తుంది. బిసిల మీద చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రకారం చేయండి. భూసాని వెంకటేశ్వర్ రిపోర్టును టేబుల్ చేయండి. బిసిలకు అన్యాయం జరగొద్దని శాస్త్రీయంగా చేయాలని కోరుతున్నా ను అని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ఏమైంది? ఇది సీఎం చేతు ల్లోనే ఉంది. 42 శాతం మంత్రి వర్గంలో కల్పి స్తామన్నారు. మంత్రివర్గంలో వెనుకబడిన తరగతులకు అవకాశం కల్పిస్తే మేం సంతోషపడు తామని ఆయన అన్నారు

ప్రతి ఏడాది కూడా 20 వేల కోట్లు బిసిలకు బడ్జెట్ పెడుతామన్నారు. ఇప్పటివరకు 20 నెలలు కావొస్తున్నా 20 పైసలు కూడా ఖర్చు పెట్టలేదు. దీనికి చట్టం అవసరం లేదు సిఎం తలచుకుంటే క్షణాల్లో అయిపోతది. ఎంబిసి కులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెడుతా మన్నారు.. ఇవ్వండి. తెలంగాణలో ఏ వర్కు బిసి లకు ఇవ్వలేదు. బిసిల ఓట్లు గంపగుత్తగా ఓట్లు వేసుకుని అధికారంలోకి వచ్చారు అని గంగుల కమలాకర్ మండిపడ్డారు.

# ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం మా కర్తవ్యం, బాధ్యత

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, భారతీయ జనతా పార్టీకి చెందిన తెలంగాణ రాష్ట్రంలోని ఆరుగురు ఎంపిలు, ఇద్దరు కేంద్రమంత్రులు తమ ఎంపి నిధుల నుంచి ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున కేటాయించడం ద్వారా ప్రజల పక్షాన నిలబడ్డారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల సమస్యలపై నిరక్ష [illegible] ్యం చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిన సందర్భంలో, బిజెపి ఎంపిలు తక్షణమే ముందుకు వచ్చి సహాయక చర్యల కోసం నిధులను కేటాయించడం గమనార్హ అని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి సహకారం అందించిన బిజెపి ఎంపిలు, కేంద్రమంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడల్లా బిజెపి ముందుండి తోడ్పడుతుంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ ప్రజా హితం కోసం పనిచేస్తుంది. ప్రజల పక్షాన నిలబడేది బిజెపి మాత్రమే అన్నది మరోసారి రుజువైందన్నారు. ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం, సహాయక చర్యల్లో పాల్గొనడం భారతీయ జనతా పార్టీ కర్తవ్యబాధ్యత అని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం మా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

# బిసి వర్గాల జీవితాల్లో వెలుగు నింపేందుకే 42 శాతం రిజర్వేషన్లు

### బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** అసెంబ్లీలో రిజర్వేషన్ల కాప్ ఎత్తివేస్తూ బీసీ లకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లు ఆమో దించిన నేపథ్యంలో మంత్రివర్గానికి తమ హర్షామోదాలు తెలుపుతూ, జిల్లా కేంద్రాలలో పెద్దఎత్తున సంబరాలు చేసుకోవాలని, బీసీ సమాజానికి కోరు తున్నట్లు బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. గత ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని సీలింగ్ చేస్తూ చేసిన కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌లు అమలు చేసేం దుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో, మంత్రివర్గానికి, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గేకు లోకసభ ప్రధానప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి, సిఎం రేవంత్‌రెడ్డికి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, ఎఐసిసి రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి [illegible] నటరాజ్‌కు, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ, అన్ని జిల్లాలవ్యాప్తంగా బాణాసంచాకాల్చి స్వీట్స్ పంచి సంబరాలుచేసి పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటుచేసి ఈ చారిత్రక ఘట్టాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నూతి శ్రీకాంత్‌గౌడ్ కోరారు.

# అమలుకాని ప్రధానమంత్రి ఫసల్ బీమా.. రైతులకు శాపం

### బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఫసల్ బీమా (పంటల బీమా)యోజనను తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అమలు చేయకపోవడమే రైతులకు శాపంగా మారిందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. భారీ వర్షాలతో తీవ్రంగా రైతాంగం నష్టపోయిన కామారెడ్డి జిల్లాలో బిజెపి కిసాన్ మోర్చా, స్థానిక బిజెపి జిల్లా నాయకులతో కలిసి భిక్కనూరు మండలం రామేశ్వరపల్లి అంతంపల్లి లక్ష్మీ ్మదేవి పల్లిలో పర్యటించారు. వాగు ఉధృతికి ముంపుకు గురైన పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఇంతవరకు వ్యవసాయ శాఖ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ నష్టాన్ని నమోదు చేయడానికి రాకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

కొందరు రైతులు పొలాల్లో పూర్తిగా ఇసుక మేటలు వేసి సాగుకు పనికి రాకుండా పోయిందని శ్రీధర్ రెడ్డి సమక్షంలో కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అత్యంత నిరక్ష [illegible] ్యంగా వ్యవహరిస్తున్నదని గతంలో అనేక సందర్భాలలో కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తెలంగాణలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని అయినప్పటికీ నిరక్ష [illegible] ్యంగా వ్యవహరించి నాటి కెసిఆర్ లాగానే రేవంత్ ప్రభుత్వం ప్రధానమంత్రి పంటల బీమా యోజనను తెలంగాణలో అమలు చేయకపోవడం రైతులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంటల బీమా యోజన అమలులో ఉంటే రైతు సహాయం కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీ నుండి పరిహారం పొందే అవకాశం ఉండేదన్నారు. ఈ పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ధ్వజమెత్తారు. వెంటనే యుద్ధ ప్రాతిపదిక మీద రైతులకు జరిగిన నష్టాన్ని రెవెన్యూ వ్యవసాయ అధికారులతో నమోదు చేయించి ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పొలాలలో ఇసుకమేట వేసిన నేపథ్యంలో వెంటనే ఇసుకమేటను తొలగించడానికి రైతులకు సహాయ కార్యక్రమాలను ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు నీలం రాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలతో వరదలతో రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోయిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు రాజకీయ ప్రకటనలకు పరిమితం కాకుండా రైతులను ఆదుకోవడానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసి కామారెడ్డికు స్పెషల్ ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్య గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి భాస్కర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు రమేష్ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జయపాల్ రెడ్డి జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి రాజు రవీందర్ గంగారెడ్డి పిచ్చయ్య లింగారెడ్డి సుధాకర్ రెడ్డి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# తూతూమంత్రంగా అసెంబ్లీ సమావేశాలు

### బిసిల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానందగౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** తూతూ మంత్రంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీ సమావేశాలను పక్కనపెట్టి సీఎం కేరళ పర్యటనకు వెళ్లడం.. వారికి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుందన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడి యా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఏబిల్లులు పెడతారో స్పష్టత ఇవ్వలేదని రాష్ట్రంలో వరదలతో, యూరియా కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.అసెంబ్లీ సమావేశాలను పట్టించుకోకుండా పుస్తక ఆవిష్కరణ కోసం ఫ్లైట్ బుక్ చేసుకొని మరి సీఎం కేరళకు వెళ్లారు అని మండిపడ్డారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వరద కారణంగా ఇబ్బంది పడుతున్నారని రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో మేమంతా అసెంబ్లీకి వచ్చామన్నారు. రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో హై కమాండ్‌కు భజన చేయడం, కుర్చీ కాపాడుకోవడం తప్పా రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. రాజకీయ కక్షతో పీసీ ఘోష్ రిపోర్ట్‌పై చర్చ పెట్టారని పీసీ ఘోష్ కమిషన్ కేవలం కాంగ్రెస్ కమిషన్ మాత్రమే అన్నారు. ఇంకా కొన్ని రోజులు సభ నడ పాలని డిమాండ్ చేస్తుంటే పట్టించుకోవడం లేదని యూరియాపై చర్చ చేద్దామంటే స్పందన లేదని వివేకానంద పేర్కొన్నారు.

### కాళేశ్వరంపై కెసిఆర్ లక్ష కోట్లు దోచుకున్నాడు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కామ ధేనువుగా వాడుకుని 30 వేల కోట్ల బడ్జెట్ తో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి లక్ష కోట్లు దోచుకున్నారని ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శిం చారు. ఈ మేరకు మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ అవినీతి అక్రమాలతో తెలంగాణ ఆత్మగౌరవం ఎప్పుడో పోయిందన్నారు. కోర్టులో లంచు మోషన్ పిటిషన్ వేసి కాళేశ్వరంపై చర్చ జరగకుండా చేసే ప్రయత్నం చేశారని కమీషన్‌ను కూడా తప్పు పడుతు న్నారన్నారు. యూరియా కొరతపై కావాలనే రచ్చ చేస్తున్నారని తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉంటే కేంద్రం అందుకు తగ్గట్టు ఇవ్వడం లేదన్నారు.

### కాళేశ్వరం భయంతోనే యూరియా నినాదం : కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై భయంతో బిఆర్ఎస్ యూరియా నినాదం ఎత్తుకుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఈమేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఇద్దరు ముగ్గురు కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షలకోట్లు దోచుకుని తిన్నారన్నారు. ప్రాజెక్టు ఎస్టిమేషన్ ఎం? ఎంత వరకు తీసుకెళ్లారు. అనే విషయం వాస్తవాలు ప్రజలకు తెలువాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ కు చెందిన బాలు నాయక్ అనే రైతుకు యూరియా వచ్చినప్పటికీ బి.ఆర్.ఎస్ దొంగలు కావాలని రైతుతో పత్తిని చేను నుండి తీయించి ధర్నా చేయించారని మండిపడ్డారు.

### వరద బాధిత రైతులను ఆదుకోవాలి

### బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఇటీవల కురిసిన వరదల కారణంగా రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్,మెదక్ జిల్లా లో రైతులకు వేలకోట్ల రూపాయల పంట నష్టం జరిగింది వేల ఇండ్లు నీట మునిగి 10 నుండి 15 మంది చనిపోవడం జరిగింది బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈమేరకు ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 70 నుండి 80 శాతం పంట పై పెట్టుబడి పెట్టిన రైతు పంట నీట మునిగిందన్నారు. కావున ప్రభుత్వం దగ్గరనుండి రైతుకు భరోసా ఇచ్చేటట్లు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. శాసన సభ సమావేశాల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్య అతివృష్టి వల్ల రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయమని చెప్పామని ఆ పథకం తెస్తే రైతు భరోసాగా ఉంటాడన్నారు. బడ్జెట్లో 3000 కోట్లు పెట్టి చివరికి మూడు రూపాయిలు కూడా పంట బీమా ఇవ్వలేదుని మండిపడ్డారు. పంట బీమా లేని కారణంగా ప్రకృతి నష్టానికి రైతు నష్టపోయాడని పత్తికి ఎకరాకు 50 వేలు, సోయాబీన్‌కు 40వేలు, వరి పంటకు ఎకరాకు 30 వేల నష్టపరిహారం, కందులకు 40 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ శాసనసభ సమావేశాల్లోనే ప్రభుత్వం రైతు బీమా ప్రకటించాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో నష్టపోయిన రైతుల పక్షాన ఆందోళన చేస్తామని పాయల్‌శంకర్ పేర్కొన్నారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

### గోదావరి పరీవాహకాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయ్ : బిజెపి ఎమ్మెల్యేలు, రామారావుపటేల్, పాల్వాయి హరీశ్, సూర్యనారాయణ

గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరదల వల్ల పంటల తీవ్రంగా దెబ్బ తిన్నాయని సోయా, పత్తి, వరి పంటలు



దెబ్బతిన్నాయని వెంటనే రైతులకి నష్టపరిహారం ఇవ్వాలని బిజెపి ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీష్, దన్‌పాల్ సూర్యనారాయణలు డిమాండ్ చేశారు. మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ రైతేరాజు అంటారు. ఇప్పుడు రైతును పట్టించుకోవడం లేదన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో తీవ్రంగానష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బిసి రిజర్వేషన్‌లకి బీజేపీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకిస్తుందన్నారు. 42 రిజర్వేషన్ బీసీ లకు మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 శాతం ముస్లిం లకి ఇస్తే వక్ బోర్డ్ ఆస్తులు హిందువులకి ఇస్తారా..అని ప్రశ్నించారు. కెసిఆర్ గతంలో పోడు రైతులని ఇబ్బందిపెట్టి.. శంకరగిరిమాన్యాలకి పోయిండని..కాంగ్రెస్‌కి అదే గతి పడుతుందని పేర్కొన్నారు.

# సభకు సమర్పించిన కాళేశ్వరం నివేదిక

>> కమిషన్ నివేదికను శాసనసభలో ఆదివారం సాయంత్రం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేబినెట్ అనుమతి లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్ ప్రభుత్వం ముందుకు వెళ్లిందని తెలిపారు. కాళేశ్వరం పూర్తి చేయడానికి రూ.లక్షా 27 వేల కోట్లు అవసరమని పేర్కొన్నారు. లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్ష ఎకరాల కొత్త ఆయకట్టుకు కూడా నీరు ఇవ్వలేదని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.87,449 కోట్ల ఖర్చు అయిందని తెలిపారు. నిరుపయోగంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ఉన్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయలాంటి మేడిగడ్డ కూలిందని వివరించారు. 20 నెలల నుంచి ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. అతిపెద్ద ప్రాజెక్టుగా కాళేశ్వరం పనులను కెసిఆర్ ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తుచేశారు. తెలంగాణకు ఇది చాలా బాధాకరమైన రోజు అని అభిప్రాయపడ్డారు. ప్రాణహిత చేవెళ్ల కట్టాలని 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ప్రాణహిత చేవెళ్లపై 2014 నాటికే రూ.11,600 కోట్లను అప్పటి ప్రభుత్వం ఖర్చు చేసిందని స్పష్టం చేశారు. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టు సరికాదని నాటి ప్రభుత్వ కమిటీ చెప్పిందని వివరించారు. వాప్కోస్ రిపోర్టు రావడానికి ముందే మేడిగడ్డ బ్యారేజ్‌ను కట్టాలని కెసిఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అయితే సాంకేతిక అంశాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. డ్యామ్‌కు, బ్యారేజ్‌కు తేడా లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేశారని ఎన్‌డిఎస్ఎ నివేదికలో ఉందని విమర్శించారు. ఎనబై ఏడు వేల కోట్లు ఖర్చు చేసినా గత బిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఎకరాలకు సైతం నీళ్లు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతింది. కట్టిన తరువాత తక్కువ కాలానికే బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. బ్యారేజ్‌లకు జరిగిన నష్టం రాష్ట్ర ప్రజలకు పెనుభారంగా మారింది. ప్రజా ధనం వృథా అయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. 2004 నుంచి 2014 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి స్కీమ్, మహాత్మ జ్యోతిబాపులే దుమ్ముగూడెం, నెహ్రూ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, జె చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం లాంటి ప్రాజెక్టులు కాంగ్రెస్ చేపట్టింది. కానీ బీఆర్ఎస్ హయాంలో కట్టిన మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలని డీపీఆర్ లో లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వ్యాప్కోస్ రిపోర్ట్ రాకముందే మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం నిర్ణయం తీసుకున్నారు. డీపీఆర్ 17 జనవరి 2016న ఇచ్చింది. అదేరోజు అప్పటి సీఎం కేసీఆర్ మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టేందుకు అంచనాలు వేయాలని అధికారులను ఆదేశించారు. డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా కాళేశ్వరం నిర్మాణం చేసి లక్ష కోట్లు వృథా చేశారని పేర్కొన్నారు. ప్రాణహిత ఖర్చు రూ.38 వేల కోట్లు, కాళేశ్వరం మొత్తం ఖర్చు లక్ష కోట్లపైమాటే. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు రూ.38,500 కోట్లు అంచనా అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను 80 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు పనులు మొదలుపెట్టింది. ఇప్పుడు రిపోర్ట్ ప్రకారం 2022లో కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు రూ.1 లక్షా 27 వేల కోట్లు. ఆ తరువాత కాళేశ్వరం ఖర్చు రూ.1 లక్షా 47 వేల కోట్లు అవుతాయని స్పష్టమవుతోంది. రూ.38 వేల కెట్లతో ముగిసిపోవాల్సిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ఏకంగా రూ.1 లక్షా 47 వేల కోట్లకు తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. మేడిగడ్డలో 6 పిల్లర్లు కుంగిపోయాయి. ఆ మూడు బ్యారేజీలతో 2019 నుంచి 2023 వరకు 162 టీఎంసీల నీళ్లు మాత్రమే ఎత్తిపోశారు. ఏడాదికి 20 టీఎంసీలే లిఫ్ట్ చేశారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు నీళ్లు అందలేదన్నారు. ఏడాదికి 190 టిఎంసిలు ఎత్తిపోస్తామని చెప్పి నాలుగైదేళ్లు కలిపి 162 టిఎంసిలు మాత్రమే లిఫ్ట్ చేశారు. ఇందులో 32 టిఎంసిలు సముద్రంలోకి వృథాగా వదిలారు. అంటే లిఫ్ట్ చేసింది 130 టిఎంసిలు. 10 శాతం ఎవాపరేషన్ లాస్ తీసివేస్తే నెట్ వాటర్ 114 టిఎంసిలు మాత్రమే. ఇందులో 13 టిఎంసిలు కొండపోచమ్మ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్లో స్టోరేజీ ఉన్నాయి. తెలంగాణ ప్రజలకు ఉపయోగపడింది 101 టిఎంసిలు. ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే రైతులకు వినియోగంలోకి వచ్చాయి. 38 వేల కోట్ల ప్రాణహితను పక్కనపెట్టి 1 లక్షా 47 వేల కోట్లకు ఖర్చుకు కాళేశ్వరాన్ని చేపట్టారని మంత్రి ఉత్తమ్‌కుమార్ ఆరోపించారు.

# సిబిఐకి కాళేశ్వరం కేసు

>> దికపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై ఆదివారం అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ జరిగింది. చర్చలో మంత్రులు, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం, సిపిఐ, కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చపై ముగింపుగా మాట్లాడారు. కమిషన్ రిపోర్ట్‌పై సుదీర్ఘంగా చర్చ జరిగింది. చర్చలో చాలా అంశాలను నివేదికలోని అంశాలతోపాటు ఇతర అంశాలను తెలిపారు. మొదటిలోక్‌పాల్‌గా పిసి ఘోష్ పనిచేశారు. కమిషన్ రిపోర్టులోని అంశాలపై కాకుండా జస్టిస్ పిసి ఘోష్‌ను అవమానించేవిధంగా మాట్లాడకూడదు. అయినప్పటికీ సభ్యులు అలా మాట్లాడారు. దానిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. నీటి చుట్టే మనిషి జీవన చక్రం ముడిపడింది. 12వ శతాబ్దంలో కాకతీయులు అద్భుతంగా పాలించారు. గొలుసుకట్టు చెరువులను నిర్మించారు. 30వేల గొలుసుకట్టు చెరువులను నిర్మించి వ్యవసాయాధారిత సమాజంగా నిర్మించారు. నిజాం కాలంలోనూ చెరువులను నిర్మించారు. 103 సంవత్సరాల క్రితం నిర్మించిన పోచారం ప్రాజెక్టు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. కానీ లక్ష కోట్లతో నిర్మాణం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం 3, 4 సంవత్సరాల్లో నిర్మించడం.. అది కూలిపోవడం కూడా చూశాము. దేశం అభివృద్ధి చెందాలంటే మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. ఇది కాంగ్రెస్ పార్టీ విజ్ఞత. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడింది. 1975లో మహారాష్ట్ర సిఎం ఎస్‌బి చవాన్‌తో ఏపి సీఎం వెంగళరావు ప్రాణహిత ప్రాజెక్టును నిర్మింప చేయాలని నిర్ణయించారు. ఆకలి కేకలే తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసింది. ఎంతో మంది ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు అమరులయి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించబడింది. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం ప్రారంభించారు. ప్రాణహిత చేవెళ్ల నుంచి ప్రాజెక్టును నిర్మించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాం. 2015లో పూర్తయింది. 6 జిల్లాల్లో 16 లక్షల సాగునీరు, హైదరాబాద్‌కి త్రాగునీటి కోసం రూ. 6150 కోట్లను ఖర్చు చేశారు. ఆ తరువాత తెలంగాణ సీఎం కేసీఆర్ 2016లో ప్రాజెక్టును నిలిపివేశారు. చంద్రశేఖర్ రావు మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించ దలచుకున్నామని చెబితే వ్యాప్‌కో సంస్థ నివేదికను ఇచ్చింది. అంతే కానీ ఎక్కడ నిర్మించాలో చెప్పమని అడగలేదు.. వారు ఎక్కడ నిర్మించాలనుకున్నారో అందుకు అనుగుణంగా నివేదికను వ్యాప్‌కో సంస్థ ఇచ్చింది. పైనుంచి గ్రావిటీ నుంచి నీటిని తెచ్చుకుంటే ఖర్చు తగ్గుతుంది.. కానీ లిఫ్ట్ ఇరిగేషన్ చేయాల్సి వస్తే ఖర్చు ఎక్కువ అవుతుంది. పంపింగ్ చేయాల్సి వచ్చింది కాబట్టే ఎక్కువ విద్యుత్ అవసరం వచ్చింది. కాళేశ్వరం నిర్మాణంలో ఎన్ఎస్‌డిఎస్ ప్రాజెక్టు నిర్మాణం లోప భూయిష్టంగా ఉందని చెప్పింది. సాంకేతిక నైపుణ్యం ఉన్న కేంద్ర సంస్థ స్పష్టం చేసింది. నిజాం ప్రభువు కంటే శ్రీమంతుడు కావాలని దురాశతో తుమ్మడి హట్టి దగ్గర నిర్మించాల్సిన ప్రాజెక్టు మేడిగడ్డ దగ్గర నిర్మించారు. 2020లోనే కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సి చెప్పినప్పటికీ ప్రాజెక్టును నిర్మింప చేసి.. ఇప్పుడు మేము కక్ష కట్టినట్టుగా మాట్లాడుతున్నారు. ప్రాజెక్టు కుంగిపోయిందని పోలీస్ స్టేషన్‌లో ఏఈ ఫిర్యాదు చేశారు. అప్పుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 2023 నవంబర్ 21న ఎన్‌డిఎస్ఏ లోపభూయిష్టంగా ఉందని ప్రాథమిక నివేదికను ఇచ్చారు. ఎవరిని రాకుండా అడ్డుకున్నది మీరే కదా. అప్పుడే తాము అధికారంలోకి రాగానే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని చెప్పారు. అలాగే చేశాము. సిట్టింగ్ జడ్జి అవకాశం లేదు.. రిటైర్డ్ జడ్జితో విచారణ నిర్వహించుకోండని సూచించిన నేపథ్యంలో జస్టిస్ పిసి ఘోష్‌తో కమిటీని ఏర్పాటు చేశాము. సర్ ఆర్థర్ కాటన్ బ్రిటిష్ అధికారి.. రాజమండ్రిలో 1848లో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను సభలో పెట్టి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పండి అంటే.. తాము కక్ష సాధింపు చర్యలు తీసుకుంటున్నామని నిందిస్తున్నారు. కేసీఆర్ చేసిన ద్రోహం అంతా.. ఇంతా కాదు. జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం గుర్తిస్తే 75 శాతం నిధులను కేంద్రం ఇస్తుంది.. రాష్ట్రం కేవలం 25 శాతం ఖర్చు చేస్తే సరిపోతుంది. 2013లో ఏపిలో 25 ప్రాజెక్టులు తీసుకున్నారు. లోపభూయిష్టమైన నిర్ణయాలు తీసుకున్న కేసీఆర్, మంత్రి హరీష్ రావును శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

# మామ చెప్పాడు.. అల్లుడు అమలు చేశారు!

## సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజి లకుఒకే టెక్నాలజీతో కట్టారనిఇపుడు మూడు బ్యారేజ్ లు ప్రమాదంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. సీకెండ్ ఫైల్ టెక్నాలజీ వాడటమే ప్రాజెక్టుకు ముప్పు ఏర్పడిందన్నారు. మామ చెప్పగానే అల్లుడు ఇంప్లిమెంట్ చేశారని తెలిపారు. కాంక్రీట్ డయాఫ్రమ్ వాల్ కట్టనందుకే ప్రమాదంలో ఉన్నాయని చెప్పారు పొంగులేటి. మేడిగడ్డ బ్యారేజీ రిపేర్ కు రూ. 3 లేదా 4 వందల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. కెసిఆర్ ఫామ్ హౌజ్ లోని బావి సైజులో రంధ్రం పడిందన్నారు పొంగులేటి. మేడిగడ్డలో 7వ బ్లాక్,మాత్రమే కాదు.. 3 బ్యారేజీలు ప్రమాదంలో ఉన్నాయన్నారు. ర్యాఫ్ట్‌కింద ఇసుక కొట్టుకొని పోయిందని అన్నారు.

సీకెంట్‌ఫైల్ టెక్నాలోజి ఇంత పెద్ద ప్రాజెక్టులకు వాడటం దేశంలో ఇదే మొదటి సారి అని ఆయన అన్నారు.హైకోర్ట్‌లో ఉండే కాంక్రిట్ వాడలేదని ఆయన అన్నారు. రాజీవ్, ఇందిరాసాగర్ పక్కనబెట్టి సీతారామప్రాజెక్టు కట్టి దోచుకున్నారని ఆయన ఆరోపించారు,ప్రాణహిత చెవెళ్ళపై 2014వరకు 5500కోట్లు ఖర్చుపెడితే కెసిఆర్ ఆప్రాజెక్టు పనికిరానిదని తెలిసికూడా ఎందుకు రూ. 6100 కోట్ల ఖర్చుచేశారని నిలదీశారు.

**మేడిగడ్డ వద్ద అదనపు నీటి వనరులు ఎలా వస్తాయి:**

**మంత్రి జూపల్లికృష్ణారావు**

మేడిగడ్డ వద్ద అదనపు నీరు తుమ్మడి హట్టికంటే ఎక్కు ఎలా వస్తాయని జూపల్లి అడిగారు. సుమారు ముప్పైనిమిషాలు హరీశ్‌రావు ప్రసంగాన్ని ఆయన అడ్డుకొన్నారు. హరీశ్‌రావు, కెసిఆర్ కలిసి స్థలమార్పుచేశారని ఆయన దుయ్యబట్టారు. పాల్వాయి హరీష్ మేడిగడ్డ వద్ద అదనపు ప్రవాహం ఉంటుందని మాజీమంత్రి హరీష్‌రావు సభను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

# కెసిఆర్ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలి

## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కె చంద్రశేఖరరావు తక్షణమే తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ డిమాండ్ చేశారు.అసెంబ్లీ సమావేశాలు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న తరుణంలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పటికీ కెసిఆర్ హాజరు కాకుండా ఉండటం బాధ్యత రాహిత్యమన్నారు.అసెంబ్లీలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టబడిందని.. కాళేశ్వరం ప్రాజెక్టుపై రిపోర్ట్ సమర్పించబడిందని.. కీలక చర్చల్లో కెసిఆర్ అసెంబ్లీకి హాజరుకాకుండా ఫార్మ్ హౌస్ లో నాటకాలు ఆడుతున్నారా? అని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విధుల్లోని ఆర్‌టిసి డ్రైవర్లకు సెల్‌ఫోన్ వాడకంపై నిషేధం

## పైలట్ ప్రాజెక్టుగా 11 డిపోల్లో నేటి నుంచి అమలు

## నిర్ణయం తీసుకున్న టిజిఎస్ఆర్‌టిసి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రయాణికుల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) కీలక నిర్ణయం తీసుకుంది. బస్సు నడుపుతున్న సమయంలో డ్రైవర్లు సెల్‌ఫోన్లు వినియోగించడాన్ని పూర్తిగా నిషేధించాలని నిర్ణయించింది. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ఈ కొత్త నిబంధనను అమలు చేయాలని ఆర్‌టిసి నిర్ణయించింది. నేటి(సెప్టెంబర్ 1) నుంచి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని ఆర్‌టిసి సంస్థ నిర్ణయించింది. విధుల్లో ఉన్నప్పుడు కొందరు డ్రైవర్లు సెల్‌ఫోన్లు వాడుతున్నట్లు ఆర్‌టిసి విజిలెన్స్ విభాగం జరిపిన తనిఖీల్లో వెల్లడైంది. ఇది ప్రయాణికుల భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తుందని భావించిన యాజమాన్యం.. సెల్‌ఫోన్‌ల వినియోగంపై నిర్ణయం తీసుకుంది. తొలిదశలో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు ఎంపిక చేసిన 11 డిపోల పరిధిలో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. గ్రేటర్ జోన్‌లోని ఫరూఖ్‌నగర్, కూకట్‌పల్లి డిపోలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

ఈ కొత్త నిబంధన ప్రకారం డ్రైవర్లు విధులకు హాజరైన వెంటనే తమ సెల్‌ఫోన్లను డిపోలో ఏర్పాటు చేసిన ప్రత్యేక లాకర్లలో భద్రపరచాల్సి ఉంటుంది. డ్యూటీ పూర్తయిన తర్వాతే వారు తమ ఫోన్లను తిరిగి తీసుకోవాల్సి ఉంటుందఇ. ఒకవేళ డ్రైవర్లకు ఏదైనా అత్యవసర సమాచారం అందించాల్సి వస్తే .. వారి కుటుంబ సభ్యులు, అధికారులు సంబంధిత బస్సు కండక్టర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కండక్టర్ ద్వారా ఆ సమాచారాన్ని డ్రైవర్‌కు చేరవేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు ఫలితాలను బట్టి.. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలలోనూ ఇదే విధానాన్ని అమలు చేసే అంశాన్ని ఆర్‌టిసి యాజమాననయం పరిశీలిస్తోంది.

# ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో జితేందర్‌రెడ్డి, మల్లు రవి భేటీ



**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** త్వరలో జరగబోయే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి అన్ని పార్టీల ఎంపీలు మద్దతు ఇవ్వాలని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఏ.పీ. జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం న్యూఢిల్లీలో ఆయన, ఉపరాష్ట్రపతి పదవికి ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి దేశ సమగ్రత, రాజ్యాంగ విలువలకు అచంచలంగా కట్టుబడిన వ్యక్తి అని కొనియాడారు. న్యాయరంగంలో ఆయన ఇచ్చిన కీలక తీర్పులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చూపిన తపన, రాజ్యాంగ స్ఫూర్తి పట్ల ఆయన నిబద్ధత అందరికీ ఆదర్శమని అన్నారు. కాబట్టి పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.జస్టిస్ సుదర్శన్ రెడ్డి విజయం సాధిస్తే, ఢిల్లీలో తెలుగు ప్రజల గౌరవం, ప్రతిష్ట మరింత పెరుగుతుందని, తెలుగు ఎంపీలందరూ ఆయనకే మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిష్పాక్షిక దృక్పథం, న్యాయశాస్త్రంలో అపారమైన అనుభవం, రాజ్యాంగం పట్ల అచంచలమైన నిబద్ధతతో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి పదవికి గౌరవాన్ని తీసుకువస్తారని చెప్పారు. ఆయన విజయం తెలుగువారికి గర్వకారణం అవుతుందని పేర్కొన్నారు. ఈ భేటీలో జితేందర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత ఎంపీ మల్లు రవి తదితరులు ఉన్నారు.

# బిసి రిజర్వేషన్లు అమలు ఘనత కాంగ్రెస్ పార్టీదే

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లు అమలు చేసే ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసు కెళ్లాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ డిసిసి అధ్యక్షులు, ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం డిసిసి అధ్యక్షులు, టిపిసిసి ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్‌లతో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి కెసిఆర్ బిసిలను అనగదొక్కారని అన్నారు. కెసిఆర్ చేసిన బిసి బిల్లు బిసిలకు మరణ శాసనం అయ్యిందన్నారు. బిసి కులగణన చేసి పకడ్బందీగా బిసి బిల్లు తెచ్చి బిసిలకు రాజకీయ సుస్థిర స్థానం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు.

రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఆశయాల మేరకు ఎవరి జనాభా ప్రకారం వారి వాటా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పని చేసిందని, కులగణన చేపట్టామన్నారు. బిసి కమిషన్ వేశామని, డెడికేటెడ్ బిసి కమిషన్ వేసి లెక్కలు తేల్చామన్నారు. అసెంబ్లీ, మండలిలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ బిల్లు చేసామన్నారు. ఆ బిల్లులు గవర్నర్, రాష్ట్రపతికి పంపి ఆలస్యం అవుతుంటే కోర్ట్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ చేయమంటే ఆర్డినెన్స్ తెచ్చామన్నారు. ఆర్డినెన్స్ కూడా గవర్నర్ ఆమోదించకపోవడంతో ఆదివారం అసెంబ్లీలో మళ్ళీ రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేస్తూ 42 శాతం బిసి రిజర్వేషన్లు చేసి బిల్లు పాస్ చేసి చూపించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి వర్గం పూర్తి చిత్తశుద్ధితో పని చేసిందన్నారు.

ఎన్ని రాజకీయ, సాంకేతిక, న్యాయ పరమైన అడ్డంకులు వచ్చినా ఎదుర్కొని బిసిల రిజర్వేషన్ల విషాయంలో అన్ని చేసి చూపించామన్నారు. మన చిత్తశుద్ధి, పని తనాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో, మండలాల్లో, జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బిసి రిజర్వేషన్ల హీరోగా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్ రెడ్డిలను నిలబెట్టాలని పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మనం పూర్తి స్థాయిలో వియయం సాధించాలని, 20 నెలల కాంగ్రెస్ పాలనలో చేసిన ప్రజా పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, బిసి రిజర్వేషన్లు పెద్దఎత్తున కింది స్థాయి వరకు తీసుకుని వెళ్లాలంటూ పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించండి

## టీచర్ల సమస్యలను పరిష్కరించండి

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ఆదివారం వికారాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా తాండూరు మండలం గుంగుర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వారి సహకారంతో నూతనంగా నిర్మించిన సాంధీపాణి గురుకుల విద్యార్థి వసతి గృహ సముదాయాన్ని ప్రారంభించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కలిసిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పంచాయతీ రాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నియమాల రూప కల్పన, కెజిబివి, ఎస్ఎస్ఏలలో కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ ఉద్యోగులకు కనీస సమయ స్కేల్ మంజూరు చేయాలని.. కొత్తగా ఏర్పడ్డ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కోరారు. సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణకు సంబంధించిన స్పష్టీకరణ, తెలంగాణలో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి)-2020 అమలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు (ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం) పదోన్నతికి బిఈడిని అర్హతగా చేర్చడానికి ఎన్‌సిటిఈ మార్గదర్శకాలను సవరించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ -ఆదిలాబాద్-నిజామాబాద్ -మెదక్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.





# భారతీయ వసలదార్లకు వ్యతిరేకంగా ఆస్ట్రేలియాలో భారీ ర్యాలీ

## 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' పేరిట నిరసన ప్రదర్శనలు

**మెల్‌బోర్న్, ఆగస్టు 31:** ఆస్ట్రేలియాలో పెరుగుతున్న వలసలను వెంటనే కట్టడిచేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు ర్యాలీ నిర్వహించారు. మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా పేరిట నిర్వహించిన ఈ ర్యాలీలో వేలాదిమంది ఆస్ట్రేలియన్లు పాల్గొన్నారు. వారి ప్రదర్శన ఆసాంతం భారతీయ వలసదారులనే లక్ష్యంగాచేసుకున్నా ఆసీస్‌ప్రభుత్వం మాత్రం ఈ ర్యాలీని తీవ్రంగా ఖండించింది. వారునిర్వహించిన ప్రదర్శనలు ద్వేషాన్ని రెచ్చగొట్టేవిగా ఉన్నాయని చెప్పింది. ఆస్ట్రేలియా జనాభాలో మూడుశాతంమంది భారత సంతతికి చెందినవాళ్లున్నారని, ఈసందర్భంగా నిరసనకారులు వెల్లడించారు. ఐదేళ్లలో వసల వచ్చిన భారతీయుల సంఖ్య గడచిన 100 ఏళ్లలో వచ్చినగ్రీకులు, ఇటాలియన్లసంఖ్యకంటే ఎక్కువ అని అన్నారు. సిడ్నీ, మెల్‌బోర్న్, కాన్‌బెర్రా ఇతర నగరాల్లో భారీ ర్యాలీలు జరిగాయి. సిడ్నీలో ఐదునుంచి 8వేల మంది ఈనిరసన ర్యాలీలో పాల్గొన్నారు. వీరికి వ్యతిరేకంగా రెఫ్యూజీ యాక్షన్ కోయెలిషన్‌నిర్వహించిన ర్యాలీకూడా ఇక్కడకు సమీపంలోనే జరిగింది. ర్యాలీల నేపథ్యంలో సిడ్నీలో వందలాదిమంది అధికారులను మొహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

# 24 గంటల్లో గర్భిణి హత్య కేసు నిందితుల అరెస్టు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** శనివారం ఇల్లందకుంట మండలం టేకుర్తి మండలంలో నిండు గర్భిణీ హత్య జరిగిన సంఘటన కలకలం రేపింది. ఈ హత్య సంఘటనను పోలీసులు 24 గంటల్లో చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన ముద్రబోయిన రాములు(40) ఒగ్గు కథ చెప్పుకుంటూ జీవిస్తాడు. 20 సంవత్సరాల క్రితం రాములుకు కనగర్తికి చెందిన రేణుక (38)తో వివాహం జరుగగా వారికి అభిలాష్ (21), బన్నీ తేజ(19) అను ఇద్దరు కుమారులు ఉన్నారు. రాములు వృత్తి రీత్యా వరంగల్ వెళ్తున్న క్రమంలో అక్కడే ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి కి చెందిన పెళ్ళై భర్తతో వేరుగా ఉంటున్న ఎస్సి కులానికి చెందిన ముద్రబోయిన తిరుమల(35) తో పరిచయం పెరిగి 7 సంవత్సరాల క్రితం ఆమెను రెండవ వివాహం చేసుకొని టేకుర్తిలో వేరు కాపురం పెట్టారు. ఈ క్రమంలో రాములు మొదటి భార్య, కొడుకులు ఆమె పై కక్ష్య పెంచుకొని ఆమెతో తరచు గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో తిరుమల గర్భవతి అయి ప్రస్తుతం 7 నెలల గర్భవతిగా ఉంది. మొదటి నుండి తిరుమలకు గర్భం రావడం ఇష్టం లేని రాములు, అప్పటికే తిరుమలపై కక్ష పెట్టుకున్న మొదటి భార్య, ఆమె కుమారులు తిరుమలను ఎలాగైనా చంపేయాలని నిర్ణయించు కొని రాములు చిన్న కుమారుడైన బన్నీ తేజను తిరుమలను చంపడానికి ప్రేరేపించి అదను చూసి ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో ముందుగానే కొనుక్కున్న కత్తితో బన్నీతేజను పంపించి విచక్షణరహితంగా ఆమె గొంతు కోసి, కత్తితో పొడిచి చంపివేయడం జరిగింది.



నిందితులను అరెస్టు చేసిన దృశ్యం

ఈ సంఘటనపై కేసు నమోదు చేసు కున్న ఇల్లందకుంట పోలీసులు ఆదివారం హుజు రాబాద్ ఇంచార్జి ఎసిపి శ్రీనివాస్ పారిపోతున్న నిందితులను అరెస్టుచేసి వారి నుండి నేరానికి ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీన పర్చుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో నేరం జరిగిన తర్వాత అతి తక్కువ సమయంలో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న జమ్మికుంట రురల్ సిఐ కె. లక్ష్మీ నారాయణ, ఇల్లందకుంట ఎస్ఐ క్రాంతి కుమార్‌ను పోలీస్ కమిషనర్‌గౌస్ ఆలం అభినందించారు. కార్యక్రమంలో జమ్మి కుంట సిఐ, హుజురాబాద్ రూరల్ సిఐ లు రామ కృష్ణ, పులి వెంకట్, వీణవంక, సైదాపూర్ ఎస్ఐలు ఏ. తిరుపతి, సిహెచ్ తిరుపతి లు పాల్గొన్నారు.

# 'ఓట్ చోర్.. గద్దీ చోడ్' నేపథ్యంలో గాంధీభవన్ వద్ద మహిళా కాంగ్రెస్ నేతల ధర్నా

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటు చోర్ గద్దీ చోడ్ పేరుతో గాంధీభవన్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీతా రావు నాయకత్వంలో మధ్యాహ్నం 12 గంటలకు గాంధీభవన్‌లో ధర్నా విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ దిష్టిబొమ్మ దహనం చేసి మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, మహిళా కాంగ్రెస్ నాయకులందరికి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమం మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా పిలుపు మేరకు, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అనుమతితో నిర్వహించినట్లు సునీతా రావు పేర్కొన్నారు.

# మియాపూర్ బిబిడబ్ల్యు కూడా తరలింపు

## ఐదుగురు ఉన్నతాధికారులతో కమిటీ ప్రతిపాదనలు

## తరలింపును వ్యతిరేకిస్తున్న ఆర్‌టిసి సంఘాలు

# కరీంనగర్‌కు తరలనున్న ఆర్‌టిసి ఉప్పల్ వర్క్‌షాప్!

**హైదరాబాద్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ఉప్పల్‌లో ఉన్న ఆర్‌టిసి జోనల్ వర్క్ షాప్‌ను కరీంనగర్ జోనల్ వర్క్ షాప్‌కి తరలించనున్నారు. ఉప్పల్ జోనల్ వర్క్ షాపుతోపాటు మియాపూర్‌లోని బస్ బాడీ అండ్ వర్క్‌షాప్(బిబిడబ్ల్యు)ను కూడా కరీంనగర్‌కి తరలించాలని ఆర్‌టిసి యాజమాన్యం నియమించిన అధికారుల కమిటీ ప్రతిపాదనలు రూపొందించింది. సెంట్రలైజేషన్ ఆఫ్ వర్క్‌షాప్ కోసం ఉప్పల్‌లోని జోనల్ వర్క్ షాప్, జడ్ఎస్ఃఉప్పల్(పర్చేస్ అండ్ డిస్పోసల్), బిబిడబ్ల్యు-మియాపూర్ తరలించాలని ఆర్‌టిసి యాజమాన్యం ఐదుగురు ఉన్నతాధికారులతో వేసిన కమిటీ ఆగస్టు 19న హైదరాబాద్‌లోని బస్ భవన్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. సిఎంఈ సిహెచ్ వెంకన్న, సిఎఫ్ఎం బిసివి పుష్ప కుమారి, సిపిఎం టి ఉషాదేవి, సిసిఎస్ ఎంఈ ప్రభులత, సిసిఈ ఆర్ కవిత సమావేశమయ్యారు. సమావేశంలో సెంట్రలైజేషన్ ఆఫ్ వర్క్‌షాప్ అంశంపై చర్చించారు. అనంతరం ఉప్పల్ వర్క్ షాప్‌ను, మియాపూర్ బిబిడబ్ల్యును, ఉప్పల్ జడ్ఎస్‌ను తరలించాలని నిర్ణయించారు. ఉప్పల్ వర్క్ షాప్‌ని కరీంనగర్‌కి తరలించకుండా ఆపాలని ఆర్‌టిసి లోని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

హైదరాబాద్‌లోని బిబిడబ్ల్యు మియాపూర్, జోనల్ వర్క్‌షాప్ ఉప్పల్ యూనిట్లను కరీంనగర్ షిఫ్ట్ చేయకుండా హైదరాబాద్లులోనే కొనసాగించాలని ఆర్‌టిసిలోని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 18 ఎకరాల స్థలంలో బస్ బాడీ బిల్డింగ్(బిబిడబ్ల్యు) వర్క్ షాప్‌తోపాటు స్టోర్స్ అండ్ పర్చేజ్ డిపార్టుమెంట్లు సుమారు 155 మంది సిబ్బందితో పని చేస్తోంది. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం గజం 2 లక్షలు ఉంది. ఇంత ఖరీదైన స్థలాన్ని ఇతరులకు అప్పజెప్పడం కోసమే ఇక్కడి నుంచి కరీంనగర్‌కి తరలించాలని యాజమాన్యం చూస్తోందని సంఘాలు మండిపడుతున్నాయి. కొత్త బస్సులు తయారై డిపోలకు పంపబడతాయి. నైపుణ్యం గల కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ వర్క్ షాపును కరీంనగర్‌కు షిఫ్ట్ చేయాలని ఆర్‌టిసి యాజమాన్యం నిర్ణయించటంపై యూనియన్లు మండిపడుతున్నాయి. ఉప్పల్‌లో కొన సాగుతున్న జోనల్ వర్క్ షాప్ సుమారు 16 ఎకరాల్లో ఉంది. జోనల్ వర్క్ షాప్, జోనల్ స్టోర్స్‌లో కలిసి సుమారు 355 మంది సిబ్బంది పని చేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ జోన్, హైదరాబాద్ జోన్‌లోని 55 డిపోల బస్సులు ఈ వర్క్ షాప్‌కు కంప్లీట్ ఓవర్ హాల్ కోసం, మెటీరియల్ కోసం వస్తుంటాయి. ఉప్పల్ జోనల్ వర్క్‌షాప్‌తోపాటు మియాపూర్ బిబిడబ్ల్యు వర్క్ షాపులను కరీంనగర్‌కి తరలించాలనే నిర్ణయం ప్రభుత్వానిదా? లేకపోతే ఆర్‌టిసి యాజమాన్యమే తీసుకుందా? అని సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

# సెప్టెంబర్ 5న 'ఉఫ్ఫ్ యే సియాపా' విడుదల

**ఉఫ్ఫ్ యే సియాపా:** బాలీవుడ్ కథా కథనాన్ని ఒక కొత్త పంథాతో చెప్పబోతున్న బోల్డ్ సైలెంట్ కామెడీ. 40 సంవత్సరాల తర్వాత తిరిగి కమల్ హాసన్ నటించిన పుష్పక విమానం వలె, డైలాగులేని, నిజం చెప్పాలంటే డైలాగ్ అవసరపడని సినిమా. నాలుగైదు జనరేషన్స్ మిస్సయిన ఒక అద్భుతం. భారతీయ సినిమా ప్రయోగాలకు కొత్తేమీ కాదు, కానీ ప్రధాన స్రవంతి సినిమాకు, సంభాషణలకు ఉన్న అవినాభావ సంబంధం అందరికీ తెలిసిందే. అలాంటి సినిమా నుండి సంభాషణలు లేకుండా ధైర్యం చేయడం చాలా అరుదు. జి. అశోక్ దర్శకత్వం వహించి లవ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై లవ్ రంజన్, అంకుర్ గార్గ్ నిర్మించిన 'ఉఫ్ఫ్ యే సియాపా' నియమాలను తిరిగి రాస్తోంది. సెప్టెంబర్ 5 న విడుదల కానున్న ఈ డార్క్ కామెడీథ్రిల్లర్ డైలాగ్ లేకుండా ఒక కథని చెప్పడానికి ప్రయత్నం చేస్తోంది. పూర్తిగా హావభావాలతో, పర్ఫామెన్స్ ని ఆధారంగా తీసుకొని హాస్యంతో కూడుకున్న దృశ్య మాలికకు ఇండియా గర్వకారణమైన ఆస్కార్ విన్నర్ ఎ. ఆర్. రెహమాన్ యొక్క ఉత్తేజకరమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేయడం ఇంకా విశేషం. ఉఫ్ఫ్‌యే



సియాపా యొక్క కేసరి లాల్ సింగ్ (తుంబడ్ ఫేమ్ సోహుమ్ షా), అతని జీవితం గందరగోళంలోకి తిరుగుతుంది, పొరపాటున జరిగిన ఒక పార్సిల్ డెలివరీ, వరుస అపార్థాలు అతని ఇంటిని నేరస్థలంగా మారుస్తాయి. అతని భార్య పుష్ప (నుష్రత్ భరుచ్చ) అతను తమ పొరుగున ఉన్న కామిని (నోరా ఫతేహి)తో సరసాలాడుతున్నా డని అనుమానిస్తుంది, అలిగి పుట్టింటికి వెళ్ళిపోతుంది. ఆమె వెళ్లిన తరువాత అతని జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు ఎటువంటి ఆసక్తిని ఎంతటి హాస్యాన్ని కురిపిస్తాయి అన్నది మిగతా కథ. మాటలు మాట్లాడని చిత్రంలో, సంగీతం ప్రధాన దశకు చేరుకుంటుంది. ఎ. ఆర్. రెహమాన్‌కు, ఇది ఒక సవాలు, అవకాశం రెండూ. తన అనుభవాన్ని ప్రతిబింబిస్తూ, అతను ఈ చిత్రం గురించి ఇలా పంచుకున్నాడు.




# అభిమానుల ప్రేమ వల్లే ఈ రికార్డుల్ని సాధించా




## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడంపై నందమూరి బాలకృష్ణ

**నందమూరి నటసింహం** బాలకృష్ణ సినీ ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ఆయన పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ అరుదైన గౌరవానికి ఎంపికైన తొలి హీరో బాలకృష్ణనే కావడం విశేషం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్‌లో స్థానం కల్పించినట్టుగా సీఈవో సంతోష్ శుక్లా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ బాలకృష్ణను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎపి ఐటీ మినిస్టర్‌నారా లోకేష్, సహజ నటి జయసుధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లోనే నందమూరి బాలకృష్ణ తెలంగాణ రాష్ట్రంలో వరదలకు అతలాకుతలం అయిన ప్రాంతాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి యాభై లక్షల ఆర్థిక విరాళాన్ని కూడా ప్రకటించారు.

కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ, నాకు ఇంతటి ధన్యమైన జన్మనుఇచ్చిన దైవాంశ సంభూతుడు, నా గురువు, నా దైవం నటరత్న, పద్మశ్రీ నందమూరి తారకరామారావు, నా తల్లి బసవతారకంకి ధన్యవాదాలు. ఈ రోజు ఈ కార్యక్రమానికి వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి, ఎపి ఐటీ, ఎడ్యుకేషన్ మినిస్టర్ నారాలోకేష్‌కి, సహజ నటి జయసుధకి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ సీఈఓ సంతోష్ శుక్లాకి, జాయింట్ సెక్రటరీ ఒలాకి, ఉస్మాన్‌కి కృతజ్ఞతలు. నేను ఇండస్ట్రీలో 50 ఏళ్ల సుదీర్ఘమైన ప్రయాణాన్ని పూర్తి చేశాను. అందరి సహాయ సహకారాలతో క్యాన్సర్ హాస్పిటల్‌ను నడిపిస్తున్నాను. నేను నా హిందూపురం ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఎపిలోనూ ఫిల్మ్ ఇండస్ట్రీని అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాను. నేను 13 ఏళ్ల వయసులోనే 'తాతమ్మ కల' మూవీ చేశాను. 50 ఏళ్లలో 110 చిత్రాలు చేశాను. నేను చిత్ర సీమకు చేసిన సేవకుగానూ ఈ గుర్తింపుదక్కడం ఆనందంగా ఉంది. నేను మూడు సార్లు హిందూపురం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా సేవలందిస్తున్నాను. ఇవన్నీ నా దర్శక, నిర్మాతలు, కుటుంబ సభ్యులు, అభిమానులు అండగా నిలిచారు. కేంద్రం నుంచి రీసెంట్‌గా పద్మ భూషణ్ అవార్డు లభించింది. 'భగవంత్ కేసరి'కి ఉత్తమ జాతీయ తెలుగు చిత్రంగా అవార్డు వచ్చింది. నేను చేసిన 'అన్‌స్టాపబుల్' షో అరుదైన రికార్డులు సాధించింది. ఈ జర్నీ ఇంకాకొనసాగుతూనే ఉంటుంది అన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, బాలకృష్ణకి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం ఆనందంగా ఉంది. ఈ రోజు ఇలా బాలకృష్ణకి గౌరవం లభించడం తెలుగు వారికిగర్వ కారణం. బాలకృష్ణ ఇంకా ముమ్ముందు ఇదే జోష్‌తో కొనసాగాలని, ఎన్నెన్నో రికార్డులు సృష్టించాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను అన్నారు.

ఏపీ ఐటీ మినిస్టర్ నారా లోకేష్ మాట్లాడుతూ, చరిత్ర రాయాలన్నా? మళ్లీ తిరిగి రాయాలన్నా? అది కేవలం బాలయ్య బాబు వల్లే అవుతుంది. 50 ఏళ్లు సినిమా రంగంలో, రాజకీయాల్లో ప్రత్యేక స్థానంసాధించుకున్నారు. అన్‌స్టాపబుల్ షోతో దేశం లోనే అరుదైన రికార్డు క్రియేట్‌చేశారు. బాలయ్య ఎప్పుడూ అన్ స్టాపబుల్. ఆయనకు ఈ గుర్తింపు రావడం మనందరికీ గర్వకారణం అన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్ సీఈవో సంతోష్ శుక్లా మాట్లాడుతూ .. 'బాలకృష్ణ గారి గురించి గత కొన్ని రోజులుగా గూగుల్, యూట్యూబ్ ద్వారా తెలుసుకుంటూనే ఉంటున్నాను. నేను ఈ రోజు ఆయన్ను కలిసిన తరువాత ఆయన గొప్పదనం ఏంటో అర్థమైంది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్‌లో ఆయన పేరు ఉండటం సంతోషంగా ఉంది అన్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్ జాయింట్ సెక్రటరీ డా. ఒలా మాట్లాడుతూ ,చిత్ర సీమలో 50 ఏళ్లుగా హీరోగా చేసిన సేవలకు గుర్తింపుగా నందమూరి బాలకృష్ణ పేరుని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎక్కించాం. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఆయన రికార్డులు సృష్టించారు. అలా ఆయన సినీ, పొలిటికల్, సోషల్ సర్వీస్ విషయంలో ఎన్నెన్నో రికార్డులున్నాయి. ఈ రోజు మేం ఆ సర్టిఫికేట్‌ను ఆయనకు అందిస్తుండటం సంతోషంగా ఉంది అని అన్నారు.

సహజ నటి జయసుధ మాట్లాడుతూ,నందమూరి బాలకృష్ణకు ఇలాంటి అరుదైన గౌరవం దక్కడం, ఈ కార్యక్రమంలో నేను పాలు పంచుకోవడం ఆనందంగా ఉంది. కేవలం నటుడుగానే కాకుండా ఆయన గొప్ప వ్యక్తి. ఆయన ఇంకా ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలి. ఇలాంటివెన్నో ఆయనకు రావాలి అని అన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ ,బాలకృష్ణ హీరోగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కడం ఆనందంగా ఉంది. ఇది తెలుగు సినిమా ఇండస్ట్రీకి, తెలుగు వారికి గర్వ కారణంఅని అన్నారు.

గోపీచంద్ మలినేని మాట్లాడుతూ ,బాలయ్య బాబు ఈ 50 ఏళ్ల సినీ జర్నీలో నేను కూడా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను. బాలయ్య బాబు 2.ఓని చూడబోతోన్నారు అన్నారు. ప్రముఖ నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ,బాలయ్య బాబు ఎప్పుడూ రికార్డులు బ్రేక్ చేస్తుంటారు. ఆయన ఇలానే ఇంకెన్నో రికార్డులు బ్రేక్ చేస్తూ ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ, బాలయ్య బాబు నిజంగానే ఒలెజెండ్. కష్టపడి పనిచేస్తూ వెళ్తుంటే.. ఫలితం వెనకాలే వస్తుందని కృష్ణ పరమాత్ముడు చెప్పారు. బాలయ్య ఎనర్జీ నాకు తెలుసు. ఆయన ఇంకెన్నో ఇలాంటి అవార్డులు, రివార్డుల్ని సాధిస్తారు అన్నారు. దర్శకుడు బాబీ మాట్లాడుతూ ,బాలయ్య బాబు ఎప్పుడూ ఫిల్టర్ లేకుండా ఉంటారు. ఆయన డాక్టర్ కాలేకపోయినా యాక్టర్‌గామారి ఎంతో మందికి వినోదం రూపంలో మెడిసిన్ ఇస్తున్నారు. ఆయనకు ఈ గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ,బాలయ్యకి పని చేస్తుండేటప్పుడు వేరే ప్రపంచంలోకి వెళ్తుంటాను. ఇలా బుక్ రికార్డులే కాదు.. రేపు వచ్చే మా'అఖండ 2'అన్ని రికార్డుల్ని చెరిపేస్తుంది. నా మ్యూజిక్‌కు బాలయ్య పునర్జన్మను ఇచ్చినట్టుగా అనిపిస్తుంది. ఆయనతో పని చేస్తుంటే గుడికి వెళ్లినట్టుగా అనిపిస్తుందిఅని అన్నారు.

నందమూరి మోహన కృష్ణ మాట్లాడుతూ, సినీ రంగంలో 50 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం చేసిన నా తమ్ముడు బాలకృష్ణకి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం ఆనందంగా ఉంది. మా నందమూరి వంశానికి మకుటం మా నాన్న అయితే.. ఆ మకుటానికి వన్నె తెచ్చే కలికితురాయి మా బాలకృష్ణ. అతడిలా ఇంకెన్నో సాధించాలని కోరుకుంటున్నానుఅని అన్నారు.



## 'ఆర్‌వి ఫిల్మ్ హౌస్' బ్యానర్ 'కొక్కొరొకో' ప్రారంభం..

**ప్రముఖ దర్శక, నిర్మాత** రమేష్ వర్మ కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు గానూ 'ఆర్‌వి ఫిల్మ్ హౌస్' అనే బ్యానర్‌ను స్థాపించారు. ఆర్‌వి ఫిల్మ్ హౌస్ ప్రొడక్షన్ కంపెనీ మీద నిర్మిస్తున్న మొదటి ప్రాజెక్ట్ 'కొక్కొరొకో'ని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ముహూర్తపు షాట్‌కు నిర్మాత రేఖ వర్మ క్లాప్ కొట్టగా.. నిర్మాత కూరపాటి శిరీష కెమెరా స్విచ్ ఆన్ చేశారు. రమేష్ వర్మ స్క్రిప్ట్‌ను దర్శకుడు శ్రీనివాస్ వసంతలకు అందజేశారు. ఈ మూవీతో శ్రీనివాస్ వసంతల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.

వినూత్నమైన కథతో, డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్ అందించేలా శ్రీనివాస్ వసంతల ఈ మూవీని తెరకెక్కించనున్నారు. ప్రముఖ స్క్రీన్ రైటర్ జి. సత్యమూర్తి కుమారుడు, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ సోదరుడు ప్రముఖ నేపథ్య గాయకుడు జివి సాగర్ ఈ మూవీకి సంభాషణలు రాసే బాధ్యతను స్వీకరించారు. తన తండ్రి వారసత్వాన్ని అనుసరించి 'రాక్షసుడు' తర్వాత రచయితగా రెండో ప్రాజెక్ట్‌ని సాగర్ చేపట్టారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా ఆకాష్ ఆర్ జోషి, లండన్‌కు చెందిన ఒక యంగ్ అండ్ ఎనర్జిటిక్ మ్యూజిక్ డైరెక్టర్‌గా సంకీర్తన్ పని చేయనున్నారు. ఈ చిత్రాన్ని రేఖ వర్మ, కూరపాటి శిరీష నిర్మాతలుగా, నీల్లాద్రి ప్రొడక్షన్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎడిటర్‌గా ప్రవీణ్ పూడి పని చేయనున్నారు. ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లేను రమేష్ వర్మ స్వయంగా రూపొందించారు. ఆర్‌వి ఫిల్మ్ హౌస్ బ్యానర్‌లో మొదటి చిత్రంగా తెలుగులో ఓ చక్కటి ఆంథాలజీ కానుందని, అద్భుతమైన విజువల్స్, మంచి ఎమోషన్స్‌తో 'కొక్కొరొకో'ని రూపొందించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది .

# దుబాయిలో వైభవంగా గామా అవార్డ్స్

## ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ చిత్రంగా పుష్ప 2



**ప్రతిష్టాత్మమైన గామా అవార్డ్స్‌కు** టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగ రంగ వైభవంగా జరిగాయి. తాజాగా వైభవ్ జ్యువెలర్స్ సమర్పణలో 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్ట్ 30న దుబాయ్ లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో అతిరథ మహారథుల సమక్షంలో మరింత గ్రాండ్ గా జరిగింది. ఈ వేడుకలో టాలీవుడ్ పరిశ్రమ నుంచి పలువురు సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. గామా అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు గారు, సీఈఓ సౌరభ్ కేసరి గారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అత్యంత వైభవంగా ఈ అవార్డుల కార్య క్రమం ఘనంగా జరిగింది. గామా అవార్డ్స్ 2025 జ్యూరీ చైర్ పర్సన్స్ ప్రముఖ సినీ దర్శకులు ఏ. కోదండ రామిరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు కోటి, ప్రముఖ దర్శకులు బి. గోపాల్ ఆధ్వర్యంలో వివిధరంగాలకు ఎంపిక అయిన టాలీవుడ్‌కళాకారులకు, సినిమాలకు అవార్డ్స్ బహుకరించబడ్డాయి.

**గామా అవార్డు గ్రహీతలు:** బెస్ట్ యాక్టర్ 2024 – అల్లు అర్జున్ (పుష్ప2 ది రూల్). బెస్ట్ హీరోయిన్ – మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్), బెస్ట్ మూవీ –పుష్ప 2, బెస్ట్ డైరెక్టర్ – సుకుమార్ (పుష్ప 2), బెస్ట్ ప్రొడ్యూసర్ – అశ్విని దత్, ప్రియాంక దత్, స్వప్న దత్ (కల్కి 2898ఎడి), బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ – దేవిశ్రీప్రసాద్ (పుష్ప 2), బెస్ట్ కొరియోగ్రఫీ : భాను మాస్టర్ (నల్లంచు తెల్లచీర.. మిస్టర్ బచ్చన్), బెస్ట్ ఎడిటర్ : నవీన్ నూలి (లక్కీ భాస్కర్), బెస్ట్ సినిమాటోగ్రఫీ : రత్న వేలు (దేవర), బెస్ట్ లిరిసిస్ట్ – రామ జోగయ్య శాస్త్రి, బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్: అనురాగ్ కులకర్ణి (సుట్టమలా సూసి.. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి) బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ ఫిమేల్ :మంగ్లీ (కళ్యాణి వచ్చావచ్చా.. ఫ్యామిలీ స్టార్) బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ ఫిమేల్ క్రిటిక్ : సమీరా భరద్వాజ్ (నల్లంచు తెల్లచీర.. మిస్టర్ బచ్చన్) బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ : రజాకాం, బెస్ట్‌యాక్టర్ క్రిటిక్: తేజసజ్జా, బెస్ట్ పెర్ఫార్మన్స్ యాక్టర్ జ్యూరీ:రాజా రవీంద్ర (సారంగదరియా), బెస్ట్ యాక్టర్ జ్యూరీ :కిరణ్ అబ్బవరం (క), బెస్ట్ ప్రామిసింగ్ యంగ్ యాక్టర్: రోషన్ (కోర్ట్), బెస్ట్ ప్రామిసింగ్ యంగ్ యాక్టర్ ఫిమేల్ : శ్రీదేవి (కోర్ట్), బెస్ట్ ప్రామిసింగ్ యంగ్ యాక్టర్ ఫిమేల్ : మానస వారణాశి, బెస్ట్ ఆస్పైరింగ్ డైరెక్టర్ : అప్సర్ (శివం భజే), గద్దర్ మెమోరియల్ మ్యూజిక్ అవార్డ్: మట్ల తిరుపతి, బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్: వినయ్‌రాయ్ (హనుమాన్), బెస్ట్ సపోర్టింగ్ పెర్ఫార్మన్స్ అవార్డ్ : హర్ష చెముడు (సుందరం మాస్టర్), బెస్ట్ సపోర్టింగ్ కామెడీ రోల్ : బాలిరెడ్డి పృథ్వీరాజ్, బెస్ట్ డెబ్యూ యాక్టర్ ఫిమేల్ : నయన్ సారిక (ఆయ్, క), బెస్ట్ డెబ్యూ యాక్టర్ జ్యూరీ : ధర్మ కాకాని (డ్రింకర్ సాయి), బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ : యదు వంశీ (కమిటీ కుర్రాళ్ళు), బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్ : నిహారిక కొణిదెల (కమిటీ కుర్రాళ్ళు), గ్లోబల్ కమెడియన్‌గా ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందం గారు స్పెషల్ అవార్డును అందుకున్నారు.




# చంద్రహాస్ నూతన చిత్రం కాన్సెప్ట్ పోస్టర్ విడుదల

**ఆటిట్యూడ్ స్టార్** చంద్రహాస్ మొదటి చిత్రంలోనే తన నటనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇప్పుడు బరాబర్ ప్రేమిస్తా అంటూ ఆడియెన్స్‌ను మరోసారి మెప్పించేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే వదిలిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఆడియెన్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇక ఇప్పుడు చంద్రహాస్ నూతన చిత్రానికి సంబంధించిన అప్డేట్ వచ్చింది. ఈ మేరకు సందీప్ కిషన్ ఈ కొత్త చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కాన్సెప్ట్ పోస్టర్ చూస్తుంటే ఇదేదో రెగ్యులర్ కమర్షియల్ చిత్రంలా కనిపించడం లేదు. ఈ కథలో దేశ భక్తికి సంబంధించిన అంశాల్ని కూడా జోడించినట్టుగా అనిపిస్తోంది. ఐదు రూపాయల బిళ్ల, వాటి చుట్టూ ఉన్న బుల్లెట్లు, పోస్టర్‌ను డిజైన్ చేసిన తీరు చూస్తుంటే మంచి పవర్ ఫుల్ స్టోరీతోనే సినిమా రాబోతోందని అర్థం అవుతోంది. జైరామ్ చిటికెల ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రాన్ని పివికె ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. చంద్రహాస్ బర్త్ డే సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ మూవీకి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను రిలీజ్ చేయబోతోన్నారు.

# కంటెంట్ ఉన్న సినిమాలు రావాలి

## 'కానిస్టేబుల్' ట్రైలర్ ఈవెంట్‌లో డా.రాజేంద్ర ప్రసాద్

**జాగృతి మూవీ మేకర్స్** బ్యానర్ పై వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో బలగం జగదీష్ నిర్మించిన థ్రిల్లర్ చిత్రం 'కానిస్టేబుల్'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని అమీర్ పేట్ లో ఎఎఎ మల్టీ ప్లెక్స్ థియటర్‌లో ఘనంగా జరిగింది.. సీనియర్ నటుడు డా: రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేసి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డా: రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ,గతంలో నేను కూడా పోలీస్ పాత్రలు చేశాను. అయితే ఆ పాత్రలు కామెడీ ప్రధానంగా సీరియస్ నెస్ సాగేవి. కానీ ఈ సినిమా కంటెంట్ నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉంది. వరుణ్ సందేశ్ కూడా తన పాత్రలో ఒదిగి పోయి ఉంటాడని భావిస్తున్నానని అన్నారు. అతిథులు తెలంగాణ కల్చరల్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నటుడు శివారెడ్డిలు మాట్లాడుతూ, కంటెంట్ ఉన్న సినిమాలకు నేడు అధిక ప్రాధాన్య ఉంది. ప్రేక్షకులు ఇలాంటి సినిమాలకే బ్రహ్మరథం పడుతున్నారు. పోలీస్ వారు మన భద్రతకు అహర్నిశలు ఎంత శ్రమ పడుతున్నారో మనకు తెలిసిందే. అలాంటి కథను సెలెక్ట్ చేసుకొని తీసిన ఈ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, ఈ కథను డైరెక్టర్ ఆర్యన్ సుభాన్ నాకు చెప్పినప్పుడు కానిస్టేబుల్ క్యారెక్టర్‌ను ఊహించుకొని చెయ్యగలననే నమ్మకం ఏర్పడిన తరువాత ఈ సినిమా చెయ్యడం జరిగింది. తప్పకుండా మా అంచనాలను నిలబెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. చిత్ర నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ, కంటెంట్‌ను నమ్మి ఈ సినిమా చేశాము. ఈ కథకు వరుణ్ సందేశ్ అయితే బాగుంటుందని ఆయన్ని సంప్రదించాము. ఒక వ్యక్తికి అవమానం జరిగినప్పుడు దాని ప్రభావం ఎలా ఉంటుందో అనే అంశానికి సందేశాన్ని మిలితం చేసి ఈ సినిమాను చేశాము అని అన్నారు. దర్శకుడు ఆర్యన్ సుభాన్ మాట్లాడుతూ, మా అందరి కేరీర్‌ను మలుపుతిప్పే చిత్రమవుతుంది. వరుణ్ సందేశ్‌కు కూడా కమ్ బ్యాక్ చిత్రమవుతుంది అన్నారు.



# 'ఘాటి' లో అనుష్క విశ్వరూపం చూపించాం

## - ప్రెస్ మీట్‌లో డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి



**క్వీన్ అనుష్క శెట్టి** మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి. విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యువి క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో డైరెక్టర్ క్రిష్ మాట్లాడుతూ...'కొన్ని కథలు చాలా సహజంగా, పచ్చిగా, పేలడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉంటాయి. ఘాటి అలాంటి కథ. తూర్పు కనుమలు,ఆ పర్వత శ్రేణులు అక్కడ ఉన్న ఒక తీవ్రమైన భావోద్వేగాలు చాలా గట్టి మనుషులు గొప్ప మనస్తత్వాలు ఇవన్నీ కలగలిపి ఒక మంచి కథ చెప్పడానికి ఆస్కారం దొరికింది. నేను స్వీటీ వేదం సినిమాలో కలిసి పనిచేశాం. అందులో సరోజ పాత్రను పోషించింది. ఇప్పుడు ఘాటిలో శీలావతిగా మనందరి ముందుకు రాబోతుంది. ఘాటిలో కూడా చాలా ఎక్స్ట్రార్డినరీగా చేసింది. అనుష్క విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. ఈ కథ రాస్తున్నప్పుడే శీలావతి పాత్ర అనుష్క గారు చేయాలని నేను మా ప్రొడ్యూసర్ రాజీవ్ గారు సాయిబాబా గారు విక్రమ్ ప్రమోద్ వంశీ డిసైడ్ అయ్యాం. దేశిరాజు క్యారెక్టర్‌లో విక్రమ్ ప్రభుని ఊహించుకుని రాశాను. ఆయనే ఈ పాత్రకు తన సొంత వాయిస్‌తో డబ్బింగ్ చెప్పుకున్నారు. జగపతిబాబు గారి క్యారెక్టర్ ఈ సినిమాకి ఒక సూత్రధారిలాగా ఉంటుంది. ఇందులో యాక్షన్ సీక్వెన్స్ చాలా ఎక్సైటింగ్ గా ఉంటాయి. ఘాటి సినిమాలో ఒక అందమైన సోల్ ఉంది. ఆడియన్స్ ఆ సోల్ ని మనసులో నింపుకుని వెళ్తారు. సెప్టెంబర్ 5న తప్పకుండా అందరూ ఈ సినిమాని థియేటర్స్‌లో చూడండి అన్నారు.

యాక్టర్ జగపతిబాబు మాట్లాడుతూ.. అనుష్క స్వీటీ అని మనందరికీ తెలుసు కానీ. ఈ సినిమాల్లో చాలా ఘాటుగా ఉండబోతుంది. అన్ని రియల్ లొకేషన్స్‌లో చేసిన సినిమా ఇది. దాదాపు ఒక 40 నిమిషాలకు రోడ్డు మీదే నిలిచి ఉండిపోయాం. అలాంటి లొకేషన్స్‌లో చేశాం. ఈ సినిమాలో నేను పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నాను. నేను క్రిష్ ఎప్పటినుంచో మంచి ఫ్రెండ్స్. ఫైనల్‌గా ఈ సినిమాతో కలిసి వర్క్ చేసాం. రాజీవ్ నిజాయితీఉన్న ప్రొడ్యూసర్. తన మాటంటేమాటే. ఈ సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అన్నారు.

హీరో విక్రమ్ ప్రభు మాట్లాడుతూ... ఘాటీ నా ఫస్ట్ తెలుగు సినిమా. నాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ క్రిష్ గారికి, నిర్మాత రాజీవ్ గారికి ధన్యవాదాలు. దేశి రాజు క్యారెక్టర్‌లో నన్ను ఊహించుకొని రాయడం చాలా ఆనందాన్నిచ్చింది. రాజీవ్ చాలా జెన్యూన్ ప్రొడ్యూసర్. ఆయన టీం విజన్ చాలా అద్భుతంగా అర్థం చేసుకున్నారు. ఈ టీంలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సెప్టెంబర్ 5న ఘాటీ వస్తుంది. అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.

యాక్టర్ చైతన్య రావు మాట్లాడుతూ.. ఘాటీ సెప్టెంబర్ 5న థియేటర్స్ లోకి రాబోతోంది. మన అందరి ఫేవరెట్ క్వీన్ అనుష్క చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్తో వస్తున్నారు. నాకు క్రిస్ గారు అంటే చాలా ఇష్టం. క్రిస్ గారి సినిమాలో ఒక అద్భుతమైన పాత్ర చేయడం కల నెరవేరినట్లు అయింది. నాక్యారెక్టర్ ని స్క్రీన్ మీద చూసుకున్నప్పుడు చాలా కొత్తగా అనిపించింది. జగపతి బాబు గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది. విక్రమ్ చాలా వైవిధ్యమైన సినిమాల చేస్తుంటారు. సెప్టెంబర్ 5న ఘాటి థియేటర్స్ లోకి వస్తుంది. సినిమా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ కాబోతోంది.

ప్రొడ్యూసర్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. ఘాటిలో అనుష్కని రియల్ క్వీన్‌గా చూస్తారు. విక్రమ్ గారు అద్భుతమైన పర్ఫామెన్స్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో భాగమైన జగపతిబాబు గారికి చైతన్యకి ధన్యవాదాలు. చాలా అద్భుతమైన సినిమా చేశాము. ఈ సినిమాపై మేమందరం చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాము. సెప్టెంబర్ 5న థియేటర్స్‌లో కలుద్దాం అన్నారు.

# 'అమ్మ' పీఠానికి మెదటి మహిళ



'మీ టూ' మొదలు, 'హేమా కమిటీ నివేదిక వరకూ అనేక సంచలనాలకు కేంద్ర బిందువైంది. మలయాళ సినీ పరిశ్రమ ఈ నేపథ్యంలో 'అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్(అమ్మ)'కు శ్వేతా మేనన్ అధ్యక్షురాలు కావడం కీలక పరిణామం. ఓ మహిళ ఈ పీఠాన్ని దక్కించుకోవడం ఇదే మొదటిసారి!

శ్వేత పుట్టింది చండీగఢ్. తండ్రి వైమానిక దళంలో అధికారి, 13 ఏళ్లకే సినిమాల్లోకి అడుగు పెట్టిన శ్వేత, 1991లో 17వ ఏట 'అనస్వరం'లో మమ్ముట్టి సరసన నటించింది. 1994లో ' ఫెమినా మిస్ ఇండియా ఆసియా పసిఫిక్' టైటిల్‌ని గెల్చుకుని జాతీయస్థాయి గుర్తింపు పొందింది. మోడల్ గానూ రాణించింది. మలయాళంతో పాటు హిందీ, తమిళం, తెలుగులో 100కుపైగా సినిమాల్లో నటించింది. మాలీవుడ్‌లో తన సెకండ్ ఇన్నింగ్స్ లో నటిగా విజయవంతమైంది. పాలేరి మాణిక్యం (2009), సాల్ట్ అండ్ పెప్పర్(2011) సినిమాలకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ నటి అవార్డులు అందుకుంది.

**అక్రమాలపై గొంతెత్తి...** అక్రమాలపై గొంతు విప్పడంలోనూ ముందుంటుంది శ్వేత. అనుమతి లేకుండా ఓ ఫార్మా కంపెనీ ప్రచారానికి తన ఫొటో వాడటం పైన 2011లో శ్వేత కేసు పెట్టడంతో ఆ కంపెనీ ఎండీని అరెస్టు చేశారు. ఒక ఎంపి తనతో అసభ్యంగా ప్రవర్తిస్తూ 2013లో పోలీసు కేసు పెట్టారు. సదరు ఎంపి క్షమాపణలు చెప్పడంతో కేసును ఉపసంహరించుకుంది. ఓ యువ నటిపై అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న నటుడు, నిర్మాత విజయ్ బాబుపై 'అమ్మ' నాయకత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ 2022లో 'అమ్మ' అంతర్గత ఫిర్యాదుల కమిటీకి రాజీనామా చేసింది. నటీమణులు మాల పార్వతి, కుకూ పరమేశ్వరన్ ఆమె బాటలోనే నడిచారు. 2017లో నటి భావన మేనన్ కిడ్నాప్, దాడి కేసు సంచలనమైంది. ఆపై పరిశ్రమలో మహిళలపై జరుగుతున్న శస్త్రచికిత్స దాడుల గురించి హేమా కమిటీ నివేదికలో బహిర్గతమైన నేపథనయంలో 'అమ్మ' అధ్యక్షుడిగా మోహన్‌లాల్ సహా కమిటీ సభ్యులంతా ఏడాది కిందట రాజీనామా చేశారు. ఆ నివేదికలోని అంశాల్ని మరింత బలంగా వినిపిస్తూ వచ్చిన శ్వేత.. చివరకు ఎన్నికల బరిలో దిగింది. ఈ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈమెను ప్రత్యర్థులు కొన్ని కేసుల్లో ఇరికించే ప్రయత్నమూ చేశారు. ప్రస్తుతం వాటిపై హైకోర్టు స్టే ఇచ్చింది. నిజ జీవితంలోనూ సవాళ్లూ, ఒత్తిళ్లకు ఎదురు నిలిచి, గెలిచి అసలైన కథానాయిక అనిపించుకుంది శ్వేత. ఈ ఎన్నికల్లో కుకూ ప్రధాన కార్యదర్శిగా, లక్ష్మీ ప్రియ ఉపాధ్యాక్షురాలిగా ఎంపికయ్యారు. దీంతో కొత్త కార్యవర్గంపైన అంచనాలు ఎక్కువయ్యాయి. మహిళలపైన ఉన్న వివక్షను పోగొట్టడం సహా, ఎన్నో సంస్కరణలు వస్తాయని ఆశిస్తున్నారు. ఇక్కడి మార్పు ప్రభావం సినిమా పరిశ్రమపైనే కాదు, అన్ని పరిశ్రమల్లోనూ ఉంటుందనడంలో సందేహం లేదు.

# ఎడారిలో పచ్చదనం కోసం..



**ఎటుచూసినా ఎడారి వేల, చెత్తకుప్పలు, వీధికుక్కలు, భూ ఆక్రమణలు... చూద్దామన్నా పచ్చదనం కనిపించదు. ఇదీ రాజస్థాన్లోని చూరూ, బార్మర్ జిల్లాల ఒకప్పటి పరిస్థితి. ఇప్పుడివి పచ్చదనంతో పల్లవిస్తున్నాయి. ఔషధ వనాలతో ఆరోగ్యాన్ని పండిస్తున్నాయి. పర్యటక ప్రదేశాలుగా కనువిందు చేస్తున్నాయి. కారణం ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్ సవితా దహియా.**

ఈ మార్పు అంత తేలికగా రాలేదు. ఆక్రమణ దారులు బెదిరించారు, చంపుతామన్నారు. కేసులు పెట్టారు. కోర్టులకెళ్లారు. అయినా భయపడ లేదు. స్థానిక రాజకీయ నాయకులు, అధికారులతో ఎంతో చర్చించారు. సమావేశాల్లో పాల్గొన్నారు. వీటన్నింటితోపాటు స్థానికుల మద్దతు, మా సిబ్బంది కఠిన శ్రమతోనే ఇది సాధ్యమైంది. నేనిక్కడకు వచ్చినప్పుడు ఎంతో కలత చెందా. ఎక్కడా చిన్న పార్కు లేకుండా ఎలా బతికేస్తున్నారా అనిపించింది. ఏం చేయాలో తోచలేదు. సరిగ్గా అప్పుడే కోవిడ్ రావడం కలిసొచ్చింది. జనసంచారం తగ్గడంతో పనులు త్వరగా పూర్తయ్యాయి. పైగా ఆ సమయంలో గర్భిణిని కూడా. ప్రసూతి సెలవుల్లోనూ పనుల్ని పర్యవేక్షి స్తుండేదాన్ని అంటారు సవిత.

రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన సవిత... డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా చూరూ జిల్లాకు వెళ్లడంతోనే చెత్తనీ, అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి నిధులు తెప్పించారు. ఔషధ మొక్కలతో పార్కులు, నర్సరీలు ఏర్పాటు చేశారు. పిల్లల్లో మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉండటం గుర్తించి, వైద్యశాఖ నర్సరీల్లో మునగ మొక్కల్ని పెంచారు. సబ్సిడీమీద ఒక్క రూపాయికే వాటిని అందించారు. ఆహారంలో ఈ మొక్క గురించి పాంప్లెట్లద్వారా అవగాహన కల్పించారు. పాఠశాలల్లో వర్క్‌షాపులు నిర్వహించడం ద్వారా పిల్లలు ఈ మొక్కలు నాటేలా చేశారు. ఎందుకంటే ఎడారి ప్రాంతమైన చూరూలో మునగ సాధారణంగా పెరగదు. అందుకే దాని సంరక్షణ కోసం ఎన్నో చర్యలు. ఫలితం ఇప్పుడు చాలా చోట్ల ఇవి కనిపిస్తున్నాయి. మునగనే కాదు, ఎన్నో మందుల పార్కుల్ని ఏర్పాటుచేశారు. దాంతో పర్యటకుల సంఖ్య పెరిగింది. అందుకే చూరూ జిల్లాకి ఆ రాష్ట్ర



ప్రభుత్వం నుంచి సీఎం ఎక్సలెన్స్ అవార్డు లభించింది. సవిత చూరూ నుంచి బదిలీమీద బార్మర్ జిల్లాకు వెళ్లాక, బంజరుగా ఉన్న వేల ఎకరాల్ని గడ్డి నేలలుగా మార్చారు. నీటిగుంటలు తవ్వించారు. ఫెన్సింగ్ వేయించి, సీడ్ బాల్స్ ద్వారా స్థానిక వృక్షజాతులు పెరిగేలా చేసి కృష్ణజింకలు, చింకారాలకు ఆవాసాన్ని కల్పించారు. పచ్చదనం, జలసిరితో కూడిన ఈ నేల ఇప్పుడు ప్రజల జీవనానికి ఆధారంగా మారింది. ఎడారి పట్టణాల్లో వెలసిన పచ్చని పార్కుల్లో పిల్లలు ఆడుకోవడం, మహిళలు యోగా చేయడం, పెద్దవాళ్లు కబుర్లు చెప్పుకోవడం చూస్తుంటే నాకెంతో ఆనందంగా అనిపిస్తుంది. వ్యవస్థలూ వ్యక్తుల నుంచి వ్యతిరేకత ఎదురైనా ప్రజల సహకారంతో ముందుకెళ్లా. ముందు మనమీద మనకు నమ్మకం ఉండాలి. అప్పుడే సాధించగలం' అంటోన్న ఈ ఫారెస్ట్ ఆఫీసర్ కృషి ప్రశంసనీయమే కదూ!

# హాల్వాసన్



**కావలసినవి.** చిక్కటిపాలు అరలీటరు, పంచదార అరకప్పు, గోధుమ రవ్వ, నెయ్యి రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున, గోండ్ (ఇడిబుల్‌గం) రెండు టీస్పూన్లు, మీగడ టీస్పూన్, యాలకుల పొడి పావు టీస్పూన్, జాజికాయ పొడి చిటికెడు, బాదం తురుము రెండు టేబుల్ స్పూన్లు,

**తయారీ:** వెడల్పు గిన్నెలో పాలుపోసి తక్కువ మంట మీద మరిగించాలి. మరో పాత్రలో నెయ్యి వేడిచేసి.. గోండ్ వేయించి దాన్ని పాలల్లో కలపాలి. అదే కడాయిలోని మిగిలిన నెయ్యిలో గోధుమరవ్వను వేయించి పాలల్లో కలపాలి. తర్వాత మీగడ జతచేయాలి. కడాయిలో పంచదార వేడి చేసి పాకం వచ్చిన తర్వాత పాలల్లో వేసి.. ఉండలు కట్టకుండా కలపాలి. ఇప్పుడు యాలకులు, జాజికాయ పొడులను జతచేసి.. మిశ్ర మం గట్టిపడే వరకూ గరిటెతో తిప్పు తుండాలి. చివరగా బాదం తురుము వేసి నెయ్యి రాసిన ప్లేటు లోకి మిశ్ర మాన్ని తీసుకోవాలి. అర చేతులకు నెయ్యి రాసుకుని ఉండి మధ్యలో చిన్న గుంట పడేలా ఉంది. బాదం పలుకులు వేసుకుంటే హాల్వాసన్ సిద్ధం. పండగలు, విందు భోజ నాల్లో ఈ స్వీటును ఎంతో ఇష్టంగా అరగిస్తారట గుజరాతీయులు.

# మనసు తేలికకోసం..

**ఒత్తిడి మనకు పెద్దగా పరిచయం** అక్కర్లేని పేరు. నిద్రలేమి, నెలసరి సమస్యలు.. ఇలా దీనికి కారణాలు బోలెడు. కాబట్టి ఓ రెండు నిమిషాలు ఇలా చేస్తే అది కాస్తా మటుమాయం.



కళ్లు మూసుకొని దీర్ఘశ్వాస తీసుకొని వీలైనంత సేపు అలా పట్టి ఉంచండి. తర్వాత నెమ్మదిగా వదలాలి. ఈ ప్రక్రియలో ధ్యాసంతా పొట్ట మీదే ఉంచాలి. ఇలా రెండు నిమిషాలు చేస్తే చాలు. ఈ

మనసు లగ్నం కావట్లేదనిపిస్తే ఎదురుగా ఉన్న వస్తువుని తదేకంగా చూడండి. కళ్లు మూసి మరోసారి ప్రయత్నించండి. మనసు తేలిక పడుతుంది.

. ఇతరులతో పోలిస్తే మీరు ఏ అంశాల్లో మెరుగ్గా ఉన్నారో ఆలోచించుకోండి. కనీసం మూడు అంశాలను ఎతు క్కున్నా చాలు. జీవితం మీద సానుకూల భావన ఏర్పడు తుంది. ఇదీ ఒత్తిడిని తగ్గించే మార్గమే. పోనీ.. మంచి జోక్‌ని గుర్తుతెచ్చుకోండి. లేదా చదవండి.. నవ్వు ఎండార్ఫిన్లను విడుదల చేసి, ఒత్తిడిని దూరం చేస్తుంది. మొక్కల మధ్యకు వెళ్లండి. ఆ పూల సువాసనలు చూడండి. ఆ అవకాశం లేకపోతే ఆరోమా ఆయిల్‌ని వాసన చూడ టమో.. సెంటెడ్ క్యాండిల్‌ని వెలిగించడమో చేసినా చాలు. ఇవి మనసును తేలికపరిచి ఒత్తిడిని తగ్గిస్తాయి.

వ్యాయామం నాడీ వ్యవస్థను నెమ్మ దింపజేసి.. ఒత్తిడిని దూరం చేస్తుంది.

. చిన్న చిన్న వార్మప్‌లు.. నడుముపై చేతులు ఉంచి వెనక్కి వాలడం, జాగింగ్, స్ట్రెచింగ్ వంటివీ చేయొచ్చు. వేగంగా కొద్దిసేపు నడిచినా ఫలితం కనిపిస్తుంది. . నేల మీద కాళ్లు ముడుచుకొని కూర్చోవాలి. కళ్లు మూసి, మీరు ప్రేమించే వాళ్లనో.. మీకు ఆనందాన్నిచ్చే సందర్భాన్నో గుర్తు తెచ్చుకోండి. మనసు ఇతర అంశాల మీదకి మళ్లి ఆందోళన దూరం అవుతుంది.


# ముక్కలుగా చేసే..

గింజలు తీస్తుంది, ముక్కలు కోస్తుంది ! మామిడిపండు, పుచ్చకాయ, యాపిల్ లాంటి పండ్లు మహా రుచిగా ఉండి, ఊరిస్తుంటాయి. కానీ



గింజలు తీయడం, ముక్కలు కోయడం కాస్త విసుగ్గానే ఉంటుంది. ఆ శ్రమను తగ్గించడానికి రకరకాల ఫ్రూట్ స్లైసర్లు వచ్చాయి. వీటిని కనుక కొనుక్కున్నామంటే పని చాలా సులవైపోతుంది.

# అనుబంధాల పొదరింటికి..



చాలామందికి మూగజీవులంటే ఇష్టమే. వాటితో సరదాగా ఆడుకుంటూ, చూస్తూ ఆనందిస్తారు. కూడా. అయితే, కొందరు జంతుప్రేమికులు మాత్రం... ఇంకాస్త ముందుకెళ్లి ఇంట్లోని



వస్తువులూ వాటి రూపంలోనే ఉండాలని కోరుకుంటున్నారు. అలా వచ్చిందే యానిమల్ థీమ్ ఇంటీరియర్. అందులో ఒకటే ఈ జిరాఫీ థీమ్ కూడా. సోఫా, పోపుల డబ్బా పెట్టుకునే స్టాండ్, వంటపాత్రల మీద, సింక్ ఫాసెట్, గడియారం, వాటర్ బాటిల్... ఇలా ఇంట్లోని ప్రతి వస్తువులోనూ ఆ రూపం కళ్లముందు ఉండేలా చూసుకుంటున్నారు. వాటి ప్రత్యేకమైన రూపాన్ని చూస్తూ ప్రకృతితో కనెక్ట్ అయి ఉన్నామన్న ఫీలింగ్ పొందుతున్నారు. అంతేకాదు, చైనీయుల ఫెంగ్ షుయ్ సంప్రదాయం ప్రకారం...

ఈ జిరాఫీ రూపం సంపదనూ, అదృష్టాన్నీ, అవకాశాలనూ తెస్తుందనీ, సానుకూల ఆలోచనలు కలిగిస్తుందనీ, బంధాలను బలపరుస్తుందనీ నమ్మకమూ ఉందట. అందుకే, కేవలం ఇళ్లు, కార్యాలయాల అలంకరణలో దీన్ని భాగం చేయడమేకాదు పెళ్లిళ్ల గృహప్రవేశాలు.... లాంటి శుభకార్యాలకు బహుమతిగానూ, చాలామంది అందిస్తారు.



















మరి ఈ జిరాఫీ థీమ్ వస్తువులు మీకెలా అనిపించాయి?

# పూజగది ఎలా ఉండాలంటే..


వాస్తు శాస్త్రం ప్రకారం పూజగదిని ఈశాన్యం ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల ధ్యానం, పూజ ప్రశాంతంగా సాగిపోతాయి. అంతేకాదు, ఇంట్లో ప్రసరించే సూర్యుడి లేలేత కిరణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎక్కువ స్థలం ఉన్నట్లయితే ఇంటి మధ్యలో పూజగది ఉంటే మంచిది. స్థలం లేకుంటే వంటింట్లోనే ఈశాన్య దిక్కున పూజమందిరాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఎట్టి పరిస్థితిలో పడక గదుల్లో పూజగది ఉండకూడదు. పూజ గదిలో విగ్రహాలను ఈశాన్యం, తూర్పు లేదా పడమర దిక్కున పెట్టుకోవచ్చు. దీనికి కారణం సూర్యకిరణాలు ఉదయం ఈశాన్య, తూర్పు దిక్కు నుంచి, సాయంత్రం పడమర నుంచి ప్రసరిస్తాయి. ఇవి విగ్రహాల మీద పడి భక్తి భావనను పెంపొందిస్తాయి. విగ్రహాలను ఉత్తర దిక్కున పెడితే ప్రార్థించేవారు దక్షి ణ ముఖంగా కూర్చోవలసివస్తుంది. ఇది వాస్తు రీత్యా మంచిది కాదు. దేవుడిగదిలో విరిగిన , చిరిగిన చిత్రపటాలు ఉండకూడదు. అలాగే విగ్రహాలను ఒకదానికి ఎదురుగా ఒకటి పెట్టకూడదు. మనం విగ్రహాలను చూస్తూ పూజించాలే గానీ అవి ఒకదాన్ని మరొకటి చూస్తున్నట్టుగా ఉంచకూడదు. పూజ సామాన్లను గదిలో ఆగ్నేయ దిక్కున భద్రపరచాలి. అవి విగ్రహాలకు, మనం కూర్చోవడానికి అడ్డు లేకుండా చూడాలి. కొందరు మరణించిన పెద్దల మీది గౌరవ భావంతో వారి పాటలు పూజగదిలో పెడతారు. అది సరి కాదు. అవి మన దృష్టిని మరల్చడమే కాదు.. బాధాకరమైన విషయాలను జ్ఞాపకం తెచ్చే అవకాశం ఉంది. పూజగదిలో బంగారం, ధనం లాంటి విలువైన వస్తువులను దాచకూడదు. పూజగదిని సదా పరిశుభ్రంగా ఉంచాలి. ఆ గదికి తలుపులున్న ద్వారానే రెండు ఎంచుకోవాలి. గడప తప్పనిసరిగా ఉండాలి. గోడలకు తెలుపు, లేత పసుపు, లేతనీలం లాంటి లేత రంగులే వేయాలి. దీని వల్ల మనసు ప్రశాంతంగా ఉండి దేవుడిపై దృష్టి నిలుస్తుంది.



ఆధ్యాత్మికం

# స్క్రీన్‌టైమ్ పెరిగితే..

**గత రెండు దశాబ్దాలుగా** భారత్ బాలికల్లో రుతుచక్రం మొదలయ్యే వయసు తగ్గుతూ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణాలుగా... తీసుకునే ఆహారం, దానితో పాటు జీవనశైలి మార్పులను చెబుతున్నారు. ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను తీసుకుంటాం. వాటిలో కొవ్వులూ, కార్బోహైడ్రేట్లూ అధిక మోతాదులో ఉన్నాయి. పైగా వాటిలో నిల్వ వేసేందుకు, రుచి, రంగు కోసం... మోనో సోడియం గ్లుటామెట్, సోడియం నైట్రేట్, కృత్రిమ గులు, గవార్ గం, సోడియం బెంజోయెట్... లాంటి అనేక పదార్థాలను జోడిస్తుంటారు. ఇవన్నీ ఇవిధ రకాలుగా ఆరోగ్యానికి హానిచేసేవే పాటు ఎక్కువ సమయం కదలకుండా స్క్రీన్ సూస్తూ కూర్చొని ఉంటూ ఆటలకు తగినంత సమయం కేటాయించడం లేదు. స్క్రీన్ని ఎక్కువగా వాడటంవల్ల హార్మోన్లలో మార్పులు ఉన్నాయి. ఆహారంలో హార్మోన్లు ఇచ్చి పెంచిన పౌల్ట్రీ త్పత్తులు, పాలు... ఇవన్నీ రుతుచక్రం చాలా చిన్న వయసు లోనే మొదలయ్యేం దుకు సహాయపడు తున్నాయి. కొందరిలో తొమ్మిదే ళ్లకే ఇంకొందరిలో అంతకంటే రెండుమూడేళ్ల ముందే శరీరంలో దార్పులు వస్తున్నాయి. వాతావరణ కాలుష్యం కూడా హార్మోన్ల అసమతుల్యతకు రణమవుతున్నాయి. ముడి పదార్థాలతో తాజా ఆహారాన్ని తీసుకోవడం, రోజూ నంత వ్యాయామం చేసేలా చూడటం వంటి జీవనశైలి మార్పులతో శరీరంలోని ముందస్తు కార్పుల్ని ఆలస్యం చేయొచ్చని నిపుణులు ఎక్కువగా చేస్తారు.



# జుట్టుని మెరిపించే మందారం !

నల్లగా, ఒత్తుగా, పొడవుగా ఉంటే... శిరోజాలంటే మీకూ ఇష్టమేనా? అయితే, మందారంతో జుట్టుకి పోషణ అందించండి. అదెలాగంటారా? మందార పువ్వులు, ఆకుల్లో అమైనో ఆమ్లాలు, వివిధ రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కుదుళ్లను బలంగా మార్చి జుట్టు ఎదుగుదలను ప్రోత్స హి స్తాయి. జుట్టు పొడిబారి నిర్జీవంగా కనిపిస్తోందా? అయితే, మందార పూలను మెత్తగా రుబ్బి దానికి కాస్త పెరుగు కలిపి తలకు రాయండి. అరగంటయ్యాక ఈ ప్యాక్‌ను కడిగేస్తే సరి. చివర్లు చిట్లకుండా ఉంటాయి. జుట్టు రాలడమూ తగ్గుతుంది. మందార పువ్వుల్ని పేస్ట్ చేసి అందులో కాస్త నిమ్మరసం పిండి... తలకు రాయండి. ఈ ప్యాక్ సహజంగా కురులకు తేమను అందించడమే కాదు.. చుండ్రునీ తగ్గుతుంది. త్వరగా తెల్ల జుట్టు రాకుండా ఉం టుంది. ఇందులో ఉండే పోషకాలు యూవీ కిరణాల నుంచి రక్షణ కల్పిస్తాయి.



ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# నం.వన్ భారత్


## 50 స్వర్ణాలతో ముగిసిన టోర్నీ




**న్యూఢిల్లీ:** అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత్ 50 బంగారు పతకాలతో ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025ను ముగించింది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ జట్టు చారిత్రాత్మక అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసి 50 స్వర్ణాలతో అగ్రస్థానంలో నిలిచింది. రైఫిల్, పిస్టల్ మరియు షాట్‌గన్ విభాగాలలో జరిగిన 15 ఒలింపిక్ ఈవెంట్లలో సీనియర్ భారత్ షూటర్లు 6 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. 8 స్వర్ణాలను గెలుచుకున్న ప్రపంచ పవర్‌హౌస్ చైనా కంటే వెనుకబడి, ఆతిథ్య కజకిస్తాన్ మరొకటి కైవసం చేసుకుంది. 100 పతకాల మార్కుకు కొద్ది దూరంలోనే భారత్ ఛాంపియన్‌షిప్‌ను ముగించింది. 26 రజతాలు, 23 కాంస్యాలతో సహా 50 స్వర్ణాలతో. ఆతిథ్య జట్టు 70 పతకాలు, 21 స్వర్ణాలతో రెండవ స్థానంలో ఉండగా, చైనా 15 స్వర్ణాలు, 37 పతకాలతో మొత్తం మీద 3వ స్థానంలో ఉంది. సీనియర్ మహిళల ఎయిర్ రైఫిల్‌లో రెండుసార్లు ఒలింపియన్ ఎలవెనిల్ వలరివన్ ఆసియా రికార్డు స్కోరుతో రెండవ ఆసియా కిరీటాన్ని (ఆమె మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్ బాబుటాతో కలిసి డబుల్ స్వర్ణం గెలుచుకుంది). మహిళల ట్రాప్‌లో భారత్ తరపున నీరూ దండా తొలి స్వర్ణం, మహిళల 50 రైఫిల్ 3పొజిషన్‌లో సిఫ్ట్ కౌర్ స్రామా తొలి ఆసియా టైటిల్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ పురుషుల టైటిల్ కైవసం, భారత్ జూనియర్ షూటర్లు కూడా అన్ని ఒలింపిక్ ఈవెంట్లలో పూర్తిగా ఆధిపత్యం చెలాయించడం ద్వారా దేశ ప్రతిభ ప్రదర్శించారు. ఒక్కొక్కరు 10 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు.

# యుఎస్ ఓపెన్‌లో యుకీ జోడీ ముందుకు

## బోపన్న ద్వయం నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ-మైఖేల్ వీనస్ ముందుకు దూసుకుపోగా, బోపన్న-కాడే ద్వయం మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. న్యూయార్క్‌లో ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్‌లో భారత జోడీ యుకీ భాంబ్రీ, అతని భాగస్వామి న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ ఆధిపత్య విజయంతో రెండో రౌండ్‌కు దూసుకెళ్లగా, రోహన్ బోపన్న-అర్జున్ కాదే తొలి రౌండ్‌లో పరాజయంతో నిష్క్రమించింది. 14వ సీడ్ గా బరిలోకి దిగిన భాంబ్రి, వీనస్ జంట కేవలం గంట వ్యవధిలోనే అమెరికన్లు మార్కోస్ గిరోన్, లెర్నర్ టియన్ లను 6-0, 6-3 తేడాతో ఓడించారు. రెండో సెట్ ప్రారంభంలోనే బ్రేక్ చేసి మ్యాచ్‌ను ముగించారు. మొత్తం మూడు ఆటలను మాత్రమే కోల్పోయారు. ఇక మొనాకోకు చెందిన రొమైన్ ఆర్నియోడోతో జతకట్టిన బోపన్న, అమెరికన్ ద్వయం రాబర్ట్ క్యాష్-జేమ్స్ ట్రేసీ చేతిలో 4-6, 3-6 తేడాతో ఓడిపోయాడు. దాదాపు 65 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో క్యాష్-ట్రేసీ కీలకమైన బ్రేక్ పాయింట్లను సద్వినియోగం చేసుకుని ఓటమిని చవిచూశారు. యుఎస్ ఓపెన్‌లో అరంగేట్రం చేసిన అర్జున్ కాడే, ఈక్వెడార్‌కు చెందిన డియెగో హిడాల్గోతో కలిసి రెండవ సీడ్ జంట మేట్ పావిక్-మార్సెలో అరెవాలోతో తలపడ్డారు. కాడే-హిడాల్గో మొదటి సెట్‌ను 7-5తో కైవసం చేసుకున్నా, చివరికి హోరాహోరీ పోరులో 7-5, 6-7(4), 36తో ఓడిపోయారు. దీంతో పురుషుల డబుల్స్‌లో భాంబ్రీ-వీనస్ మాత్రమే భారత్ తరపున టోర్నీలో కొనసాగుతున్నారు.

ముక్కోణపు టి20లో..

# పాక్ రెండో విజయం

## 31 రన్స్ తేడాతో యుఎఇ చిత్తు

**న్యూఢిల్లీ:** ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ అదరగొడుతోంది. ఈ ట్రైసిరీస్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌ను చిత్తు చేసిన పాకిస్థాన్ ఇప్పుడు రెండో మ్యాచ్‌లో యుఎఇ పై అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. షార్జాలో ఆదివారం




జరిగిన మ్యాచ్‌లో యూఏఈపై 31 పరుగుల తేడాతో మెన్ ఇన్ గ్రీన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. పాక్ బ్యాటర్లలో సైమ్ ఆయుబ్ (38 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 69), హసన్ నవాజ్ (26 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 56) మెరుపు హాఫ్ సెంచరీలతో మెరిశారు. వారితో మహ్మద్ నవాజ్ (25), అష్రాఫ్ (16) రాణించారు. యూఏఈ బౌలర్లలో సిద్దుఖీ, నగీర్ ఖాన్ తలా 3 వికెట్లు పడగొట్టగా, హైదర్ అలీ 2 వికెట్లు సాధించాడు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగులకే పరిమితమైంది. యూఏఈ బ్యాటర్ ఆసిఫ్ ఖాన్ (35 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 77) మెరుపు ఇన్నింగ్స్ ఆడినప్పటికీ తన జట్టును గెలిపించుకోలేకపోయాడు. అతడితో మహ్మద్ వసీం (33) ఫర్వాలేదనిపించాడు. మిగిలిన బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. పాక్ బౌలర్లలో హసన్ అలీ 3 వికెట్లు పడగొట్టగా, నవాజ్ 2, మిర్జా, ఆయూబ్ ఒక్క వికెట్ సాధించారు.





# రాజస్థాన్ రాయల్స్‌లో అంతర్గత విభేదాలు

## మూడు గ్రూపులుగా టీం.. కెప్టెన్ రేసులో ముగ్గురు

**న్యూఢిల్లీ:** రాజస్థాన్ రాయల్స్ జట్టులో అంతర్గత గొడవలు మొదలయ్యాయి. ఈ సీజన్‌లో రాజస్థాన్ పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉంది. తాజాగా రాహుల్ ద్రవిడ్ రాజీనామా చేయడం దాని వెనుక ఈ విభేదాలే కారణాలు అని తెలుస్తోంది. జట్టు మూడు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూపు ఒక్కో ఆటగాడిని కెప్టెన్‌గా చేయాలని పట్టుదలతో ఉన్నాయి. ద్రావిడ్ కోచింగ్‌లో భారత టీ20 ప్రపంచ కప్ 2024 గెలిచింది. దాని తర్వాత రాజస్థాన్ తమ మాజీకెప్టెన్ ద్రావిడ్‌ను హెడ్ కోచ్‌గా నియమించింది. కానీ ఒక సీజన్ తర్వాతే ఆయన జట్టు నుంచి తప్పుకున్నాడు. ద్రావిడ్‌కు మరో పోస్ట్ ఆఫర్ చేసినా ఆయన అంగీకరించలేదు. ఫ్రాంచైజీ తీసుకుంటున్న నిర్ణయాలు ద్రావిడ్ ప్రణాళికలకు భిన్నంగా ఉండటం వల్ల ఆయన రాజీనామా చేశాడు. ఈ నేపథ్యంలో జట్టు 3గ్రూపులుగా విడిపోయింది. రాజస్థాన్ రాయల్స్‌లో ఒక గ్రూపు రియాన్ పరాగ్‌ను కెప్టెన్‌గా చేయాలనుకుంటోంది. పరాగ్ గతంలో సంజు శాంసన్ లేని సమయంలో, ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉన్నప్పుడు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 23 ఏళ్ల పరాగ్ 2019 నుంచి ఈ జట్టులో ఉన్నాడు. ఆయన ఇప్పటివరకు 84 మ్యాచ్‌లలో 1566 పరుగులు చేశాడు. అలాగే మరో గ్రూప్ యశస్వి జైస్వాల్‌ను కెప్టెన్‌గా చేయాలని యత్నాలు చేస్తోంది. యశస్వి తన మొదటి సీజన్ నుంచే రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతున్నాడు. అతను 2020లో తొలిసారి ఈ జట్టు కోసం ఆడాడు. యువకుడైన జైస్వాల్ ప్రస్తుతం భారత జట్టులో కూడా ఉన్నాడు. ఆసియా కప్ జట్టులో అతను రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్నాడు. కాగా మూడో గ్రూపు సంజు శాంసన్ కెప్టెన్‌గా కొనసాగాలని కోరుకుంటోంది. కొన్ని రోజుల క్రితం, రాజస్థాన్ శాంసన్‌ను ట్రేడ్ డీల్ ద్వారా మార్చవచ్చని చర్చ జరిగింది. 30 ఏళ్ల సంజు శాంసన్ 2013లో రాజస్థాన్ రాయల్స్‌కు తొలిసారిగా ఆడాడు. ఆ తర్వాత 2015 వరకు ఈ జట్టులో ఉన్నాడు. 2016, 2017లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడి, 2018లో తిరిగి రాజస్థాన్‌కు వచ్చాడు. అప్పటి నుంచి ఈ జట్టులో కొనసాగుతూ ఇప్పుడు కెప్టెన్‌గా కూడా ఉన్నాడు. ఐపీఎల్‌లో మొత్తం 177 మ్యాచ్‌లలో 4704 పరుగులు చేశాడు. సంజు ఆసియా కప్ 2025 జట్టులో కూడా ఉన్నాడు.

మహిళల ఛాంపియన్‌షిప్..

# భారత్ ఓటమి

## 3-4 తేడాతో బంగ్లాదేశ్ విక్టరీ




**న్యూఢిల్లీ:** శాప్ అండర్ 17 మహిళల ఛాంపియన్‌షిప్-2025 చివరి పూల్ మ్యాచ్‌లో బాంగ్లాదేశ్ చేతిలో భారత్ ఓటమి చెందింది. భూటాన్‌లోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ చివరి మ్యాచ్‌లో అత్యధిక స్కోరింగ్ థ్రిల్లర్‌లో బంగ్లాదేశ్ కొన్ని గోల్స్‌తో మూడుసార్లు ఆధిక్యంలోకి దూసుకెళ్లడంతో భారత్ మహిళా జట్టు తన ప్రచారాన్ని నిరాశాజనకంగా ముగించింది. ఈ ఓటమి చెందినప్పటికీ, యంగ్ టైగ్రెస్సెస్ ఛాంపియన్లుగా నిలిచారు. చేతిలో ఒక ఆట ఉండగానే పాయింట్ల పట్టికలో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించారు. యంగ్ టైగ్రెస్సెస్ 5 విజయాలు, ఒక ఓటమితో మహిళల ఛాంపియన్‌షిప్‌ను ముగించింది. తొలి నిమిషంలోనే బంగ్లాదేశ్ తరపున పూర్ణిమ మర్మ గోల్ చేయగా, 9వ నిమిషంలో భారత క్రీడాకారిణి అనుష్క కుమారి గోల్ చేసి స్కోరును సమం చేసింది. అయితే, 34వ నిమిషంలో ఆల్పి అక్టర్ గోల్ చేయడంతో బంగ్లాదేశ్ తిరిగి ఆధిక్యాన్ని పొందింది. 48వ నిమిషంలో సొరవి ప్రీతి దాన్ని పొడిగించింది. 65వ నిమిషంలో ప్రీతికా బర్మన్ చేసిన స్ట్రైక్‌తో భారత్ గోల్‌ను వెనక్కి తీసుకుంది. 89వ నిమిషంలో కెప్టెన్ జులన్ గోల్‌ను సమం చేసింది. ఇంజురీ టైమ్‌లో ప్రీతి మళ్ళీ గోల్ చేసి బంగ్లాదేశ్‌కు విజయాన్ని అందించింది. ఆట ప్రారంభమైన 30 సెకన్లలోనే పూర్ణిమ మర్మ ద్వారా బంగ్లాదేశ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దీనితో యంగ్ టైగ్రెస్సెస్ మొత్తం టోర్నమెంట్‌లో ఇచ్చిన తొలి గోల్‌గా నిలిచింది. క్లీన్ షీట్ పరంపర ముగిసింది.

# 77 యాప్‌లు ప్లేస్టోర్‌నుంచి తొలగింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** యాప్‌లపై టెక్ దిగ్గజం గూగుల్ కొరడా ఝుళిపించింది. ప్లే స్టోర్ నుంచి గూగుల్ 77 ప్రమాదకరమైన యాప్‌లను తొలగించింది. ఆయా యాప్‌లన్నీ వినియోగదారుల భద్రత, గోప్యతకు ముప్పుగా మారడంతో చర్యలు తీసుకున్నది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం గూగుల్ గత సంవత్సరం సుమారు 40 లక్షల యాప్‌లను తొలగించింది. సగటున ప్రతిరోజూ 11వేల యాప్‌లను ప్లే స్టోర్ నుంచి వేటు వేసింది. ఈ యాప్‌లలో సగానికి పైగా డేటా భద్రత, గోప్యతా నియమాలను ఉల్లంఘిస్తున్నాయని తేలింది.




గూగుల్ గత సంవత్సరం యాప్ ప్లబిషింగ్‌కు సంబంధించి కఠినమైన నియమాలను అమలు చేస్తామని ప్రకటించింది. 2024 ప్రారంభం నాటికి ప్లే స్టోర్‌లో ఉన్న దాదాపు సగం యాప్‌లను తొలగించారు. గూగుల్ ఈ సంవత్సరం దాదాపు 1.55 లక్షల డెవలపర్ ఖాతాలను కూడా బ్లాక్ చేసింది. కంపెనీ ఇప్పుడు సైడ్‌లోడెడ్ యాప్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు ధ్రువీకరణ ప్రక్రియ ద్వారా వెళ్లే డెవలపర్స్ మాత్రమే యాప్‌లను ప్రచురించగలరని గూగుల్ చెబుతోంది. ప్లే స్టోర్ నుంచి ఒక యాప్ అదృశ్యమైతే.. దాని అర్థం డెవలపర్ దాన్ని తీసివేసినట్లు కాదని గూగుల్ వినియోగదారులను హెచ్చరించింది. తరచుగా దీనికి కారణం యాప్ నియమాలను ఉల్లంఘించడమే. అయితే, యాప్ ఇప్పటికే మీ ఫోన్‌లో ఉంటే అది రన్ అవుతూనే ఉంటుంది. కానీ, అది మరిన్ని అప్‌డేట్‌లు అందవు. యాప్ ప్రమాదకరమైనదిగా తేలితే ప్లే ప్రొటెక్ట్ దాన్ని అన్ ఇన్‌స్టాల్ చేయమని హెచ్చరిస్తుంది అని కంపెనీ స్పష్టం చేసింది. కానీ, అలాంటి హెచ్చరిక రాకపోతే యాప్ భద్రతా అప్‌డేట్స్ లేకుండా మీ ఫోన్‌లో రన్ అవుతూనే ఉంటుంది. యూజర్లు సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకునే అలవాటును మార్చుకోవాలని నిపుణులు అంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అనుమతులను తనిఖీ చేయాలని రివ్యూలను చదవాలని విశ్వసనీయ డెవలపర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ నివేదిక పేర్కొంది. ఆండ్రాయిడ్ అథారిటీ నివేదిక ప్రకారం గూగుల్ ప్రస్తుతం ప్లే స్టోర్‌లో కొత్త 'అన్‌ఇన్‌స్టాల్' బటన్‌ను పరీక్షిస్తోంది. ఈ బటన్ యాప్ పేజీలో నేరుగా కనిపిస్తుంది. తద్వారా వినియోగదారులు తమ ఫోన్ నుంచి ఏదైనా యాప్‌ను వెంటనే తీసివేసే అవకాశం ఉంది.

కార్పొరేట్ విదేశీ వాణిజ్య

# రుణాల్లో భారీ పెరుగుదల




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** విదేశీ వాణిజ్య రుణాలపరంగా ఈ ఏడాది ఏప్రిల్‌జూన్‌త్రైమాసికంలో గణనీయంగా పెరిగాయి. గత ఏడాది ఇదేకాలంలో 2.8 బిలియన్ డాలర్లు రుణం పొందితే ఈసారి ఇదేకాలంలో ఏకంగా 4.6 బిలియన్ డాలర్లకుపెరిగాయి. భారతీయ రిజర్వ్‌బ్యాంకు ఈ డేటా వివరాలను విడుదలచేసింది. ఆగస్టు నెలవారీ బులిటెన్‌లో విదేశీ వాణిజ్యరుణాలకు రిజిస్ట్రేషన్లు మెరుగుపడుతున్నట్లు తెలిపింది. అయితే తొలిత్రైమాసికంలో రిజిస్ట్రేషన్‌లు మందగించాయి. గత ఏడాది 11.1 బిలియన్ డాలర్ల రుణాలకోసం దరఖాస్తులు వస్తే ఈ ఏడాది 9.1 బిలియన్ డాలర్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు వచ్చినట్లు తెలిపింది. నికర రాబడులు రుణాలు పెరుగుతున్నా రిజిస్ట్రేషన్లలో స్వల్పంగా మందగమనం ఉన్నట్లు గుర్తించింది. ఐపిఒలు, విదేశీ వాణిజ్యరుణాలరూపంలో మూలధన వ్యయాలకోసం ముందు త్రైమాసికంతో పోలిస్తే కొంత తగ్గాయి. నెలవారీ ధోరణులు చూస్తే క్రమానుగతంగా జూన్‌లో కేవలం 0.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అదే మేనెలలో 1.2 బిలియన్ డాలర్లని ఆర్బీఐ తెలిపింది. ఇసిబి రిజిస్ట్రేషన్లపరంగా జూన్‌లో 3.5 బిలియన్ డాలర్లకు చేరాయి. అదే మేనెలలో 2.7 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నట్లు తెలిపింది. ఇక విదేశీ వాణిజ్యరుణాలకోసం 113 రిజిస్ట్రేషన్లు జూన్‌లో వచ్చాయి. వీటి విలువలుమొత్తం 3.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అదే మేనెలలో 2.73 బిలియన్ డాలర్లకోసం 100 రిజిస్ట్రేషన్లురాగా జూన్2024లో 2.81 బిలియన్‌డాలర్ల విలువైన 125 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్బీఐ విశ్లేషించింది. ఉత్పత్తిరంగానిక ఇచెందిన కార్పొరేట్ సంస్థలు 954 మిలియన్ డాలర్లమేర జూన్‌లో దరఖాస్తులుచేసాయి. అదే గత ఏడాది జూన్‌లో 603 మిలియన్ డాలర్ల విలువైన రిజిస్ట్రేషన్లు మాత్రమే ఉన్నాయి. సేవలరంగంలో ఇసీబిలకోసం 19 మిలియన్ డాలర్ల దరఖాస్తులు వచ్చాయి. అదే గత ఏడాదిజూన్‌లో 37 మిలియన్ డాలర్లతోపోలిస్తే తగ్గాయి. ఇక ఎన్బీఎఫ్‌సిలు గత ఏడాది 1.31 బిలియన్ డాలర్లకు రిజిస్ట్రేషన్‌లు దాఖలుచేస్తే ఈసారి కేవలం 682 మిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఫిక్సెడ్ వడ్డీరేట్ల పరిధి శూన్యశాతంనుంచి 10.50శాతంవరకూ ఉన్నాయి. అదే గత ఏడాది జూన్‌లో జీరో నుంచి 11శాతం వరకూ ఉన్నట్లు వెల్లడించింది.




# భారత్‌లోకి మళ్లీ టిక్‌టాక్!

## నియామకాలకు నోటిఫికేషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** భారత్‌లోనిషేధం ఎదుర్కొంటున్న ప్రముఖ సోషల్‌మీడియా యాప్ టిక్‌టాక్ తాజా ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసింది. గురుగ్రామ్‌లోని తన ఆఫీస్‌లో 2 ఖాళీలను భర్తీచేయనున్నట్లు పోస్టుచేసింది. వీటిలో ఒకటి కంటెంట్ మోడరేటర్ బెంగాలీ మాట్లాడే అభ్యర్థి, మరొకటి మంచి భాగస్వామ్యం, కార్యకలాపాల నాయకత్వానికి సంబందించినపోస్టులు. ఈ క్రమంలో టిక్‌టాక్‌సేవలు మళ్లీ భారత్‌లో అందుబాటులోకి వస్తున్నట్లుప్రచారం జోరందుకుంది. టిక్‌టాక్ వెబ్‌సైట్‌ను అనేకమందియాక్సెస్‌చేస్తున్నారు. అయితే దానిలోకి లాగిన్‌కావడం, విడియోలను చూడటం సాధ్యంకావడంలేదు. మరోవైపు కేంద్రం మాత్రం టిక్‌టాక్‌పై ఇప్పటికీ నిషేధం కొనసాగుతోందని స్పష్టంచేసింది. భారత్‌లో టిక్‌టాక్ సేవలను పునరుద్ధరించేందుకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదని అధికారులు తెలిపారు. ఆగస్టు 22న కూడా ఇలాంటి వార్తలను ప్రభుత్వం ఖండించింది. టిక్‌టాక్ వెబ్‌సైట్‌లోసేవలు అందుబాటులో లేవని చూపించేది. ఇపుడు మాత్రం అబౌట్ ఆజ్‌పేజీ ఓపెన్ అవుతోంది. కానీవిడియోలు కనిపించడంలేదు. యాప్‌కూడా ఆండ్రాయిడ్‌ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్‌చేయడానికి అందుబాటులోలేదు. భారత్‌లో టిక్‌టాక్‌సేవలను మేం పునరుద్ధరించడంలేదని భారత సర్కార్ ఆదేశాలు పాటిస్తున్నట్లు టిక్‌టాక్‌ప్రతినిధి తెలిపారు. బీజింగ్ న్యూఢిల్లీ సంబంధాలు వేగంగా పునరుద్ధరణజరుగుతున్న వేళ ఈ నియామకాలప్రకటన ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాగే యాడ్స్‌పైనా నిషేధం తొలగించవచ్చనే ప్రచారం యూజర్లమధ్య నలుగుతోంది.

# నేటినుంచి మారనున్న రూల్స్ ఇవిగో!

**ముంబయి, ఆగస్టు31:** ఆర్థికసంవత్సరంలో సెప్టెంబర్ నుంచి పలు రూల్స్ మారనున్నాయి. ఈనెలలో ఆదాయపు పన్ను రిటర్న్‌లు, యూపీఎస్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన నియమాలను మారనున్నాయి. అలాగే, ఎల్‌పీజీ ధరలు సైతం మారే సూచనలున్నాయి. ఐటీ ఆర్ దాఖలు చేసేందుకు చివరి తేదీ జులై 30 కాగా ఆదాయపు పన్నుశాఖ సెప్టెంబర్ వరకు పొడిగించింది. తప్పనిసరిగా సెప్టెంబర్ 15 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది.




లేకపోతే నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. యూపీఎస్‌ఎన్‌పీఎస్ అంటే నేషనల్ పెన్షన్ సిస్టమ్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 30లోగా ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. గతంలో జూన్ 30 వరకు గడువు ఉండగా సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించారు.

ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల రూల్స్‌ను మార్పులు చేసింది. సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. రూల్స్ ప్రకారం కొన్ని కార్డుల రివార్డ్ పాయింట్ల నిబంధనలను సవరించింది. ఇకపై డిజిటల్ గేమింగ్, ప్రభుత్వ వెబ్‌సైట్లలో లావాదేవీలపై రివార్డ్ పాయింట్లు పొందలేరు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఎల్‌పీజీ గ్యాస్ ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రతినెలా ఒకటో తేదీన చమురు కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సవరించే విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేపు ఎల్‌పీజీ ధరలు మారే అవకాశం ఉంది.

# రూ.17,200 కోట్లకు టాటా మెగా ఐపిఒ!

**న్యూఢిల్లీ,ఆగస్టు 31:** స్టాక్ మార్కెట్లలోకి మరో భారీ ఐపిఒ వస్తోంది. టాటా గ్రూప్‌లోని టాటాక్యాపిటల్ ఇపుడు తన తొలిపబ్లిక్ ఆఫరింగ్‌తో వస్తోంది. సెప్టెంబరు 22వ తేదీ రూ.17,200 కోట్ల విలువైన ఐపిఒను మార్కెట్‌కు తీసుకువస్తోంది. ఈ ఐపిఒద్వారా టాటా క్యాపిటల్‌కి దాదాపు 11 బిలియన్ డాలర్లు అంటే రూ.91 వేల కోట్లకుపైగా విలువలుపెరుగుతాయని అంచనాలున్నాయి. మొత్తం 47.58 కోట్ల షేర్లు అమ్మకానికి వస్తున్నాయి. వీటిలో 21కోట్ల షేర్లు కొత్తగా ఇష్యూ అవుతాయి. 26.58 కోట్ల షేర్లు ఆఫర్‌ఫర్‌సేల్ అంటే ఒఎఫ్‌ఎస్‌ద్వారా ప్రస్తుత వాటాదార్లు విక్రయిస్తారు. టాటాసన్స్ 23 కోట్ల షేర్లు విక్రయిస్తుంది. ఐఎఫ్‌సి అంటే ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ 3.58 కోట్లషేర్లు అమ్ముతోంది. ప్రస్తుతం టాటాసన్స్ టాటాక్యాపిటల్‌లో 88.6శాతం వాటాతో ఉంది. ఐఎఫ్‌సి వద్ద 1.8శాతం వాటాలున్నాయి. ఈ ఐపిఒద్వారా వచ్చే నిధులు మూలధన బేస్ పెంచేందుకు వినియోగిస్తామని తెలిపింది. జూన్‌లో హెచ్‌డిబి ఫైనాన్షియల్ 12,500 కోట్లకు ఐపిఒకు వచ్చింది. తొలిరోజు లిస్టింగ్‌లో బజాజ్‌హౌసింగ్ ఫైనాన్స్‌కూడా 135శాతం ప్రీమియంతో ముగిసింది. టాటా క్యాపిటల్‌మొత్తం రుణాలు రూ.2.26 లక్షలకోట్లకు చేరాయి. 2025లో సంస్థ లాభం 3646.6 కోట్లుగా ఉంది. 2023లో 3029.2కోట్లతో పోలిస్తే 10శాతం వార్షిక వృద్ధిని నమోదుచేసింది. స్థూల రానిబాకీలు 1.9శాతంతో తక్కువగానే ఉన్నాయి. నికర పారుబాకీలు 0.8శాతంమాత్రమే ఉన్నాయి. 2007లో వ్యాపారం ప్రారంభించిన టాటా క్యాపిటల్ ఇప్పటివరకూ 70 లక్షలమంది కస్టమర్లకు సేవలందించినట్లు వెల్లడించింది.

# పాస్‌వర్డ్‌లు వెంటనే మార్చుకోండి..

## 2 ఎస్వీ అమలుచేయండి..

## జిమెయిల్ కస్టమర్లకు గూగుల్ హెచ్చరిక




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** జీమెయిల్ ఖాతాదారులకు గూగుల్ అత్యవసర హెచ్చరికలు జారీచేసింది. 2.5 బిలియన్ జిమెయిల్ ఖాతాదారుల పాస్‌వర్డ్‌లు ప్రమాదంలో ఉన్నాయని వెంటనే మార్చుకోవాలనిహెచ్చరించింది. సైబర్‌సెక్యూరిటీ బలోపేతంకావాలంటే వెంటనే పాస్‌వర్డ్ మార్చుకోవాలని అలాగే టూస్టెప్ వెరిఫికేషన్ అంటే టూఎస్వీని తప్పనిసరిగా వర్తింపచేసుకోవాలని సూచించింది. హ్యాకింగ్ కుట్రలు భారీగాపెరగడంతో కస్టమర్లు అప్రమత్తం కావాలని, హ్యాకింగ్ వెనక షైనీ హంటర్స్ అనే అంతర్జాతీయ హ్యాకర్లముఠా ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. 2020 నుంచి యాక్టివ్‌గా ఉన్న ఈగ్రూప్‌పై ఇప్పటికే ఎటిఅండ్‌టి, మైక్రోసాఫ్ట్, సాంటాండర్, టికెట్‌మాస్టర్ వంటి సంస్థల డేటాలీక్ కేసుల్లోప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఈ హ్యాకర్లు ఫిషింగ్‌ఫద్దతిని ప్రధాన ఆయుధంగా వాడుతున్నారని గూగుల్ తెలిపింది. నకిలీ ఇమెయిళ్లు పంపించి యూజర్లను వేరే లాగిన్‌పేజీలలోకి మళ్లించడం, సెక్యూరిటీ కోడ్‌లు సహా కీలక సమాచారాన్ని దోచుకోవడం వీరి ప్రధాన వ్యూహం. గూగుల్‌జూన్‌లోనే ఒక బ్లాగ్‌పోస్ట్‌లో షైనీ హంటర్స్‌గ్రూప్ డేటా లీక్‌సైట్‌ప్రారంభించడానికి సిద్ధమవుతోందని భావిస్తున్నట్లు గూగుల్ తెలిపింది సున్నితమైన సమాచారం దోపిడీ అవుతుందని గుర్తించాలని కోరింది. పాస్‌వర్డ్ మార్చుకోవడంతోపాటు 2ఎస్వీని వెంటనే అమలుచేసుకోవాలని సూచించింది. 2ఎస్వీ ప్రారంభిస్తే దొంగలు అకౌంట్‌లోకి చొరబాటుచేయలేరని అన్నారు. బ్రిటన్‌లోని యాక్షన్‌ఫ్రాడ్‌కూడా ఇమెయిళ్లు సురక్షితంగా ఉంచుకోవాలని తెలిపింది. జిమెయిల్‌కే కాకుండా బ్యాంకింగ్, షాపింగ్, సోషల్‌మీడియా ఖాతాలన్నింటి సర్వీసుల్లోను 2ఎస్వీ ఆప్షన్ అందుబాటులో ఉంది. సెక్యూరిటీసెట్టింగ్స్‌లో టూఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌లేదా మల్టీఫ్యాక్టర్ ఆథెంటికేషన్ పేరుతో అందుబాటులో ఉంటుందని గూగుల్ స్పష్టంచేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.